
పెదకండ్లగుంటలో గున్యాతో బాధపడుతున్న రమణయ్య

కొండపి మండలంలోని పెదకండ్లగుంటలో చికున్ గున్యా విజృంభించింది. ఇప్పటికే 50మంది దీని బారిన పడ్డారు. అనేక మంది నడవలేని స్థితిలో మంచం పట్టారు. కీళ్లనొప్పులతో కదలలేకపోతున్నారు. కొందరు కర్రల సాయంతో నడుస్తున్నారు. వయసు మీరిన వారు దోగాడాల్సి వస్తున్నదని పలువురు వివరించారు. వైద్యారోగ్యశాఖ అధికారులు స్పందించి గ్రామంలో శిబిరం ఏర్పాటు చేసి మందులు ఇవ్వాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మార్కాపురం ప్రాంతంలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. మార్కాపురం ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు రోజుకు 350మంది రోగులు వస్తుండగా అందులో 100 మందికిపైగా జ్వరపీడితులు ఉంటున్నారు. ప్రైవేటు వైద్యశాలలు, ఆర్‌ఎంపీల వద్దకు రోజుకు 500 మందికిపైగానే జ్వరాలతో బాధపడుతున్న వారు వచ్చి వైద్యం చేయించుకుంటున్నారు.


మార్కాపురంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో జ్వరపీడితులు

జిల్లాలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. గ్రామాలకు గ్రామాలు మంచం పడుతున్నాయి. ఎక్కువ మంది గున్యా లక్షణాలతో బాధపడుతున్నారు. తీవ్రత అధికంగా ఉన్న వారు జిల్లా కేంద్రంలోని ప్రైవేటు వైద్యశాలల్లో చేరుతున్నారు. ఆర్థికస్థోమత లేని వారు ఇంటి వద్దనే ఉండి స్థానిక వైద్యుల వద్ద చికిత్స చేయించుకుంటున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులను మాత్రమే పరిగణనలోకి తీసుకొని డెంగ్యూ కేసులు నమోదు కావడం లేదని వైద్యారోగ్యశాఖ అధికారులు చెప్తున్నప్పటికీ ప్రైవేటు వైద్యశాలల్లో రోజుకు 50 నుంచి 70కిపైగా ఈ కేసులు బయటపడుతున్నట్లు తెలుస్తోంది. డెంగ్యూ పేరుతో ప్రైవేటు వైద్యశాలల నిర్వాహకులు రోగుల నుంచి రూ.వేలకు వేలు పిండుకుంటున్నారు. మలేరియా కేసులు తక్కువగానే ఉన్నా టైఫాయిడ్ కేసులు ఓ మోస్తరుగా నమోదవుతున్నాయి. అధిక వర్షాలు, పారిశుధ్య లోపమే వ్యాధుల వ్యాప్తికి ప్రాధాన కారణమైంది.

వామ్మో జ్వరం

పది రోజుల్లో 16 వేల కేసులు

ఎక్కడచూసినా బాధితులే


ఒంగోలులోని రిమ్స్‌లో చికిత్స పొందుతున్న జ్వర బాధితులు

- ఎక్కువ మందికి గున్యా, మలేరియా
- అక్కడక్కడా డెంగ్యూ కేసులు
- మంచంపడుతున్న గ్రామాలు
- కిటకిటలాడుతున్న ఆసుపత్రులు

జిల్లావ్యాప్తంగా నమోదైన కేసుల వివరాలు ఇవీ..

జనవరి నుంచి ఇప్పటి వరకు విష జ్వరాల కేసులు : 4.60లక్షలు

డెంగ్యూ కేసులు : 322

గత పది రోజుల్లో విష జ్వరాల బారిన పడిన వారు : 16,000

మలేరియా కేసులు : 36

భారీగా గున్యా కేసులు నమోదు

ఒంగోలు(కలెక్టరేట్)/మార్కాపురం/కొండపి, డిసెంబరు 4 : జిల్లావాసులను సీజనల్ వ్యాధులు పట్టిపీడిస్తున్నాయి. ముఖ్యంగా విష జ్వరాలు వణికిస్తున్నాయి. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా అన్నిచోట్లా జ్వరపీడితులు కన్పిస్తున్నారు. పది రోజుల నుంచి తీవ్ర అధికమైంది. వర్షాల కారణంగా దోమల ఉత్పత్తి పెరగడం, నీటి నిల్వలు చేరడం, పారిశుధ్యం అంతంతమాత్రంగా ఉండటమే వ్యాధుల వ్యాప్తికికారణమైంది. దీంతో వైద్యశాలలు బాధితులతో కిటకిటలాడుతున్నాయి. ముందుగా స్థానికంగా ఉండే ఆర్‌ఎంపీలు, పీఎంపీల వద్ద వైద్య సేవలు పొంది అక్కడ తగ్గకపోతే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్తున్నారు. అక్కడ కూడా నయంకాకపోవడంతో ప్రైవేటు వైద్యశాలల్లో చేరుతున్నారు. విషజ్వరాలు ప్రధానంగా మార్కాపురం, కనిగిరి డివిజన్‌తోపాటు ఒంగోలు డివిజన్‌లో జిల్లాకేంద్రమైన ఒంగోలు, చీమకుర్తి, కొండపి మండలాల్లో మరింత ఎక్కువగా ఉన్నాయి.

పెరుగుతున్న బాధితులు

జిల్లావ్యాప్తంగా అధికారుల లెక్కల ప్రకారం పది రోజుల వ్యవధిలో 16వేల మందిపైగా విష జ్వరాల బారినపడటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో సాధారణ వైరల్ ఫీవర్‌తోపాటు డయోరియా, గున్యా, చికెన్ ఫాక్స్, మలేరియా, డెంగ్యూ కేసులు కూడా నమోదవుతున్నాయి. విస్తారంగా కురుస్తున్న వర్షాలతో ప్రజానీకం వైరల్ ఫీవర్ బారిన పడుతున్నా పంచాయతీ పాలకవర్గాలు పారిశుధ్య నిర్వహణ గురించి పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అధికారులు కూడా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

నమోదుకాని వారెందరో..

ప్రైవేటు వైద్యశాలల్లో కొన్నిరకాల వ్యాధులను మాత్రమే నమోదు చేస్తుంటారు. మిగిలిన వాటిని నమోదు చేసే పరిస్థితి లేదు. ఇక ప్రతి గ్రామంలో ఆర్‌ఎంపీలు, పీఎంపీలు విస్తరించారు. వారి వద్ద కూడా ప్రతిరోజూ వందలాది మంది జ్వరాలు, ఇతర వ్యాధులకు చికిత్స పొందుతున్నారు. అటువంటి వారి లెక్కలు నమోదు కావడం లేదు. ఇక జిల్లావ్యాప్తంగా అనేక రకాల వ్యాధుల బారిన పడి మెరుగైన చికిత్స కోసం ఇతర జిల్లాలకు వెళ్లిన వారు కూడా కనిపిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా ఈ విధంగా ప్రజానీకం వ్యాధుల బారిన పడుతున్నా వైద్యారోగ్యశాఖ మాత్రం కదలడం లేదు. గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహించి ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఇవ్వాల్సి ఉన్నా పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది.

ఫీవర్ సర్వే ఎక్కడ?

వైద్యారోగ్యశాఖ ద్వారా ఎప్పటికప్పుడు గ్రామాల్లో పరిస్థితుల అవగాహన కోసం ఫీవర్ సర్వే నిర్వహించాల్సి ఉంది. దీని ద్వారా కుటుంబంలో ఎవరికి జర్వాలు ఉన్నాయి, ఇంకేమైనా వ్యాధులు ఉన్నాయా.. అని తెలుసుకునే అవకాశం ఉంది. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండాపోయింది. దీంతో ఎంతమందికి వైరల్ ఫీవర్ ఉందో కూడా అధికారికంగా లెక్కలు తేలడం లేదు. కేవలం ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చిన కేసులను నమోదు చేసుకొని మమ అనిపిస్తున్నారు.


పాల ఉత్పత్తులను పరిశీలిస్తున్న గోపాల్‌రెడ్డి

విజయగోపాలుడు

పదో తరగతి చదివి..
పాల వ్యాపారంలో విజేతగా నిలిచి..

- చిన్న పాడి పరిశ్రమతో మొదలై రూ.25 కోట్ల టర్నోవర్‌కు చేరిన వైనం
- రెండు తెలుగు రాష్ట్రాలకు పాలు, పెరుగు, మజ్జిగ, నెయ్యి సరఫరా
- రోజుకు 15వేల లీటర్ల పాల విక్రయాలు
- నిత్యం వంద మందికి ఉపాధి

7



సైకిల్‌పై మిత్రుల దేశ పర్యటన

కాలుష్య రహిత సమాజం కోసమే యాత్ర

7

భూ సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండా

- రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు
- గ్రామాల వారీ నిర్వహణకు షెడ్యూల్
- వచ్చిన వినతుల్లో అవకాశం ఉన్నవి అక్కడికక్కడే పరిష్కారం
- దేవదాయ, రిజిస్ట్రేషన్ శాఖలూ భాగస్వామ్యం
- ప్రజాప్రతినిధులకు కూడా ఆహ్వానం

6


కారులో ఎస్పీ కార్యాలయానికి వెళ్తున్న గుంటూరు జీజీహెచ్ సిబ్బంది

మెడికల్ రిపోర్టులో ఏమి జరిగింది?

- కొనసాగుతున్న రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసు విచారణ
- జిల్లా పోలీసు కార్యాలయానికి గుంటూరు జీజీహెచ్ సిబ్బంది
- ప్రశ్నించిన ఎస్పీ దామోదర్
- పలు అంశాలపై సమాచారం

వివరాలు మెయిన్‌లో..


పామూరు వద్ద నీటిలో ఉన్న మిర్చి పైరును పరిశీలిస్తున్న ఉద్యానవన అధికారులు

వీడని వాన..


- మూడు రోజుల్లో 45.10 మి.మీ సగటు వర్షపాతం
- సగం మండలాల్లో భారీ వర్షం
- దక్షిణ, తూర్పుప్రాంతంలో అధికం
- దెబ్బతింటున్న పొగాకు, శనగ, ఇతర పైర్లు
- మరింత ఉధృతంకానున్న తెగుళ్లు
- పంట దిగుబడులపైనా తీవ్ర ప్రభావం

ఒంగోలు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి)/కలెక్టరేట్ : జిల్లాను వాన వీడలేదు. ఆదివారం రాత్రి నుంచి అత్యధిక ప్రాంతాల్లో వర్షం పడుతూనే ఉంది. ఐదురోజులు ముందు నుంచి తుపాన్ ప్రభావంతో వాతావరణంలో మార్పు వచ్చి పంటలపై తెగుళ్ల, పురుగుల దాడి పెరిగింది. మూడు రోజులుగా పడుతున్న వర్షాలు, తాజా వాతావరణ పరిస్థితితో అవి మరింత ఉధృతమయ్యాయి. ప్రధానంగా కంది, మిర్చి, ముదురు పొగతోటలు, మినుము వంటి పంటలపై చీడపీడల తీవ్రత అధికంగా ఉంది. దాని వల్ల పంట ఉత్పత్తులు గణనీయంగా తగ్గిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక ఆదివారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలతో లేత పొగాకు తోటలు, శనగ, వరి పంటలు దెబ్బతింటున్నాయి. ఆదివారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు మూడు రోజుల్లో 45.10 మి.మీ సగటు వర్షపాతం జిల్లాలో నమోదైంది.

సీఎస్‌పురం మండలంలో అత్యధికం

సాధారణంగా డిసెంబరులో పెద్దగా వర్షాలు ఉండవు. కానీ ఈసారి నెల మొత్తం సగటు కన్నా అధికంగా పడింది. ప్రత్యేకించి జిల్లా దక్షిణ, తూర్పు ప్రాంతంలోని కనిగిరి, కొండపి, ఒంగోలు, ఎస్‌ఎన్‌పాడు నియోజకవర్గాలతోపాటు గిద్దలూరు నియోజకవర్గంలోని కొన్ని మండలాల్లో భారీ వర్షాలే కురిశాయి. అత్యధికంగా సీఎస్‌పురం మండలంలో ఈ మూడు రోజుల వ్యవధిలో ఏకంగా 139.40 మి.మీ వర్షపాతం నమోదైంది. వెలిగండ్లలో 128.60, పీసీపల్లిలో 91.8, పామూరులో 91.20, కొమరోలులో 89.20, కనిగిరిలో 78.40, హెచ్‌ఎంపాడులో 75.70, కొండపిలో 75.6, పొన్నలూరులో 74.60, గిద్దలూరులో 73.0, మద్దిపాడులో 70.7, ఎన్‌జీపాడులో 58.20, సింగరాయకొండలో 54.80 మి.మీ నమోదైంది. కొత్తపట్నం 54.40, జరుగుమల్లి 47.90, కంభంలో 46.35, ఎస్‌ఎన్‌పాడులో 46.0, ఒంగోలులో 41.20 మి.మీ కురిసింది. మరో పది మండలాల్లో ఒక మోస్తరు

మిగతా 6వ పేజీలో


చెరువుకొమ్ముపాలెంలో ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న ప్రైవేటు వ్యాపారులు

దిగజారిన ధాన్యం ధరలు

- ఏర్పాటు కాని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు
- తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు
- తీవ్రంగా నష్టపోతున్న అన్నదాతలు

దర్శి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ధాన్యం రైతులను ప్రైవేట్ వ్యాపారులు దగా చేస్తున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటను తక్కువ ధరలకు కొనుగోలు చేస్తూ దోచుకుంటున్నారు. అధికారులు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు గురించి పట్టించుకోవడం లేదని రైతులు అంటున్నారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవటంతో నిల్వ ఉంచితే మరింత నష్టపోవాల్సి వస్తుందన్న భయంతో వ్యాపారులు అడిగిన మేరకు తక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు చెప్తున్నారు.

అమలుకాని మద్దతు ధర

ప్రస్తుతం ప్రైవేట్ వ్యాపారులు 75 కేజీల బస్తాను రూ.1,400కు కొనుగోలు చేస్తున్నారు. కొంతమంది తరుగు కింద మరో మూడు కేజీలు అదనంగా తీసుకుంటున్నారు. ప్రభుత్వం గ్రేడ్-1 రకానికి 75 కేజీల బస్తాకు రూ.1,740, సాధారణ రకానికి రూ.1,725 మద్దతు ధర నిర్ణయించింది. కేంద్రాలు ఆరంభమైతే ఆ మేరకు రైతులకు గిట్టుబాటు ధర లభించేది. ఇప్పటి వరకు ఎక్కడా కేంద్రాలు ఆరంభం కాకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులపై ఆధారపడాల్సి వస్తోంది. తుఫాన్ ప్రభావంతో నాలుగు రోజులుగా తరచూ చిరుజల్లులు పడుతుండటంతో రైతుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. భారీ వర్షం కురిస్తే కళ్లాల్లో ఉన్న ధాన్యం తడిసిపోతుందని ఆందోళన చెందుతున్నారు. సన్న, చిన్నకారు రైతులు ధాన్యాన్ని ఇళ్లల్లో నిల్వ చేసుకునే అవకాశం లేక కళ్లాలు చేసిన వెంటనే తక్కువ దరకు విక్రయిస్తున్నారు. దీంతో బస్తాకు రూ.300పైగా రాబడిని కోల్పోతున్నారు. అధికారులు మార్కెటింగ్‌లో జరుగుతున్న దోపిడీని గుర్తించి వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

మహిళా మార్ట్.. మోసాలకు అడ్డా

ఒంగోలు నగరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పేద మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న పథకాలను వెలుగు ఉద్యోగులు ఆదాయవనరుగా మార్చుకుంటున్నారు. ఇందుకు మద్దిపాడులోని మహిళా మార్ట్‌నే ఉదాహరణ. పొదుపుసంఘాల మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏడాదిన్నర క్రితం రూ.35 లక్షలతో మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేశారు. ఆ డబ్బును ఆ మండలంలోని పొదుపు సంఘాల నుంచి వసూలు చేశారు. బహిరంగ మార్కెట్ కంటే తక్కువ ధరకే వినియోగదారులకు సరుకులు అందించాలన్నదే దీని ఉద్దేశం. ఇందులో భాగంగా మండలంలోని వెలుగు అధికారులు మద్దిపాడు సెంటర్‌లో రూ.25వేల నెల అద్దెకు ఒక భవనం తీసుకున్నారు. అందులో మార్ట్ పెట్టి, దాని నిర్వహణ బాధ్యతలను చూసేందుకు మహిళా సంఘాలతో సబ్ కమిటీని నియమించారు. కానీ ఈ కమిటీని డమ్మీ చేసి వెలుగు ఏపీఎం, సీసీలే మార్ట్ నిర్వహణను చూసినట్లు తెలిసింది. మార్ట్‌లో ఉన్న సరుకులను అమ్మగా వచ్చిన సొమ్మును ఉద్యోగులు తమ జేబుల్లో వేసుకున్నారు. రూ.35లక్షలతో ఏర్పాటు చేసిన మార్ట్ ప్రస్తుతం పూర్తి నష్టాల్లో కూరుకుపోయింది.

రూ.5లక్షలు స్వాహా

మార్ట్‌లో సరుకులు అమ్మగా వచ్చిన రూ.5లక్షలకుపైగా సొమ్ము వెలుగు ఉద్యోగుల జేబుల్లోకి వెళ్ళినట్లు సమాచారం. ఈ విషయం బయటకు పొక్కటంతో రెండు రోజుల క్రితం జిల్లాకేంద్రం నుంచి ప్రత్యేక బృందం మద్దిపాడులోని మార్ట్‌లో విచారణ చేపట్టింది. ప్రత్యేకంగా ఆడిటర్‌ను కూడా పంపించారు. ఈ బృందం విచారణలో అనేక అక్రమాలు

మిగతా 6వ పేజీలో



- మద్దిపాడులో రూ.లక్షల్లో గోల్‌మాల్
- లెక్కతేల్చిన వెలుగు అధికారులు
- నాలుగు రోజులుగా నిలిచిన అమ్మకాలు
- సరుకు విక్రయించి సొమ్మును జేబుల్లో వేసుకున్న వెలుగు సిబ్బంది
- వైసీపీ మాజీ ఎమ్మెల్యే పేరుతో రూ.70వేల నిత్యావసరాలు పక్కదారి

శిశు విక్రయం కేసు చీమకుర్తిలో నమోదు

- ఇద్దరి మహిళలను అదుపులోకి తీసుకొని విచారిస్తున్న పోలీసులు
- అమ్మకం రిమ్స్‌లో జరగలేదని సూపరింటెండెంట్ వివరణ
- సుమోటోగా తీసుకున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్

6

శిశు విక్రయం కేసు చీమకుర్తిలో నమోదు

నిందితులను విచారిస్తున్న పోలీసులు

ఒంగోలు క్రైం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శిశువును విక్రయించిన ఘటనకు సంబంధించి చీమకుర్తి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. చీమకుర్తి మండలం చంద్రపాడుకు చెందిన మహిళ తన పసికందును తీసుకొని బస్సులో ప్రయాణం చేస్తుండగా పొదిలికి చెందిన గుర్నాథం అరుణ పరిచయమైంది. మాటలు కలిపింది. తనకు ఐదుగురు ఆడపిల్లలని చంద్రపాడుకు చెందిన మహిళ చెప్పడంతో, వేరే వాళ్లకు పిల్లలు లేరు మీ పాపను ఇస్తావా.. అని అడిగింది. అందుకు పాప తల్లి అంగీకరించింది. దీంతో గత నెల 30న అరుణ పాప తల్లికి ఫోన్ చేసి బిడ్డను తీసుకొని వేటపాలెం రమ్మని చెప్పింది. వారు వెళ్లగా అక్కడ అరుణ కర్లపాలెంకు చెందిన ఎస్‌కె షబానాను పరిచయం చేసింది. అక్కడ మరికొంత మంది కూడా ఉన్నారని పాప తల్లి ఫిర్యాదులో పేర్కొంది. రూ.లక్షకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అందుకు సంబంధించి షబానా పాప తల్లికి రూ.50వేలు ఇచ్చినట్లు తెలిపింది. పాపను ఇచ్చి అక్కడి నుంచి అందరూ వచ్చేశారు. అయితే తల్లికి బిడ్డ గుర్తురావడంతో చీమకుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం కేసు నమోదు చేసి పాపను కర్లపాలెం నుంచి తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. షబానా, మధ్యవర్తిగా ఉన్న అరుణలను చీమకుర్తి పోలీసులు విచారిస్తున్నారు.

శిశువు విక్రయం రిమ్స్‌లో జరగలేదు : సూపరింటెండెంట్ వివరణ

రిమ్స్‌లో ఎలాంటి శిశు విక్రయాలు జరగలేదని జీజీహెచ్ సూపరింటెండెంట్ టి.జమున తెలిపారు. బాధితురాలు చీమకుర్తి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పొదిలికి చెందిన మహిళ బస్సులో పరిచయమైనట్లు పేర్కొన్నారని ఆమె వివరించారు.

28 రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తున్నారు

● అఖిల భారత మాలసంఘాల రాష్ట్ర జేఏసీ చైర్మన్ దేవీప్రసాద్


మాట్లాడుతున్న ఉప్పులేటి దేవీప్రసాద్

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దేశంలో మనువాదానికి, అంబేడ్కర్ వాదానికి యుద్ధం జరుగుతుందని, దీనిలో భాగంగానే ఎస్సీ వర్గీకరణ అని అఖిల భారత మాల సంఘాల రాష్ట్ర జేఏసీ చైర్మన్ ఉప్పులేటి దేవీప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం ఒంగోలులోని అంబేడ్కర్‌భవన్‌లో నిర్వహించిన మాలల ఆత్మీయ సమ్మేళనానికి జైభీమ్ నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా దేవీప్రసాద్ ముఖ్య వక్తగా హాజరై మాట్లాడారు. దేశంలో 28 రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తున్నారన్నారు. కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే వర్గీకరణ అంశంపై ప్రధానంగా పైకొచ్చిందని, మాదిగ సోదరులు వర్గీకరణ వల్ల జరిగే నష్టాన్ని గుర్తించడం లేదని ఆయన పేర్కొన్నారు. దీనివల్ల భవిష్యత్‌లో క్రిమిలేయర్ భూతం పొంచివుందన్నారు. ఉమ్మడి ఆస్తి అయిన రిజర్వేషన్‌ను ఎవరు పంచుకునేది లేదని, అది అందరికీ సమానంగా దక్కుతుందని చెప్పారు. దళితులను చీల్చే కుట్రలో భాగమే ఎస్సీ వర్గీకరణ అన్నారు. డిసెంబరు 15న గుంటూరు జిల్లా నల్లపాడులో జరిగే మాలల సింహగర్జనకు మాలలందరు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రముఖ గాయకుడు రెంజర్ల రాజేష్, మాలలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారమే ప్రధాన అజెండా

● రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు ● గ్రామాల వారీ నిర్వహణకు షెడ్యూల్ ● దేవదాయ, రిజిస్ట్రేషన్ శాఖలూ భాగస్వామ్యం ● ప్రజాప్రతినిధులకు కూడా ఆహ్వానం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భూసమస్యల పరిష్కారంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. గత వైసీపీ హయాంలో పట్టాభూములతోపాటు అసైన్డ్, దేవదాయ, చుక్కల భూములను దోచేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున భూముల ఆక్రమణలు జరిగినట్లు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అలాగే వారంవారం జరిగే గ్రీవెన్స్‌సెల్‌తోపాటు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉన్నతాధికారులను కలిసి పలువురు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయా సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులోభాగంగా శుక్రవారం నుంచి వచ్చే ఏడాది జనవరి 8వతేదీ వరకు గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ఆదేశించింది. అందుకనుగుణంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా నేతృత్వంలో జిల్లాలోని 38 మండలాల్లో సదస్సుల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా షెడ్యూల్ కూడా రూపొందించారు.

సమస్యలపై అర్జీల స్వీకరణ

గ్రామ సదస్సుల్లో రెవెన్యూతోపాటు దేవదాయ, రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు కూడా పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రధానంగా గ్రామాల్లో ఫ్రీహోల్డ్ భూములతోపాటు 22(ఏ), ప్రభుత్వ భూముల ఆక్రమణలను గుర్తింపు, భూములు ఉండి ఆన్‌లైన్ కాకపోవడం, పలు రకాల ఇతరత్రా సమస్యలపై గ్రామ సభల్లో అర్జీలను స్వీకరించనున్నారు. అనంతరం వాటిని కంప్యూటరీకరించి నిర్దిష్ట గడువులోపు పరిష్కరించాల్సి ఉంది. ఇప్పటికే జిల్లాలో అన్యాక్రాంతమైన లక్షలాది ఎకరాల ప్రభుత్వ భూములపై కూడా ప్రత్యేక దృష్టిసారించారు. వాటన్నింటినీ గ్రామాల వారీగా గుర్తించేందుకు రెవెన్యూ యంత్రాంగం సిద్ధమైంది.

40వేల ఎకరాల దేవుడి భూములు అన్యాక్రాంతం

జిల్లాలో దేవదాయ భూములు కూడా 40వేల ఎకరాలు అన్యాక్రాంతమైనట్లు ఇప్పటికే ఆ శాఖ తేల్చింది. వాటిని కూడా గుర్తించేందుకు చర్యలు చేపట్టారు. ప్రజలకు సంబంధించి ఇతర రెవెన్యూ సమస్యలపై కూడా సదస్సుల్లో అర్జీలు తీసుకొని అవకాశం ఉన్న వాటిని అక్కడికక్కడే పరిష్కరించనున్నారు. కుటుంబ సమస్యల కారణంగా నెలకొన్న భూ సమస్యలపై కూడా దృష్టి సారించినట్లు సమాచారం. సదస్సుల నిర్వహణపై ఇప్పటికే కలెక్టర్ తమీమ్ అన్సారియా సబ్‌కలెక్టర్, ఆర్డీవోలు, మండల తహసీల్దార్లకు దిశానిర్దేశం చేశారు. ఆమె ఆదేశాల మేరకు తహసీల్దార్లు గ్రామాల వారీ షెడ్యూల్‌ను రూపొందించారు. శుక్రవారం నుంచి సదస్సుల నిర్వహణకు సిద్ధమయ్యారు.

ప్రాంగణం..భయం..భయం

» చిట్టడవిలా మారిన ఆట స్థలం
» కస్తూర్బా గాంధీకి ఉదారంగా ఇచ్చిన దాతలు
» అభివృద్ధి చేయాలని మంత్రి గొట్టిపాటికి విజ్ఞప్తి చేసిన ఉపాధ్యాయులు
» వెంటనే బాగు చేయించాలని కోరుతున్న విద్యార్థినులు


విద్యాలయం ఆట స్థలంలో దట్టంగా ఉన్న ముళ్లపొదలు

బల్లికురవ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కస్తూర్బా బాలికలు ఆడుకునేందుకు దాతలు ఇచ్చిన స్థలం వృథాగా పడి ఉంది. రోజూ ఆటలు ఆడుకోవాల్సిన విద్యార్థినులు ముళ్ల పొదలు చూసి భయంతో తరగతులకే పరిమితమవుతున్నారు. లక్షలు విలువైన ఆట స్థలాన్ని ఉదారంగా ఇచ్చిన దాతలు చిట్టడవిలా ఉండడం చూసి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే ఆటలు ఆడుకునేందుకు వీలుగా ప్రాంగణాన్ని అభివృద్ధి పరచాలని కోరుతున్నారు.

బల్లికురవ మండలం గుంటుపల్లి గ్రామ పరిధిలో గత రెండు దశాబ్దాల కిందట బడి మానేసిన బాలికలకు మెరుగైన విద్యను అందించాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక కృషితో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. విద్యాలయానికి అవసరమైన ఐదు ఎకరాల స్థలాన్ని గుంటుపల్లి గ్రామస్థులు ఉచితంగా ఇచ్చారు. కొంత కాలం కిందట విద్యాలయంలో ఇంటర్ తరగతులను కూడా ప్రారంభించారు. బాలిక అవసరానికి దాతలు ఇచ్చిన స్థలంలో ప్రస్తుతం ముళ్ల పొదలు పెద్ద ఎత్తున అలుముకున్నాయి. దీంతో కాసేపు ఆటలు ఆడుకునేందుకు పిల్లలు భయపడుతున్నారు. తరగతి గదుల నుంచి ఒక్కరూ బయటకు రావడం లేదు. విద్యాలయం చుట్టూ పొలాలు ఉండడం, ఆటస్థలం అడవిలా మారడంతో పాములు, విషపురుగులు వస్తాయని విద్యార్థినులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో క్రీడా స్థలాన్ని కొంత అభివృద్ధి చేసినప్పటికీ తిరిగి ముళ్లచెట్లు బాగా పెరిగిపోవడంతో ఆటలు ఆడేందుకు వీలులేకుండా పోయిందని అంటున్నారు. కేజీబీవీ క్రీడా ప్రాంగణం దుస్థితిని ఇటీవల బల్లికురవ వచ్చిన మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

వెంటనే ప్రాంగణం అభివృద్ధికి చొరవచూపాలని కోరినట్లు చెప్పారు. దీనిపై మంత్రి స్పందిస్తూ ఉపాధి పథకం కింద ఆట స్థలాన్ని అభివృద్ధి చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇప్పటికైనా అధికారులు ప్రాంగణం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్థులు కోరుతున్నారు.

20లోగా కవిత్వ పోటీలు నిర్వహించండి

ఇంకొల్లు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆంధ్రసారస్వత పరిషత్ ఆధ్వర్యంలో జరగనున్న తెలుగు కవిత్వ పోటీలను ఈ నెల 20వ తేదీలోగా నిర్వహించాలని పరిషత్ జిల్లా సంచాలకులు పిడపర్తి పేరిరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. పోటీలలో ప్రథమ విజేత జిల్లా స్థాయి పోటీకి అర్హులన్నారు. జిల్లా స్థాయిలో మొదటి, ద్వితీయ, తృతీయ విజేతలకు రూ.1000, రూ.750, రూ.500 నగదు బహుమతిని అందజేస్తారన్నారు. పూర్తి వివరాలకు 9492274525కు సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మేదరమెట్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కొరిశపాడు సబ్ స్టేషన్ పరిధిలో నూతనంగా బ్రేకర్ ఏర్పాటు చేస్తున్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు మధ్యాహ్నం 3 గంటల నుండి 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

వీడని వాన

(5వ పేజీ తరువాయి)

వర్షాలు పడ్డాయి. భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో పొగాకు మొక్కలు, శనగ పైరు నీటిలో మునిగిపోయాయి. పొట్టదశలో ఉన్న వరి నేల వాలింది. కొన్నిచోట్ల వరినాట్లు కూడా నీట మునిగాయి. మినుము, అలసందలో కూడా అక్కడక్కడా నీరు నిలిచింది. దీంతో వేలాది ఎకరాల్లో పైర్లు ఉరకెత్తి దెబ్బతినే ప్రమాదం ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక వర్షం కాస్తంత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో సైతం మిర్చి, కంది ఇతర పంటలపై తెగుళ్లు, పురుగుల ఉధృతి మరింత పెరిగాయి. దీంతో దిగుబడులు తగ్గుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ముదురు పొగతోటలలో వర్షాలకు ఆకులపై ఉన్న మడ్డి కారిపోయి నాణ్యత గణనీయంగా తగ్గి నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. బుధవారం పగటిపూట కూడా జిల్లాలోని పలుప్రాంతాల్లో వర్షం పడుతూనే ఉంది.

జిల్లాలో 2,198 హెక్టార్లలో పంటలకు నష్టం

జిల్లాలో తాజా వర్షాలతో పలురకాల పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో కనిగిరి నియోజకవర్గంలో కనిగిరి, వెలిగండ్ల, సీఎస్‌పురం, పామూరు, గిద్దలూరు నియోజకవర్గంలోని కొమరోలు మండలాల్లో పలు రకాల పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. 64 గ్రామాల్లోని 2,115 మంది రైతులకు చెందిన 2,198 హెక్టార్లలో పంటలు నీట మునిగినట్లు గుర్తించారు. అందులో శనగ 1,547 హెక్టార్లు, వరి 54 హెక్టార్లు, మినుము 512 హెక్టార్లు, కంది 85 హెక్టార్లు ఉంది. ఆ మేరకు ప్రభుత్వానికి నివేదించారు.

శనగ సాగులో విత్తనశుద్ధి పాటించాలి

పంగులూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రైతులు పంట సాగులో విత్తనశుద్ధిని పాటించడం ద్వారా భూమిలో ఉన్న వ్యాధి కారక సిలింద్రాలను నశింపచేయవచ్చని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని ఆరికట్లవారిపాలెం, ముప్పవరం గ్రామాలలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. శనగ, పొగాకు పంటలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మాగులూరి వీరాంజనేయులు, మార్కెటింగ్, వ్యవసాయ శాఖ సిబ్బంది బాలకృష్ణ, అలెగ్జాండర్, దిల్షా, పలువురు రైతులు పాల్గొన్నారు.

వీఆర్వో సంఘ అధ్యక్షునిగా బాబయ్య

పంగులూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల వీఆర్వోల సంఘ అధ్యక్షునిగా అంబవరపు బాబయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల వీఆర్వో సంఘ నూతన కార్యవర్గ ఎన్నిక బుధవారం పంగులూరులో జరిగింది. సంఘ ఉపాధ్యక్షునిగా జండ్రాజుపల్లి వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా గుమ్మడి నాగు, కోశాధికారిగా ఉదయగిరి సుమతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారు తహసీల్దార్ సింగారావును మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని తహసీల్దార్ అభినందించారు.

వీవోల సంఘం నూతన కమిటీ

పంగులూరు : మండల వీవోఏల నూతన కార్యవర్గ ఎన్నిక బుధవారం జరిగింది. వీవోఏల సంఘ అధ్యక్షురాలిగా తోకచిచ్చు చిన్న, ఉపాధ్యక్షురాలిగా బొగ్గవరపు కల్పన, కార్యదర్శిగా మేక నాగమణి, సహాయ కార్యదర్శిగా బాచిన మనోరంజని, కోశాధికారిగా నాదెండ్ల లక్ష్మీతిరుపతమ్మను ఏకగ్రీంగా ఎన్నుకున్నారు.

చినబాబును పరామర్శించిన మంత్రి రవికుమార్

బల్లికురవ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కె.రాజుపాలెంకు చెందిన టీడీపీ నేత జాష్టి కృష్ణబాబు (చినబాబు) ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీ సుకుంటున్నారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఏఎంసీ మా జీ చైర్మన్ వెంకటనారాయణబాబు, టీడీపీ నేతలు ఉన్నారు.

జాతీయ సర్వే పరీక్షకు 350 మంది హాజరు

అద్దంకిటౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యార్థుల సామర్థ్యం సాధనను అర్థం చేసుకోవడానికి బుధవారం మండలంలోని 14 పాఠశాలలో 3, 6, 9 తరగతుల విద్యార్థులకు పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షన్ పేరుతో జాతీయ సర్వే కోసం పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో మొత్తం 360 మంది విద్యార్థులకు గాను 350 మంది హాజరైనట్లు ఎంఈవో గంగాధరరావు తెలిపారు ఈ పరీక్షలను ఫీల్డ్ పరిశీలకులు తనిఖీ చేశారు. పలు కేంద్రాలను ఎంఈవో 2 సుధాకరరావు పరిశీలించారు.


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో గంగాధరరావు

కూలీల ఆటోను ఢీకొట్టిన లారీ

ఏడుగురికి తీవ్రగాయాలు


చీరాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

చినగంజాం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆటోను గుర్తు తెలియని లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు మహిళా కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని పూలవారిపాలెం గ్రామ సమీపంలోని 216వ జాతీయ రహదారిపై బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం చినగంజాం గ్రామానికి చెందిన షేక్ పర్వీన్, షేక్ మస్తానీ కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని మూలగానివారిపాలెం గ్రామానికి చెందిన గుంజి లలిత, జానా మేరీ, సత్తాయిపాలెం గ్రామానికి చెందిన గాలంకి ప్రసన్న, రేపూరి సుమలత, భాగ్యనగర్ గ్రామానికి చెందిన పులిపాటి జ్యోతి వేటపాలెం మండలం పొట్టి సుబ్బయ్యపాలెంలోని రొయ్యల ఫ్యాక్టరీలో పని చేసేందుకు ప్రతి రోజూ వెళ్తూ ఉంటారు. వీరిని కడవకుదురు గ్రామ పంచాయతీ పరిధిలోని పాతపాడు గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి తన ఆటో లో తీసుకెళ్తుంటారు. ఈ నేపథ్యంలో బుధవా రం ఉదయం శ్రీనివాసరెడ్డి తన ఆటోలో 7మంది మహిళలను తీసుకొని వెళ్లి, ఫ్యాక్టరీలో పని అనంతరం చినగంజాం గ్రామానికి వస్తున్నారు. పూలవారిపాలెం సమీపంలోని జాతీయ రహదారిపై ఇసుక ట్రాక్టర్‌కు చింతకాయ ఊడిపోవడంతో ట్రాక్టర్‌ని అక్కడే ఉంచారు. జాతీయ రహదారిపై నిలిపిన ట్రాక్టర్‌ని ఆటో అధికమించే క్రమంలో ఒంగోలు వైపు నుంచి వస్తున్న లారీ ఆటోని ఢీకొట్టింది. ఈ ఘటనలో జ్యోతి, మస్తానీ, సుమలత, జాన్‌మేరి, పర్వీన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రసన్న, లలిత, ఆటో డ్రైవర్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. ఘటనా స్థలంలో మస్తాని ఎడమ చేయి విరిగిపడింది. చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం మస్తానీని గుం టూరుకు, సుమలతను ఒంగోలు వైద్యశాల కు తరలించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.


జానకిదేవిని సన్మానిస్తున్న పద్మశాలీ బహుత్తమ సంఘం

దేవునికి, భక్తులకు సేవ చేసే అదృష్టం

టీటీడీ పాలక మండలి సభ్యురాలు జానకిదేవి

చీరాల/ఈపూరుపాలెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర పుణ్యక్షేత్రంలో దేవునికి, భక్తులకు సేవ చేసుకునే భాగ్యం తనకు దక్కిందని టీటీడీ పాలక మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకిదేవి అన్నారు. ఇటీవల దేవస్థానంలో పాలక మండలిలో చోటు దక్కించుకున్న ఆమె మొదటిసారిగా స్వగ్రామమైన చీరాల మండలం ఈపూరుపాలెంలో శ్రీలక్ష్మీ అనంత పద్మనాభస్వామి దేవస్థాన కమిటీ ప్రతినిధులు ఏర్పాటు చేసిన అభినందన సభకు హాజరయ్యారు. ఈసందర్భంగా కమిటీ ప్రతినిధులు ఆమెను ఘనంగా సన్మానించారు. పార్టీకు చేసిన సేవలను గుర్తించి తనకు ఈ అవకాశం ఇచ్చిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గంజి సుబ్బారావు, బాలాజీ చిన్నారావు, ఆకురాతి పద్మిని, ఉమామహేశ్వరరావు, వెంకటరమణ, కాటూరి చెంబ య్య, నరసింహారావు, శ్రీరామచంద్రమూర్తి, కూర్మదేవ బాబా, పుండరీయ్య, లోకేశ్వరరావు, దామర్ల శ్రీకృష్ణ, స్థానికులు పాల్గొన్నారు.

పద్మశాలీ బహుత్తమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి చీరాల పద్మశాలి రామమందిరంలో జానకిదేవిని ఘనంగా సన్మానించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల మనోభావాల మేరకు వారికి మెరుగైన సేవలు అందిస్తూ, స్వామివారి సేవలో తన వంతు బాధ్యతగా నడుచుకుంటానని ఆమె చెప్పారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు మందూరి ప్రభాకరరావు, కార్యదర్శి గాత్ర నాగరాజు, కోశాధికారి గుంటి పాపారావు, గౌరవాధ్యక్షుడు గాత్ర పకీరయ్య, వెంకటేశ్వరరావు (బాబు) పాల్గొన్నారు.

11 మంది జూదరుల అరెస్ట్

రూ.7,250 నగదు స్వాధీనం

వేటపాలెం, చీరాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దే శాయిపేట శివారులో జరుగుతున్న పేకాట స్థావరంపై బుధవారం ఎస్సై వెంకటేశ్వర్లు, సిబ్బందితో కలసి దాడి చేశారు. పేకాట ఆడుతున్న 11 మం దిని అదుపులోకి తీసుకుని రూ.7,250 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.


శేషమ్మను విచారిస్తున్న అధికారులు

కొడుకు నుంచి తల్లికి భూమి అప్పగింత

పంగులూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తన పోషణ చూడకుండా వారసత్వంగా సంక్రమించిన భూమిని దౌర్జన్యంగా సాగు చేసుకుంటున్న కుమారుడి నుంచి ఆ భూమిని తిరిగి తల్లికి అధికారులు అప్పగించారు. మండలంలోని కోటపాడు గ్రామానికి చెందిన బత్తుల శేషమ్మ భర్త రామకోటికి కొండమూరు రెవెన్యూలో సర్వే నెంబరు 2-1లో 0.31 సెంట్ల విస్తీర్ణం గల వ్యవసాయభూమి ఉంది. వీరికి తిరుపతయ్య, శ్రీను అనే ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు చనిపోగా చిన్నకుమారుడు శ్రీను తనకు చెందిన భూమిని దౌర్జన్యంగా సాగు చేసుకుంటూ తన పోషణ చూడటం లేదని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. ఆ ఫిర్యాదును అందుకున్న తహసీల్దార్ సింగారావు బుధవారం ఎంపీడీవో స్వరూపారాణి, ఎస్ఐ వినోద్‌బాబులతో కలసి కొండమూరులోని ఆ భూమిని పరిశీలించి తగు విచారణ జరిపారు. విచారణ అనంతరం శ్రీనుకు ఎంసీ నెం.47 నోటీసు ఇచ్చి, 0.31 సెంట్ల భూమిని శేషమ్మకి అప్పగించినట్లు తహసీలాదర్ సింగారావు తెలిపారు.

టీడీపీ కార్యకర్త మృతి

ఫోన్‌లో పరామర్శించిన ఎమ్మెల్యే కొండయ్య

వేటపాలెం, చీరాల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : టీడీపీ కార్యకర్త కొమ్ము వీరయ్య (54) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొండయ్య, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాతాని ఉమామహేశ్వరరావు ఆ కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారికి అండగా ఉంటామని చెప్పారు.

ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు

బల్లికురవ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో రోడ్లపై వాహనాలను ఇష్టానుసారంగా నిలిపి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని బల్లికురవ ఎస్ఐ జీవీ చౌదరి హెచ్చరించారు. బుధవారం బల్లికురవ, వేమవరం నాలుగు రోడ్ల కూడలిలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తున్న పలు దుకాణాల వారికి ఎస్ఐ కౌన్సెలింగ్ నిర్వహించారు. దుకాణాల ముందు ఎవరైనా వాహనాలు ఉంచితే దుకాణదారులు చెప్పాలన్నారు. రోడ్లపై ఇష్టానుసారం నిలిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం మల్లాయపాలెం కూడలి వద్ద విజువల్ పోలీసింగ్‌లో భాగంగా వాహనాలను ఎస్ఐ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. లైసెన్సులు లేనివారికి పెనాల్టీని విధించారు.

గృహాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి

బల్లికురవ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో పెండింగ్‌లో ఉన్న గృహాలను ఈనెల 20వ తేదీలోపు పూర్తి చేయించేలా అధికారులు చర్య లు తీసుకోవాలని ఎంపీడీవో కె.కుసుమకుమారి కోరారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయం లో గృహ నిర్మాణాల గ్రౌండింగ్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఇప్పటి వరకు బల్లికురవ మండలంలో 123 గృహాలు పనులు పూర్తి కావాల్సి ఉందని, 20 వ తేదీలోపు 70 ఇళ్ల పూర్తి చేయాలని టార్గెట్ ఉందన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బంది వెంటనే లబ్ధిదారులను కలిసి అవగాహన కల్పించాలన్నారు. ఎవరైనా కొత్తగా గృహాలు కావాలంటే వారి వద్ద దరఖాస్తులు తీసుకోవాలని సూచించారు.

మహిళా మార్ట్.. మోసాలకు అడ్డా

(5వ పేజీ తరువాయి)

వెలుగు చూసినట్లు తెలుస్తోంది. మార్ట్‌లో విక్రయించేందుకు సరుకులను పెద్ద కంపెనీల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేయాల్సి ఉండగా, ఒంగోలులోని బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్‌లో ఎక్కువ ధరలకు కొనుగోలు చేసినట్లు తేలింది. అయితే కొనుగోలు, అమ్మకాలకు సంబంధించిన బిల్లులు కూడా అందుబాటులో లేవు. మార్ట్‌లో సరుకులు అమ్మగా వచ్చిన సొమ్మును మార్ట్ మేనేజర్ ఫోన్‌పే నుంచి ఏపీఎం ఫోన్‌పేకు కూడా బదిలీ జరిగినట్లు సమాచారం. మేనేజర్ ప్రతిరోజు సరుకులు అమ్మగా వచ్చిన సొమ్మును బ్యాంకులో జమచేయాల్సి ఉంది. అయితే ఈ సొమ్మును ఏ రోజుకారోజు సంబంధిత వెలుగు ఉద్యోగులు మేనేజర్ నుంచి తీసుకుని తమ సొంతానికి వాడేసుకున్నట్లు విచారణలో తేలినట్లు సమాచారం. ఇలా రూ.35లక్షలతో ఏర్పాటు చేసిన ఈ మార్ట్ బ్యాంకు ఖాతాల్లో రూ.20వేలలోపే ఉన్నట్లు సమాచారం. మిగిలిన సొమ్మంతా ఉద్యోగుల జేబుల్లోకి వెళ్లినట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం.

వైసీపీ మాజీ ఎమ్మెల్యే పేరుతో రూ.70వేల విలువైన సరుకులు పక్కదారి

ఈ మార్ట్‌ను ఏడాదిన్నర క్రితం ప్రారంభించారు. ప్రారంభానికి అప్పటి స్థానిక ఎమ్మెల్యే సుధాకర్‌బాబు హాజరయ్యారు. ఆయన సూచన మేరకు ప్రారంభోత్సవం రోజునే రూ.70 వేల విలువైన నూనె ప్యాకెట్లను మహిళలకు పంపిణీ చేశారు. ఇందుకు సంబంధించిన డబ్బును ఆయన ఉద్యోగులకు అందజేశారు. అయితే ఈ సొమ్మును కూడా మార్ట్ బ్యాంకు ఖాతాలో జమ చేయకుండా వారే దిగమింగేశారు. ఇలా మహిళా మార్టులో అందిన కాడికి వెలుగు ఏపీఎం, సీసీ సొంతానికి వాడుకోవటంతో మార్ట్ మూత దశకు చేరుకుంది. సరుకులను బహిరంగ మార్కెట్లో కంటే అధిక ధరలకు అమ్మటం, విక్రయించగా వచ్చిన సొమ్మును వెలుగు సిబ్బంది పక్కదారి పట్టించటం, మార్ట్‌లో సరుకులు నిండుకోవటం వంటి కారణాలతో మూతదశకు చేరుకుంది. ఈ నేపథ్యంలో జిల్లా గ్రామీణాభివృద్ధి, వెలుగు పీడీ వసుంధర విచారణకు ఆదేశించగా మూడు రోజుల క్రితం జరిగిన విచారణలో అ క్రమాలు నిగ్గుతేలినట్లు విశ్వసనీయ సమాచారం. దీనిపై పీడీ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ విచారణ నివేదిక ఇంకా అందలేదన్నారు. అందగానే అ క్రమార్కులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ముగ్గురు ఏపీఎంలకు షోకాజ్ నోటీసులు

ఒంగోలు నగరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తున్న వెలుగు ఉద్యోగులపై ఆ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కొరడా ఝుళిపిస్తున్నారు. తాజాగా ముగ్గురు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లకు ఆమె షోకాజ్ నోటీసులు జారీచేశారు. జిల్లాలో వెలుగు పథకం కింద అమలుచేస్తున్న పలు పథకాలు నత్తనడకన సాగుతున్నాయి. పలుమార్లు హెచ్చరించినా కొంతమంది ఏపీఎంల్లో మార్పు లేదు. రాష్ట్రస్థాయిలో ప్రస్తుతం ఎస్‌హెచ్‌జీ ఇన్‌కమ్ ప్రొఫైల్ సర్వే జరుగుతోంది. గ్రామస్థాయిలో వీవోఏలు ప్రతి ఇంటికి పోయి ఆ కుటుంబాలకు ఎంతమేరకు ఆదాయం వస్తుంది అనే వివరాలను నమోదు చేయాల్సి ఉంది. ఈ సర్వే జిల్లాలో నత్తనడకన సాగుతోంది. రాష్ట్రస్థాయిలో చూస్తే జిల్లా అట్టడుగున ఉంది. ఇవి మాత్రమే కాకుండా స్త్రీనిధి, ఉన్నతి పథకాల కింద ఇచ్చిన రుణాల రికవరీలోనూ జిల్లా వెనుకంజలో ఉంది. ఎస్‌హెచ్‌జీల గ్రేడింగ్, వీవో గ్రేడింగ్ తదితర కార్యక్రమాల్లో కూడా రాష్ట్రస్థాయిలో చూస్తే జిల్లా బాగా వెనుకబడిపోయింది. దీంతో సిబ్బందిని దారిలో పెట్టేందుకు పీడీ వసుంధర చర్యలు చేపట్టారు. ఎస్‌హెచ్‌జీ ఇన్‌కం ప్రొఫైల్ సర్వే తక్కువగా ఉన్న మండలాల ఏపీఎంలకు షోకాజ్ నోటీసులు జారీచేశారు. పుల్లలచెరువు ఏపీఎం వెంకటయ్య, పీసీపల్లె ఏపీఎం సత్యానందంతోపాటు ఒంగోలు ఏపీఎం శ్రీనివాసప్రసాదుకు నోటీసులు జారీచేశారు. పుల్లలచెరువు, పీసీపల్లె మండలాల ఏపీఎంలు విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నందుకు గాను షోకాజ్ నోటీసులు ఇవ్వగా ఒంగోలు ఏపీఎంకు క్రమశిక్షణరాహిత్యం కింద నోటీసు జారీచేశారు. మూడు రోజుల క్రితం జరిగిన టెలికాన్ఫరెన్సులో పీడీని ధిక్కరిస్తూ ఒంగోలు ఏపీఎం మాట్లాడారు. ఇందుకుగాను ఆయనకు షోకాజ్ నోటీసు జారీ అయ్యింది. మూడురోజులలోపు తగిన సమాధానం ఇ వ్వాలని కోరారు.


డెయిరీ వాహనం

ఆయన 20 ఏళ్ల క్రితం నూనూగు మీసాల యువకుడు. పదో తరగతి పూర్తి చేసి చదువుకు స్వస్తి చెప్పి రెండేళ్లపాటు వివిధ ప్రాంతాలు తిరిగి పలు వ్యాపారాలను పరిశీలించారు. తిరిగి సొంత ఊరికొచ్చి పాడి పరిశ్రమ స్థాపించారు. ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొన్నారు. ఇప్పుడు రోజుకు 15వేల లీటర్ల పాలు రెండు తెలుగు రాష్ట్రాలకు సరఫరా చేస్తూ జిల్లాలోనే అతిపెద్ద పాల వ్యాపారవేత్తగా ఎదిగారు. ఆయనే ముండ్లమూరు మండలం పోలవరం పంచాయతీకి చెందిన మేడం రామ్ గోపాలరెడ్డి. తన పరిశ్రమతో వంద మందికి ఉపాధి చూపుతున్నారు. ఏడాదికి రూ.25 కోట్ల టర్నోవర్‌తో విజయవంతమైన పాల వ్యాపారిగా కీర్తిగడించి మార్గదర్శిగా నిలిచిన ఆయన జర్నీపై ప్రత్యేక కథనం..

విజయ గోపాలుడు

పదో తరగతి చదివి పాల వ్యాపారంలో విజేతగా నిలిచి..


షెడ్లలో పశువులు



- చిన్న పాడి పరిశ్రమతో మొదలై... రూ.25 కోట్ల టర్నోవర్‌కు చేరిన వైనం
- రెండు తెలుగు రాష్ట్రాలకు పాలు, పెరుగు, మజ్జిగ, నెయ్యి సరఫరా
- రోజుకు 15వేల లీటర్ల పాల విక్రయం
- నిత్యం వందమందికి ఉపాధి

ముండ్లమూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలవరం పంచాయతీ పరిధిలోని చంద్రగిరికి చెందిన మేడం రామ్ గోపాలరెడ్డి 2000 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసి రెండేళ్ల ఖాళీగా ఉన్నారు. ఆ ఖాళీ సమయంలో హైదరాబాద్ లాంటి వివిధ ప్రాంతాల్లో తిరిగారు. వ్యాపార మెళకువలను తెలుసుకున్నారు. తిరిగి స్వగ్రామానికి వచ్చి 2002లో శ్రీరాం ఏజెన్సీ అని వ్యవసాయ మోటార్ల షాప్ నెలకొల్పారు. అది విజయవంతంగా సాగుతోంది. అంతటితో సంతృప్తి చెందలేదు. వ్యవసాయ కుటుంబం నుంచి రావడం, పశువుల పెంపకంపై అవగాహన ఉండటంతో పాల వ్యాపారంపై దృష్టి పట్టారు. తనకు ఉన్న ఆరెకరాల్లోని కొంత పొలంలో 2007లో వంద గేదెలతో శ్రీరామ్ డెయిరీని నెలకొల్పారు. తన సోదరుల సహకారంతో ప్రత్యేకంగా ఏడు షెడ్లను ఏర్పాటు చేసి గేదెలు, ఆవులను మేపుతూ రూ.30 లక్షల పెట్టుబడితో వ్యాపారం మొదలుపెట్టారు. ప్రారంభంలో 10 మందికి ఉపాధి కల్పించారు.

ఆ ఆలోచనే వ్యాపార వృద్ధికి మూలం

అప్పటికే చుట్టుపక్కల మండలాల్లోనూ, గ్రామాల్లోనూ అనేక మంది గేదెల ఫాం పెట్టి నష్టపోయారు. ఆ అనుభవాలను దృష్టిలో పెట్టుకొని నూతన ఆలోచనతో 2008లో ప్రాసెసింగ్, ప్యాకింగ్ యూనిట్స్ నెలకొల్పి ఎగుమతులు చేశారు. దీనివల్ల తక్కువ ధరకే నాణ్యమైన పాలను అమ్మడం సాధ్యమైంది. ఫలితంగా మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. ఎగుమతులు పెరిగాయి. ప్రస్తుతం 500 ఆవులు, గేదెలు ఉన్నాయి. రోజూ వంద మందికి ఉపాధి లభిస్తోంది. డెయిరీలోని పాలతోపాటు తాళ్లూరు, ముండ్లమూరు, అద్దంకి మండలాల నుంచి ఏడు వేల లీటర్లు సేకరిస్తున్నారు. మొత్తం 15వేల లీటర్లు ప్రోసెస్ చేసి ప్యాకింగ్ చేసి సరఫరా చేస్తూ జిల్లాలోనే అతి పెద్ద పాల ఎగుమతుల కేంద్రంగా పేరు గడించారు. పాలు, పెరుగు, మజ్జిగ, నెయ్యి తయారు చేసి జిల్లాతోపాటు గుంటూరు, తెలంగాణాలోని హైదరాబాద్, నల్లగొండ జిల్లాలకు సరఫరా చేస్తున్నారు.

పట్టుదల, ప్రణాళికే నన్ను నడిపించాయి

తనకు చిన్న తనం నుంచే పట్టుదల ఉండేది. నాలాగే చుట్టుపక్కల ఎంతో మంది ఈ వ్యాపారంలోకి వచ్చి నిలబడలేకపోయారు. వారందరినీ పరిశీలించాను. వారంతా ఇంకో డెయిరీకి పాలు పోసి వారిచ్చిన డబ్బు తీసుకోవాలి. సొంత మార్కెట్ లేదు. అందువల్లే నిలదొక్కుకోలేక పోయారు. నేను సొంత మార్కెటింగ్‌పై ఫోకస్ పెట్టాను. తక్కువ ధరకే నాణ్యమైన పాలను ఇవ్వగలిగాను. ఆ ప్రణాళికే నన్ను ఈ స్థాయికి చేర్చింది. ప్రస్తుతం బయట మార్కెట్‌లో ఎక్కువ ధర ఉన్నా నేను మాత్రం లీటరు రూ.60కే ఇస్తున్నా.

- మేడం రామ్‌గోపాలరెడ్డి, శ్రీరామ్ డెయిరీ నిర్వాహకుడు


కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న హిందూ సంఘాలు

ఇస్కాన్ కృష్ణదాస్‌స్వామిని విడుదల చేయాలి

- హిందూ సంఘాల డిమాండ్ ● నగరంలో భారీ ర్యాలీ

ఒంగోలు(కల్చరల్), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచానికి సేవాభావాన్ని, కృష్ణ తత్వాన్ని బోధిస్తున్న ఇస్కాన్ సంస్థకు చెందిన చిన్మయ కృష్ణదాస్ స్వామిని బంగ్లాదేశ్ ప్రభుత్వం అరెస్ట్ చేసి జైలులో వేయటం దారుణమని పలు హిందూ సంఘాల ప్రతినిధులు తీవ్రంగా నిరసించారు. బుధవారం హిందూ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బంగ్లాదేశ్ ప్రభుత్వ చర్యను నిరసిస్తూ ఒంగోలు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక కేశవస్వామిపేట ప్రసన్నచెన్నకేశవస్వామి దేవస్థానం దగ్గర నుంచి ప్రకాశం భవనం వరకు హిందూ సంఘాల ప్రతినిధులు, భక్తులు ప్లకార్డులు చేత పట్టుకుని బంగ్లాదేశ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం వారు కలెక్టరేట్ వద్ద బైఠాయించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ ప్రాంత సత్సంగ్ పోమ సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు తూనుగుంట మల్లికార్జునరావు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో మైనార్టీలుగా ఉన్న హిందువులపై ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకునేలా భారత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. హిందువులపై జరుగుతున్న దమనకాండను అడ్డుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ కార్యదర్శి ఇనమనమెళ్లూరి సీతారామయ్య, జిల్లెళ్లమూడి వెంకటేశ్వర్లు, పసుమర్తి వెంకటేశ్వర్లు, వెన్నెల సుబ్బారావు, తడికమళ్ల హరిప్రసాద్, మధుకర్‌జీ, రాధా రమణ గుప్తా జంధ్యం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ.శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని వైసీపీ మహిళా నేత మోసం

ఒంగోలు (క్రైం), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని జిల్లా గ్రంథాలయంలో ఉద్యోగం ఇప్పిస్తానంటూ డబ్బులు తీసుకొని మోసం చేసిన వైసీపీ మహిళా నేత బడుగు ఇందిరపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ నాగరాజు బుధవారం తెలిపారు. స్థానిక బాలాజీనగర్‌కు చెందిన దాసరి వనజ వద్ద మూడు దఫాలుగా రూ3.50లక్షల నగదు తీసుకొని ఉద్యోగం ఇప్పించలేదని, అలాగే డబ్బులు తిరిగి ఇవ్వకుండా మోసం చేసినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

శిశువు విక్రయంపై విచారణ

ఒంగోలు (క్రైం), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శిశు విక్రయంపై బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సూమోటోగా తీసుకొని విచారణ చేపట్టిందని బుధవారం ఓ ప్రకటనలో కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి తెలిపారు. చీమకుర్తి మండలానికి చెందిన దంపతులు శిశువును విక్రయించడంపై వైద్యఆరోగ్య శాఖ, మహిళ అభివృద్ధి శిశుసంక్షేమశాఖతోపాటు పోలీసులు విచారణ చేసి సమగ్ర నివేదికలు ఇవ్వాలని పద్మావతి కోరారు.

బిలాల్ హోటల్‌లో చోరీ

ఒంగోలు(క్రైం), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం అద్దంకి బస్టాండ్‌లోని బిలాల్ హోటల్‌లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. హోటల్ వెనుక వైపు నుంచి దొంగ లోపలికి చొరబడి రిసెప్షన్‌లో ఉన్న గల్లా పెట్టె తాళాలు పగులగొట్టి దానిలో ఉన్న బీరువా తాళాలు తీశారు. అనంతరం బీరువా తెరిచి సుమారు రూ.2.5 లక్షలు నగదు అపహరించుకెళ్లారు. ఈమేరకు హోటల్ మేనేజర్ షేక్ ఖాదర్‌వలి ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాసరావు దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఈ కేసులో కీలకమైన ఆధారాలను సేకరించినట్లు ఆయన చెప్పారు.

రేపు అంబేద్కర్ వర్ధంతి

ఒంగోలు నగరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ 68వ వర్ధంతి కార్యక్రమాలను ఈ నెల 6వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ ఎస్.లక్ష్మానాయక్ బుధవారం తెలిపారు. 6వ తేదీ ఉదయం 10 గంటలకు కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఇతర ప్రజాప్రతినిధులు స్థానిక హెచ్‌సీఎం కళాశాలవద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులుఅర్పిస్తారని, అనంతరం అంబేద్కర్ భవన్‌కు పోవుదారిలో ఉన్న అంబేద్కర్ కాంశ్య విగ్రహానికి కూడా నివాళులర్పిస్తారని పేర్కొన్నారు. జిల్లా అధికారులు, దళితసంఘాల నాయకులు పాల్గొనాలని ఆయన కోరారు.

సంతమాగులూరు మాజీ సర్పంచి హత్య కేసు కొట్టివేత

ఒంగోలు(క్రైం), డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): సంతమాగులూరు మాజీ సర్పంచ్ గడ్డం వెంకటరెడ్డి హత్య కేసును కొట్టి వేస్తూ న్యాయాధికారి రాజా వెంకటాద్రి బుధవారం తీర్పునిచ్చారు. 2016 ఏప్రిల్ 4న సంతమాగులూరు సర్పంచ్ గడ్డం వెకటరెడ్డి అలియాస్ లిక్కి వెంకటరెడ్డి ఇంట్లో ఉండగా అదే గ్రామానికి చెందిన అట్ల చినవెంకటరెడ్డి, మరో ఆరుగురు మారణాయుధాలతో వెళ్ళి దాడి చేశారని, దీంతో లిక్కి వెంకటరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా ఈకేసు విచారణ చేపట్టిన 7వ అదనపు కోర్టు న్యాయాధికారి సాక్షులను విచారించి నేరం రుజువు కాలేదని కేసును కొట్టివేస్తు తీర్పు ఇచ్చారు.

డీఈవో సీసీ అవినీతిపై విచారణకు ఆదేశం

ఒంగోలు విద్య, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖాధికారి సీసీగా డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న మైనంపాడు డైట్ కాలేజీ జూనియర్ అసిస్టెంట్ జి.పాండురంగారావు అవినీతి, అక్రమాలపై విచారణకు ఆదేశిస్తూ పాఠశాల విద్య గుంటూరు ఆర్‌జేడీ బి.లింగేశ్వరరెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. విచారణలో ఎటువంటి జాప్యం లేకుండా చూడాలని డీఈవో కిరణ్‌కుమార్‌ను ఆదేశించారు. ఏపీయూటీఎఫ్ నాయకుల ఫిర్యాదు మేరకు సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఆర్‌జేడీ ఉత్తర్వులు ఇచ్చారు.

ఆక్రమణ భూములను స్వాధీనం చేసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గుడ్లూరు మండలం చేవూరులో రామదూత ఆక్రమించుకున్న భూములను స్వాధీనం చేసుకోవాలని కోరుతూ భారత హేతువాద సంఘం నాయకులు బుధవారం విజయవాడలో రెవెన్యూశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జాతీయ అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ భూముల ఆక్రమణలపై అనేక పర్యాయాలు ఫిర్యాదులు చేశామని, ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



భవనాసిలో ఆకు పచ్చ తివాచీ

అద్దంకిలోని భవనాసి చెరువు ఇది. నిండుగా ఉన్న నీటిపై పచ్చని తివాచీ పరిచినట్టు కనువిందు చేస్తున్న తామరాకుల దృశ్యం చూపరులను కట్టిపడేస్తోంది. దీంతో శింగరకొండ దేవస్థానానికి వచ్చే భక్తులు ఆసక్తిగా తిలకిస్తూ ఆహ్లాదం పొందుతున్నారు.

- అద్దంకి, (ఆంధ్రజ్యోతి)


రోడ్డుకమ్ ఆనకట్ట నిర్మాణ ప్రతిపాదిత ప్రాంతం

ముసి ఆనకట్ట నిర్మాణంపై ఆశలు

- వైసీపీ హయాంలో ప్రతిపాదనలకే పరిమితం ● రోడ్డు కమ్ ఆనకట్టతో చిలంకూరుకు మహర్దశ
- మద్దిపూడి, చీమకుర్తి మండలాలకు రవాణా సౌకర్యం మెరుగు

మద్దిపూడి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ముసి నదిపై చిలంకూరు వద్ద ఆనకట్ట నిర్మాణ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చుతాయని మండల ప్రజలు ఆశిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా రోడ్డు కమ్ ఆనకట్ట నిర్మించాలని చిలంకూరు గ్రామస్థులు కోరుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆనకట్ట నిర్మించి తీరుతామని అప్పటి పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ హామీ ఇచ్చారు. అధికారులు ఆగమేఘాలపై ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అనంతరం అవి కాగితాలకే పరిమితమయ్యాయి. ఆనకట్ట నిర్మాణంతో అటు చీమకుర్తి, ఇటు మద్దిపూడి మండలాలకు రవాణా సౌకర్యం మెరుగవుతుంది. ఒక టీఎంసీ నీటిని నిల్వ చేయడం ద్వారా ముసి పరివాహక గ్రామాల్లో భూగర్భ జలాలు పెరుగుతాయి. 2,000 ఎకరాలకు పైగా భూములకు సాగు నీరు అందే అవకాశం ఉంది. ముసి నదిపై ఎలాంటి ఆనకట్ట లేకపోవడంతో వేలాది క్యూసెక్కుల నీరు సముద్రం పాలవుతోంది. రోడ్డు కమ్ ఆనకట్ట నిర్మిస్తే మద్దిపూడి నుంచి జిల్లా కేంద్రమైన ఒంగోలుకు దగ్గర మార్గం ఏర్పడుతుంది. పరీవాహక గ్రామాలకు తాగునీటి సౌకర్యం కూడా కల్పించవచ్చు. చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం సాగు నీటి పథకాలకు ప్రాధాన్యం ఇస్తున్న క్రమంలో ముసి మీద ఆనకట్ట నిర్మాణంపై ప్రజల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి చొరవ తీసుకొని ఆనకట్ట నిర్మాణానికి కృషి చేయాలని వారు కోరుతున్నారు.

రెవెన్యూ సదస్సులను పటిష్టంగా నిర్వహించాలి

రెవెన్యూశాఖ మంత్రి సత్యప్రసాద్ ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఈనెల 6 నుంచి జనవరి 8వతేదీ వరకు జరగనున్న రెవెన్యూ సదస్సులను పటిష్టంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశించారు. బుధవారం తాడేపల్లి నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఈ సదస్సుల్లో రెవెన్యూ సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో సదస్సులు జరిగేలా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాలోని 826 రెవెన్యూ గ్రామాల్లో 298 చోట్ల రీసర్వే పూర్తయిందన్నారు. భూసమస్యలపై 8,889 అర్జీలు రాగా అందులో 6,283 అర్జీలు సర్వే సంబంధిత అంశాలపై వచ్చాయన్నారు. కనిగిరి డివిజన్‌లోని నాలుగు మండలాల్లో ఎక్కువ వచ్చినట్లు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో చిన ఓబులేషు, కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

విపత్తులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉండాలని రాష్ట్ర హోంశాఖ, విపత్తుల నిర్వహణశాఖ మంత్రి వి.వనిత ఆదేశించారు. బుధవారం తాడేపల్లి నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. విపత్తుల సమయంలో ప్రాణనష్టం జరగకుండా డ్రోన్ల వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని చెప్పారు. శిథిలావస్థలో ఉన్న చప్టాలను గుర్తించి పునఃనిర్మాణానికి అవసరమైన అంచనాలను ప్రభుత్వానికి పంపించాలని ఆదేశించారు. అనంతరం పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో చినఓబులేషు, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, అధికారులు వెంకటనాయుడు, వెంకటేశ్వర్లు, డాక్టర్ బేబీరాణి, డాక్టర్ పద్మజ, చంద్రశేఖర్‌రెడ్డి, రమేష్, దేవానంద్, వరలక్ష్మి, సుశీల, పీవీ.రమణ, శ్రీనివాసరావు, బెనహర్ పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అన్సారియా



సైకిల్‌పై మిత్రుల దేశ పర్యటన

వీరి పేరు శివం, అమిత్ పటేల్. ఇద్దరూ స్నేహితులు. కాలుష్యం లేకుండా సైకిల్‌పై దేశ పర్యటన చేయాలని తలిచారు. అందులో భాగంగా నవంబరు 8న వారణాసి నుంచి బయలుదేరారు. బుధవారానికి 26 రోజులు గడిచాయి. ఒంగోలుకు చేరేసరికి 1500 కిలోమీటర్లు సైకిల్ యాత్ర సాగింది. రోజుకు 100 కిలోమీటర్లు వెళుతున్నారు. 12 రాష్ట్రాలు దాటి కన్యాకుమారిలో వీరి పర్యటన ముగుస్తుంది. తిరిగి ఇంటికి చేరేసరికి ఏడాది అవుతుంది. - ఒంగోలు , ఆంధ్రజ్యోతి



పల్నాటి గడ్డపై ఎమ్మెల్యేల సందడి

పల్నాడు గడ్డ కారంపూడిలో కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి, మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో కలిసి బుధవారం సందడి చేశారు. ఉగ్ర నరసింహారెడ్డి కబడ్డీ ప్రారంభించి ఆడి ఉత్సాహపరిచారు. కారంపూడిలో పల్నాటి వీరుల తిరునాలలో ఈ సందడి నెలకొంది.

- కనిగిరి, (ఆంధ్రజ్యోతి)

ఘనంగా మంత్రి స్వామి జన్మదిన వేడుకలు

నాయుడుపాలేనికి భారీగా తరలివచ్చిన శ్రేణులు

శుభాకాంక్షలు తెలిపేందుకు పోటెత్తిన టీడీపీ నాయకులు, అభిమానులు



మంత్రి స్వామిని పూలమాలతో సన్మానిస్తున్న టంగుటూరు మండల నాయకులు



కొండపి మండల నాయకులతో కలిసి కేక్ కట్ చేస్తున్న మంత్రి స్వామి

కొండపి, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఆయన స్వగ్రామమైన తూర్పునాయుడుపాలేనికి భారీగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. స్వామి ఆనవాయితీ ప్రకారం తన పుట్టినరోజు సందర్భంగా ఉదయం కుటుంబసభ్యులతో కలిసి తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. సాయంత్రానికి స్వగ్రామం చేరుకున్నారు. అప్పటికే ఆయన ఇంటి వద్దకు భారీగా అభిమానులు చేరుకున్నారు. వారి మధ్య కుమారుడితో కలిసి మంత్రి కేక్ కట్ చేశారు. అనంతరం నాయకులతోపాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన వివిధ శాఖల అధికారులు మంత్రికి బొకేలు ఇచ్చి, శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కొండపి మండలానికి సంబంధించి ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డపాటి యల్లమంద నాయుడు, సీనియర్ నాయకులు బత్తుల నారాయణస్వామి, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, చాగంరెడ్డి నరసారెడ్డి, కొర్రపాటి వసంతరావు, దామా మురళి, గుండపనేని రామ్మూర్తి నాయుడు, పెదకండ్లగుంట మాజీ సర్పంచ్ తానికొండ వెంకటేశ్వర్లు, నేతివారిపాలెం నాయకుడు గోనుగుంట పున్నయ్య, పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

జరుగుమల్లి: మండలంలోని అన్ని గ్రామాల నుంచి పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు తూర్పునాయుడుపాలేనికి తరలివచ్చి మంత్రికి శుభాకాంక్షలు చెప్పారు. వారిలో పార్టీ మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, సీనియర్ నాయకుడు పోటు శ్రీనివాసమురళి (పెదబాబు), గాలి సందీప్, కామేపల్లి మాజీ సర్పంచ్ ఏలూరి రాంబాబు, కొమ్మాలపాటి కృష్ణ, పాతూరి కోటేశ్వరరావు, బత్తిన పూర్ణ, రమణ తాటికొండ తదితరులు ఉన్నారు.

పొన్నలూరు: టీడీపీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అనుమోలు రాజా రమేష్, గుమ్మళ్ల వెంకటరావు, అనుమోలు సుధాకర్, మండవ ప్రసాద్, మండవ మురళి, కర్నా కోటిరెడ్డి, పల్లపోతు ప్రసాద్, పల్లపోతు రమేష్, దొండేటి మధుసూదన్ (నాయుడు) పాల్గొన్నారు.

టంగుటూరు: మండల కేంద్రమైన టంగుటూరుతోపాటు వివిధ గ్రామాల నుంచి పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు తూర్పునాయుడుపాలెం వెళ్లి మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. వారిలో పార్టీ నాయకులు రామాగోపి, బొజ్జా శ్రీనివాసరావు, ఈదర ప్రభాకర్, మక్కెన వెంకటరావు, కొమ్మినేని వెంకట్రావు, దూడల తిరుపతిస్వామి, బొడ్డపాటి అంజిబాబు ఉన్నారు.

సింగరాయకొండ: మంత్రి స్వామి జన్మదిన వేడుకలను టీడీపీ నేతలు సింగరాయకొండలో అట్టహాసంగా నిర్వహించారు. కందుకూరు రోడ్డు సెంటర్‌లో భారీ కేక్‌ను కట్‌చేశారు. రాత్రికి టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలోని మంత్రి స్వగృహంలో ఆయన్ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నేతలు చీమకుర్తి కృష్ణ, షేక్ సంధానీబాషా, సన్నెబోయిన శ్రీనివాసులు, కూనపరెడ్డి సుబ్బారావు, సుదర్శి చంటి, మించల బ్రహ్మయ్య, గాలి హరిబాబు, నక్కా బ్రహ్మేశ్వరరావు, వేల్పుల వెంకట్రావు, గుదే వెంకటేశ్వర్లు, చిగురుపాటి గిరి, నర్రా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.





కేక్‌కట్ చేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నేతలు

7న చీమకుర్తి ఆసుపత్రిలో బ్లడ్‌బ్యాంకు ప్రారంభం

● హాజరుకానున్న కలెక్టర్, ఎమ్మెల్యే బీఎన్

సంతనూతలపాడు(చీమకుర్తి), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి పీహెచ్‌సీలో బ్లడ్‌బ్యాంకు సెంటర్‌ను ప్రారంభించనున్నట్లు ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.వేణుగోపాలరెడ్డి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పీహెచ్‌సీకి బ్లడ్‌బ్యాంకు సెంటర్‌ను కేటాయించడంపై చీమకుర్తితో పాటు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు అత్యవసర సమయంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. ఈ బ్లడ్ బ్యాంకు సెంటర్ ప్రారంభోత్సవానికి కలెక్టర్ తమీమ్‌అన్సారియా, ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ ముఖ్యఅతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు.



చీమకుర్తి పీహెచ్‌సీ

చీమకుర్తి సీహెచ్‌సీకి కాయకల్ప అవార్డు

రాష్ట్రంలో ఏరియా హాస్పిటల్స్, సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లకు కాయకల్ప అవార్డు-2024 కింద గత నెల 30న అవార్డులు ప్రకటించారు. ఈక్రమంలో చీమకుర్తి పీహెచ్‌సీని బెస్ట్ సెంటర్‌గా నిర్ణయించి కాయకల్ప అవార్డు కింద రూ.లక్షన్నర బహుమతికి ఎంపిక అయ్యిందని సూపరింటెండెంట్ ఆర్.వేణుగోపాలరెడ్డి తెలిపి సంతోషం వ్యక్తం చేశారు. ఈ అవార్డు రావడానికి పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి కారణమని, వారిందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

రేపటి నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

కొత్తపట్నం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ నెల 6వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మధుసూదనరావు బుధవారం తెలిపారు. 6వ తేదీన ఆలూరులో, 7న గాదెపాలెం, 10న వజ్జిరెడ్డిపాలెం, 12న కె.పల్లెపాలెం, 17న అల్లూరులో, 19న కొత్తపట్నం, 21న రాజుపాలెం, 23న ఈతముక్కల, 27న సంకువానికుంట, 28న మడనూరు, 30న గుండమాల, జనవరి 2న పిన్నివారిపాలెం, బీరంగుంట, 4న మోటుమాల, 6న పాదర్తి, 8వ తేదీన రంగాయపాలెంలో రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రజలు అర్జీలు సమర్పించాలని కోరారు.

ఉప్పుగుండూరులో ఏటీఎం ప్రారంభం

నాగులుప్పలపాడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరులోని లైబ్రరీ సెంటర్ వద్ద ఇండియా వన్ ఏటీఎంను సామాజికసేవా కార్యకర్త తెలగతోటి శామ్యూల్ బుధవారం ప్రారంభించారు. అనంతరం ఏటీఎం నిర్వాహకులు యానాదిశెట్టి మాట్లాడుతూ తమ ఏటీఎం ద్వారా రోజుకి గరిష్ఠంగా రూ.10వేల నగదు విత్‌డ్రా చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కొంజేటి శ్రీనివాసరావు, సీతయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఏటీఎంను ప్రారంభిస్తున్న శామ్యూల్

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

మద్దిపాడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు ఉత్తమ బోధన అందించి నూరు శాతం ఫలితాలు సాధించాలని డీఈవో కిరణ్‌కుమార్ సూచించారు. బుధవారం కారుమూడివారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరంలో టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా కృషిచేయాలన్నారు. మెగా పేరెంట్స్‌డే కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తయారుచేసిన ఆహ్వాన పత్రికలను పరిశీలించి వారిని అభినందించారు. పాఠశాలలోని ఒకేషనల్, పాల్ ల్యాబ్ గురించి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీసీఈబీ సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో కిరణ్‌కుమార్

ఉపాధి పనుల్లో నాణ్యత తప్పనిసరి : ఏపీడీ

సంతనూతలపాడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల్లో ఉపాధి పథకం కింద జరుగుతున్న పనుల్లో నాణ్యత విషయంలో రాజీ వద్దని డ్వామా ఏపీడీ వెంకటస్వామి సూచించారు. బుధవారం సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ గోకులం షెడ్లను వెంటనే గ్రౌండింగ్ చేయాలని తెలిపారు. సోక్‌పిట్లు, ఫారంపాండ్‌లు, వాటర్ హార్వెస్టింగ్‌కు సంబంధించి వెంటనే పనులు ప్రారంభించాలని, అలసత్వం ప్రదర్శించవద్దని చెప్పారు. సోషల్ ఆడిట్ రికార్డులన్ని సిద్ధం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో వాసంతి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో ఆగిన చెత్త సేకరణ ఆటోలు

నాలుగుల నెలల పెండింగ్ వేతనాల కోసం కార్మికుల నిరసన ● రెండు నెలల వేతనాలను మంజూరు చేసిన కమిషనర్



నిరసన వ్యక్తం చేస్తున్న డ్రైవర్లు

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాలుగు నెలల పెండింగ్ జీతాలు విడుదల చేయాలని కోరుతూ చెత్త సేకరణ ఆటో డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఒంగోలులో చెత్త సేకరణ వాహనాలు నిలిపివేసి తమ నిరసన తెలియజేశారు. నగరంలో ఇంటింటి చెత్త సేకరణకు సుమారు 60 చెత్తసేకరణ ఆటోలు ఉండగా, వాటిని నడిపేందుకు సుమారు 60మంది డ్రైవర్లు ఉన్నారు. ఒకొక్కరికి నెలకు రూ.10,500 వేతనాలు చెల్లిస్తుండగా, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రెడ్డి అండ్ రెడ్డి అనే ఏజెన్సీ వారి జీతభత్యాల బాధ్యతను చూసేది. అయితే టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో ఏజెన్సీ వారి వేతనాలను విస్మరించింది. దీంతో 60 ఆటో డ్రైవర్లకు ఒకొక్కరికి నాలుగు నెలల జీతాలు పెండింగ్ ఉండటంతో కుటుంబ జీవనం కష్టంగా మారిందని వారో వాపోతున్నారు. దీంతో తమ వాహనాలను నిలిపివేసి కార్పొరేషన్ కార్యాలయంలో నిరసన చేపట్టారు. అయితే ప్రజాప్రయోజనం దృష్ట్యా కమిషనర్ వెంకటేశ్వరరావు వారితో మాట్లాడారు. చెత్త సేకరణకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు అలాగే పారిశుధ్యం మెరుగులో భాగంగా కార్యాలయ జనరల్ ఫండ్ నుంచి వారికి రెండు నెలల వేతనాలను మంజూరు చేశారు. దీంతో కొంతమేర సంతృప్తి చెందిన డ్రైవర్లు యథావిధిగా విధుల్లోకి వెళ్ళారు. అలాగే మిగిలిన రెండు నెలల వేతనాలు త్వరలోనే మంజూరు చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.

ఘనంగా ఘంటసాల జయంతి

● కళాకారుల నివాళులు



ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కళాకారులు

ఒంగోలు(కల్చరల్), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మధుర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు, ఎస్వీ రంగారావు సాంస్కృతిక సేవాసమితి ఆధ్వర్యంలో ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూములోని ఘంటసాల విగ్రహానికి పూలాభిషేకం చేశారు. పలువురు గాయకులు, కళాకారులు, కళాసంస్థల ప్రతినిధులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు, ప్రరసం అధ్యక్షుడు పొన్నూరి వెంకట శ్రీనివాసరావు, గాయకులు కనకారావు, పెండ్యాల సాయిమాస్టర్, చల్లా నాగేశ్వరమ్మ, రైల్వే నాగేశ్వరరావు, అన్నమయ్య మురళీకృష్ణ, ఆళ్ల భాస్కరరెడ్డి, ఐ.నరసింహారావు, జి.శివప్రసాద్, పొన్నలూరి జానకిరామ్, ఓరుగంటి ప్రసాదు, బి.జెర్మియా తదితరులు పాల్గొన్నారు. అనంతరం అనాథలకు దుప్పట్లను పంపిణీ చేశారు.

ఘంటసాల పాటల పోటీలు

సినీ నేపథ్య గాయకుడు ఘంటసాల జయంతి సందర్భంగా శ్రీఅభయ కళారాధన సాంస్కృతిక సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం ఘంటసాల పాటల పోటీలు నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దాలి మాధవరావు ఆధ్వర్యంలో చీమకుర్తిలోని ఘంటసాల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ జి.రాజ్యలక్ష్మి హాజరయ్యారు. పాటల పోటీల విజేతలు ప్రత్యూష, ప్రియాంక, రోషిణిలకు బహుమతులు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో విద్యానికేతన్ కరస్పాండెంట్ పి.రవీంద్రబాబు, హెచ్‌ఎం కె.శ్రీనివాసరావు, జి.కోటేశ్వరరావు, కె.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయమే లాభదాయకం : డీఏవో

మద్దిపాడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సేంద్రియ వ్యవసాయంతో రైతుకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని డీఏవో శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని దొడ్డవరం, ఘడియపూడి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఏవో జి.రమేష్‌బాబు అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సుల్లో డీఏవో శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిసారించాలన్నారు. విచ్చలవిడిగా పురుగు మందులు, రసాయన ఎరువులు వాడకూడదని చెప్పారు. సాగు చేసిన పంటలకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఏ రమేష్‌బాబు, ఎంపీడీవో వి.జ్యోతి, రైతు సేవా కేంద్రం సిబ్బంది శిరీష, స్పందన పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఏవో శ్రీనివాసరావు

పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నాగులుప్పలపాడు: రైతులు పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏవో వెంకట్రావు సూచించారు. తిమ్మసముద్రంలో సాగు చేసిన వరి పంటను పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ పంటలు సాగుచేసిన రైతులు వరి ఎకరానికి రూ.215, శనగకు రూ.368, మిరపకు రూ.525, మినుముకు రూ.103, జొన్నకు రూ.60 చొప్పున ప్రీమియం చెల్లించి బీమా పొందాలని తెలిపారు. ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంటకు ప్రభుత్వం నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద మద్దతు ధరకు అమ్ముకోవాలని చెప్పారు. వరిసాగులో వచ్చే ఉల్లికోడు నివారణకు బెల్ట్ 80 ఎంఎల్ గానీ సోలోమాన్ 200 ఎంఎల్ ఎకరానికి పిచికారి చేయాలని వివరించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి అనురాధ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : ఎస్పీ

ఒంగోలు(క్రైం), డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): రహదారి నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్పీ దామోదర్ హెచ్చరించారు. బుధవారం ఒంగోలులోని ఎస్పీ కార్యాలయంలో వాహనచోదన చేస్తున్న యువకులకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. రోడ్లపై బాధ్యతారాహిత్యంగా వాహనాలు నడుపుతూ ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని హితవు పలికారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడపవద్దని చెప్పారు. చెడు అలవాట్లకు బానిసలు కావద్దని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా మైనర్లు వాహన చోదన, ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న వారిపై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేశారు. అలాంటి వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, ఆర్ఎస్ఐలు అస్లామ్, మాల్యాద్రి, సిబ్బంది పాల్గొన్నారు.



మద్దిపాడులోని పొగతోటలు

జీవం పోసుకున్న పొగతోటలు

మద్దిపాడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మండలంలో గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పొగాకు రైతులు ఒకింత ఆనందంగా ఉన్నారు. నీళ్ల లేక పొగ మొక్కలు వాడిపోతున్న క్రమంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో జీవం పోసినట్లయింది. గుండ్లాపల్లి, అన్నంగి, రాచవారిపాలెం, మద్దిపాడు, బసవన్నపాలెం, సీతారాంపురం రైతులు పొగాకు సాగు చేశారు. పొగాకు పంటకు నష్టం ఏమీ లేదని వ్యవసాయశాఖ అధికారులు చెబుతుండగా ఉద్యానపంటలకు మాత్రం నష్టం వాటిల్లింది. జామ, సపోటా, మామిడి పూత రాలిపోయింది. మల్లవరం పత్తి, మిర్చి చేలలో నీరు చేరడంతో బయటికి పంపేందుకు రైతులు అష్టకష్టాలు పడ్డారు.

మహిళలకు టైలరింగ్, ఎంబ్రాయిడరీలో శిక్షణ

సంతనూతలపాడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రనైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎండ్లూరు డొంక వద్దనున్న మహిళాప్రాంగణంలో మహిళలకు ఉచితంగా టైలరింగ్, హ్యాండ్ ఎంబ్రాయిడరీలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ అధికారి రవితేజయాదవ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 15-45 సంవత్సరాల వయస్సు గల మహిళలు అర్హులని, వివరాలకు 9963005209 సెల్ నెంబరును సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో 7న సమావేశం

సంతనూతలపాడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఒకే వేదికపైకి చేర్చి విద్యాపరమైన అంశాలను చర్చిడంతో పాటు పిల్లల చదువులు, క్రమశిక్షణకు సంబంధించి నివేదికలు అందించేందుకు ఈనెల 7న తల్లిదండ్రుల కమిటీ సమావేశాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు ఎంఈవో వెంకారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రతి ప్రభుత్వపాఠశాలల్లో జరిగే ఈ కార్యక్రమాలకు తల్లిదండ్రులు హాజరుకావాలని ఆయన కోరారు.

మెగా ఫుడ్‌పార్కులపై మాగుంట ప్రశ్న

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపాదించిన మెగా ఫుడ్ పార్కులు, నిర్మాణం, వినియోగం, కేటాయించిన నిధులు, జరిగిన ఉత్పత్తులపై ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి బుధవారం పార్లమెంట్‌లో ప్రశ్నించారు. దీనిపై కేంద్ర ఆహార పదార్థాల తయారీ పరిశ్రమలశాఖ సహాయక మంత్రి రవ్‌నీత్‌సింగ్ సమాధానం ఇస్తూ దేశంలో 41 మెగా ఫుడ్‌పార్కుల ఏర్పాటుకు కేంద్రం ఆమోదించగా ఆంధ్రప్రదేశ్‌లో మూడు పార్కులను కేటాయించినట్లు చెప్పారు. చిత్తూరు, వెస్ట్ గోదావరి, కృష్ణా జిల్లాల్లో వాటిని నిర్మిస్తామని వివరణ ఇచ్చారు.

పొలాల్లో చేరిన నీటిని బయటకు పంపాలి

కొండపి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రైతులు తమ పంట పొలాల్లో చేరిన నీటిని కాలువల ద్వారా వెంటనే బయటకు పంపాలని ఏవో డి.విజయ్‌కుమార్ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన బుధవారం మండలంలోని కె.ఉప్పలపాడు, చినవెంకన్నపాలెం గ్రామాల్లో పర్యటించారు. శనగ, పొగాకు పైర్లను పరిశీలించారు. అనంతరం రైతులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వీఏఏలు డి.జయలక్ష్మి, జె.కొండలరావు పాల్గొన్నారు.

7న మెగా పేరెంట్స్ మీటింగ్

సంతనూతలపాడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల7న మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహించాలని ఎంపీడీవో డి.సురేష్‌బాబు ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం తల్లిదండ్రులతో సమీక్ష నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో చంద్రమౌళీశ్వర్, ఎంఈవో వెంకారెడ్డి, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైభవంగా అఖండ పడి భజన

ఒంగోలు(రూరల్), డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కొప్పోలులోని పెద్ద చెరువు వద్ద అయ్యప్పస్వామి వారి అఖండ పడి భజన బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ముందుగా అయ్యప్ప స్వాములు స్థానిక భీమేశ్వర స్వామి దేవాలయం వద్ద నుంచి పెద్ద చెరువు దగ్గర గల పడిభజన వేదిక వరకు ఊరేగింపుగా భజన కార్యక్రమం నిర్వహించారు. మాలధారులు పలు దేవతల వేషాధారణలతో ఆకట్టుకున్నారు. స్వాములు పలు భక్తిపాటలు ఆలపించారు. అనంతరం భిక్ష కార్యక్రమం జరిగింది.



పడి భజనలో పాల్గొన్న అయ్యప్పస్వాములు

పేదలకు దుస్తుల పంపిణీ

సంతనూతలపాడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులో సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జడ్పీటీసీ డి.రమణమ్మ పుట్టినరోజు, అలాగే డి.ఇంద్రసేనారెడ్డి, దివ్యజ్యోతి వివాహావార్షికోత్సవం పురస్కరించుకుని బుధవారం పేదలకు దుస్తులను పంపిణీ చేశారు. తొలుత కేక్‌కట్ చేసి అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ శనగల వెంకటరమణ, ఎంపీపీ బి.విజయ, సర్పంచ్ డి.నాగమణి, వైసీపీ కన్వీనర్ డి.చెంచిరెడ్డి, డి.యలమందారెడ్డి పాల్గొన్నారు

అనాథ పిల్లలకు అన్నదానం

ఒంగోలు(కల్చరల్), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలోని బొమ్మరిల్లు అనాథ పిల్లల ఆశ్రమంలో బుధవారం కొల్లూరి నేహ, కొల్లూరి అనిల్, గుండ్రేటి సందీప్, నిఖితలు చిన్నారులకు అన్నదానం చేసి పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు కేక్ కట్ చేశారు. ఒంగోలుకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ముద్దన తిరుపతినాయుడు జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టామని వారు తెలిపారు.



కేక్ కట్ చేస్తున్న చిన్నారులు

రైతులపై దాడి దుర్మార్గం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భూములు కోల్పోయిన రైతులు తమకు న్యాయమైన పరిహారం చెల్లించాలని కోరుతూ ఢిల్లీ సరిహద్దులోని అంబేద్కర్ పార్కు వద్ద ఆందోళన చేస్తున్న వారిపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం దాడి చేయడాన్ని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. అరెస్టు చేసిన రైతులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నిందితులను అరెస్టు చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర యూనివర్శిటీలో ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ప్రొఫెసర్ చంగయ్యపై దాడి చేసిన నిందితులను అరెస్టు చేయాలని పలువురు డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ ఎదుట పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రాజశేఖర్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి మోహన్, పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి బి.పద్మ, కేఎన్‌పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి జార్జీలు మాట్లాడారు. చంగయ్యపై దాడి చేసిన భజరంగ్‌దల్ కార్యకర్తలను అరెస్టు చేయాలన్నారు. ఇటువంటి దాడులు అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జాలన్న, పేరయ్య, రామ్మోహన్, హనుమంతరావు, చొప్పర శ్రీనివాస్, మహేశ్వరి పాల్గొన్నారు.

రైజ్‌లో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న జయప్రకాష్‌గాంధీ

ఒంగోలు విద్య, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు సమీపంలోని రైజ్‌కృష్ణసాయి గ్రూప్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు మంగళవారం ఫ్యూచర్ టెక్నాలజీస్, ఉద్యోగావకాశాలు అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కెరీర్ కన్సల్టెంట్ జయప్రకాష్‌గాంధీ ముఖ్యఅతిథిగా హాజరై పలు అంశాలపై ప్రసంగించారు. విద్యార్థులు ఇంజనీరింగ్ చదువు పూర్తయ్యే సరికి అవసరమైన నైపుణ్యాలను సాధించుకోవాలన్నారు. ఇటువంటి సదస్సుల వల్ల విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కళాశాల ట్రెజరర్ శిద్దా భరత్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల గౌరవ చైర్మన్ ఇస్కాల చినరంగమన్నార్, రాగ చీఫ్ అడ్వయిజర్ శిద్దా ప్రవల్లిక, డైరెక్టర్ భాస్కరరావు, ప్రిన్సిపాల్ కేవీ.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● ప్రాజెక్ట్ డైరెక్టర్ జోసఫ్

మద్దిపాడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధి హామీ పథకం ప్రాజెక్ట్ డైరెక్టర్ గంగవరపు జోసఫ్ పేర్కొన్నారు. బుధవారం పెద్దకొత్తపల్లిలోని సీసీరోడ్లు, గోకులం షెడ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఉద్యాన పంటలను ఉపాధి పథకం కింద సాగు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీఎం ధనుంజయవర్మ, టీఏ కిరణ్ పాల్గొన్నారు.

యువత ఓటుహక్కు పొందాలి

ఒంగోలు(రూరల్), డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): 18 సంవత్సరాలు నిండిన విద్యార్థులు, యువత తప్పనిసరిగా ఓటుహక్కు పొందాలని ఎంపీడీవో శేషబాబు కోరారు. బుధవారం ఒంగోలులోని నాగార్జున డిగ్రీ కళాశాలలో ఆయన విద్యార్థులతో సమావేశమై మాట్లాడారు. 2025 జనవరి 25 తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ యోగయ్య, ఎన్నికల డీటీ సలోమి, సీనియర్ సహాయకురాలు మేడికొండ పద్మజానాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో శేషబాబు

అవీ..ఇవీ


ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

అపార్ కష్టాలు వర్ణనాతీతం

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖాధికారుల నిర్ణయాలు అసంబద్ధంగా ఉన్నాయని యూటీఎఫ్ నాయకులు మండిపడ్డారు. అపార్ కార్డుల నమోదులో విద్యాశాఖాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. ఈ మేరకు ఎంఈవో రామ్‌దాస్ నాయక్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. రోజుకు స్కూల్‌లో 10 శాతం కంటే తక్కువ మంది మాత్రమే సెలవు పెట్టాలని నిబంధనలు పెడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఓటీ వీరారెడ్డి, జిల్లా కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.జయరామిరెడ్డి, వి.రాజేష్, సీనియర్ నాయకులు కె.వెంకటేశ్వరరెడ్డి, కె.వెంకటేశ్వర్లు, అల్లూరిరెడ్డి, పి.రమాదేవి, జి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే సోదరుడు కృష్ణకిశోర్‌రెడ్డి

మృతుని కుటుంబానికి రూ. 50వేల ఆర్థిక సహాయం

గిద్దలూరు టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కుటుంబానికి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆర్థిక సహాయం ప్రకటించారు. మండలంలోని ముండ్లపాడు గ్రామానికి చెందిన నున్నా సోమలింగం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే ముత్తుముల ఆదేశాల మేరకు ఆయన సోదరుడు కృష్ణకిశోర్‌రెడ్డి సోమలింగం కుటుంబ సభ్యులైన వసుంధరకు రూ. 50వేలను అందించారు. తమ పరిస్థితి తెలుసుకుని ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యే ముత్తుములకు కుటుంబసభ్యులు ధన్యావాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కడియం శేషగిరి, రామచంద్రరెడ్డి, శ్రీను ఉన్నారు.


సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న హిందూ సంఘాల ఐక్య వేదిక నాయకులు

బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలి

మార్కాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు చర్యలు తీసుకుని వారికి రక్షణ కల్పించాలని హిందూ సంఘాల ఐక్య వేదిక నాయకులు బుధవారం సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్‌కు వినతిపత్రం అందజేశారు. ముందుగా స్థానిక లక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థానం నుంచి పలు హిందూ సంఘాల ప్రతినిధులు నిరసన ప్రదర్శనను చేపట్టారు. నినాదాలు చేసుకుంటూ గడియారస్తంభం సెంటర్, కంభం రోడ్డు, కోర్టు సెంటర్ మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం వినతిపత్రాన్ని సబ్ కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు ఇమ్మడిశెట్టి వీరారావు, జిల్లా గౌరవాధ్యక్షులు గోపాలుని హరిహరరావు, సీనియర్ నాయకులు యక్కలి కోటేశ్వరరావు, నర్లా వెంకటరెడ్డి, బీజేపీ నాయకులు, ఇస్కాన్ ప్రతినిధులు, హిందూ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వెలిగొండను త్వరగా పూర్తి చేయాలి

- మంత్రి లోకేష్‌ను కోరిన ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన ప్రాంతమైన పశ్చిమ ప్రకాశానికి జీవనాడి అయిన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు తగినన్ని నిధులు కేటాయించి త్వరితగతిన పూర్తి చేయాలని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి బుధవారం రాష్ట్ర మానవవనరుల శాఖామంత్రి నారా లోకేష్‌ను కోరారు. రాజధాని అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో లోకేషను కలిశారు. మార్కాపురం డివిజన్ దశాబ్దాలుగా వెనుకబాటుకు గురైందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి తెలిపారు. ఈ ప్రాంత దశ, దిశ మారాలంటే వెలిగొండ ప్రాజెక్టు పూర్తిచేయడమే మార్గమన్నారు. గత ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాజెక్టు పూర్తి చేస్తానని హామీ ఇచ్చిన విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాక ఎంతోమంది సీనియర్ నాయకులు ఈ ప్రాంతంలో ఉన్నా నామినేటెడ్ పదవుల భర్తీలో కొంతమేర అన్యాయం జరిగిందన్నారు. పార్టీకోసం కష్టపడే కొంతమంది కార్యకర్తలు ఈ మధ్య కాలంలో చనిపోయారన్నారు. వారి కుటుంబాలను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. పేరుకు డివిజన్ కేంద్రమే అయినా మార్కాపురంలో నేటికీ ఒక్క డిగ్రీ, ఇంటర్ ప్రభుత్వ కళాశాలలు లేవన్నారు. డివిజన్ కేంద్రానికి ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాలలను మంజూరు చేయాలని కోరారు. అన్ని సమస్యలను సానుకూలంగా విన్న మంత్రి లోకేష్ తప్పకుండా మార్కాపురం డివిజన్‌లోని అన్ని సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే నారాయణరెడ్డి వివరించారు.


మంత్రి లోకేష్‌కు వినతిపత్రం అందజేసి సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

నిబంధనల ప్రకారం పశువుల పాకలను నిర్మించాలి

ఎంపీడీవో శ్రీనివాసులు

మార్కాపురం రూరల్, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పశువుల పాకలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మించాలని ఎంపీడీవో శ్రీనివాసులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో జీవరత్నం ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశపు హాలులో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బందితో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో కూలీలకు పనులు కల్పించి వేతనాన్ని సకాలంలో అందే విధంగా పనిచేయాలని తెలిపారు. రైతులు తమ పొలాల్లో రైతు వారి నీటి కుంటలను నిర్మించుకునే విధంగా అవగాహన కల్పించాలని కోరారు. గ్రామాలలో పనులు లేని ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పథకం ద్వారా పని కల్పించి సరైన వేతనం అందించేలా పని చేయాలని ఆదేశించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసులు

మొక్కల బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలి

ఎర్రగొండపాలెం రూరల్ : మండల పరిధిలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద సాగు చేసిన ఉద్యాన పంటలకు సంబంధించిన ఎం బుక్‌లు, బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి. శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు కలిసి గ్రామాలలో మంజూరైన పథకాలను ప్రజలకు చేరవేయాలని అన్నారు. గ్రామాల్లో పనులకు సంబంధించిన వివరాలు సచివాలయాల్లో అందుబాటులో ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో ఏపీవో ఎం. శైలజ, ఈసీ డి. లక్ష్మనాయక్, టీఏలు ఎం.వి. రమణ, గౌసియ భాను, సీహెచ్. రమణారెడ్డి, వి. లక్ష్మయ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షల పరిశీలన

గిద్దలూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సర్వేలో భాగంగా మండలంలోని 7 పరీక్ష కేంద్రాలలో బుధవారం నిర్వహించిన పరక్ రాష్ట్రీయ సర్వేక్షన్ జాతీయ స్థాయి సామర్థ్యాల అంచనా పరీక్షలను ఎంఈవో-2 శ్రీనివాసులు పరిశీలించారు. ఈసందర్భంగా పరీక్షలకు హాజరైన విద్యార్థుల సంఖ్య కేంద్రంలోని సౌకర్యాలను పరిశీలించారు. పరీక్షల నిర్వహణపై సూచనలు చేశారు. ఈపరీక్షల ద్వారా జాతీయ స్థాయిలో విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేయనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కంభంలో పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న ఎంఈవో శ్రీనివాసులు

పెద్దదోర్నాలలో..

పెద్ద దోర్నాల : జాతీయ సాధన సర్వే (నేషనల్ అచీవ్‌మెంటు సర్వే)పరీక్షలు విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు ఉపకరిస్తాయని ఎంఈవో మస్తాన్ నాయక్ పేర్కొన్నారు. స్థానిక రవీంద్ర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షన్ జాతీయ స్థాయి సామర్థ్యాల అంచనా పరీక్షా కేంద్రాన్ని ఎంఈవో మస్తాన్ నాయక్ బుధవారం పరిశీలించారు. పరీక్షలకు హాజరైన విద్యార్థుల సంఖ్య, వారికి ఏర్పాటు చేసిన వసతులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో మోడల్ స్కూల్‌లో ఒకటి, రవీంద్రలో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎన్‌సీసీ సర్టిఫికెట్లు అందజేత

గిద్దలూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కంభంలోని సీఎల్‌ఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఎన్‌సీసీ- సీ సర్టిఫికెట్లను బుధవారం అందజేసినట్లు ఎన్‌సీసీ 34ఎ బెటాలియన్ కమాండర్ వి.మోహన్ తెలిపారు. కళాశాల విద్యార్థులైన మధు, చిరంజీవి, మహమ్మద్ రఫి, భూలక్ష్మి, పుష్ప, సంధ్యలకు సర్టిఫికెట్లు అందజేశామన్నారు. కరస్పాండెంట్ సయ్యద్ షా అలీబాషా, జూనియర్ కళాశాల డైరెక్టర్ శిరిగిరి బ్రహ్మం, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపు మెగా రక్తదాన శిబిరం

పట్టణంలోని జీవనజ్యోతి విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీన మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రారంభించనున్నారని పేర్కొన్నారు.

మంత్రి స్వామికి నేతల జన్మదిన శుభాకాంక్షలు

పెద్ద దోర్నాల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామికి దోర్నాల మండల టీడీపీ నాయకులు, ఎర్రగొండపాలెం నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు డొడ్డా శేషాద్రి, ఒంగోలు పార్లమెంటు ఎస్సీ సెల్ నాయకులు చంటి బుధవారం ఒంగోలు టీడీపీ కార్యాలయంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.


మంత్రి స్వామికి శుభాకాంక్షలు తెలుపుతున్న స్థానిక నాయకులు

వైభవంగా అయ్యప్ప విళక్కి

గిద్దలూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీ ఉమామహేశ్వర సహిత అయ్యప్ప స్వామి దేవస్థానంలో బుధవారం అత్యంత వైభవంగా కర్పూర నగర విళక్కి కార్యక్రమం నిర్వహించారు. ఉదయం అయ్యప్ప భక్తులు నగర సంకీర్తన నిర్వహించి కలశ స్థాపన చేశారు. శ్రీలక్ష్మీగణపతి నవగ్రహ సుదర్శణ, అయ్యప్ప స్వామి మూలమంత్రాలతో హోమం నిర్వహించారు. కన్నె స్వాములతో కలశ పూజ నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం, అనంతరం కర్పూర నగర విళక్కి కార్యక్రమం నిర్వహించారు. దీక్షాధారులకు, భక్తులకు సద్ది, భిక్షలను అందజేశారు. దేవస్థాన కమిటీ ప్రతినిధులతోపాటు కటకం ట్రస్టు చైర్మన్ కటకం నాగేశ్వరరావు, గ్రామపెద్దలు పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి

మార్కాపురం రూరల్, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రతి గ్రామంలో ఈ నెల 6వ తేదీ నుంచి రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కె. చిరంజీవి తెలిపారు. బుధవారం ఆయన తన చాంబర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ గ్రామ సభలను నిర్వహిస్తుందని తెలిపారు.అలాగే ప్రభుత్వ భూముల ను ఆక్రమించిన వారికి నోటీసులతోపాటు పీడీఎస్ బియ్యం అక్రమంగా నిల్వ చేసి తరలించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో డీటీ శ్రీనివాసులు ఉన్నారు.

కంది, పప్పుశనగకు తీవ్ర నష్టం

గిద్దలూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు పప్పుశనగ రైతులను నష్టపరిచాయి. నియోజకవర్గంలో సుమారు 500 హెక్టార్లలో పప్పుశనగ సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇందులో ఒక్క కొమరోలు మండలంలోనే 330 హెక్టార్లలో సాగైన కంది పంటలో నీరు నిలబడడంతో పంట కుళ్లిపోయిందని స్థానిక వ్యవసాయాధికారులు నివేదిక అందజేసినట్లు సహాయ వ్యవసాయ సంచాలకులు బాలాజీనాయక్ తెలిపారు. మిగతా మండలాలలో పలు గ్రామాల పరిధిలో మరో 170 హెక్టార్ల మేర పప్పుశనగ పంటకు నష్టం వాటిల్లినట్లు తెలిసింది. అధికారికంగా నివేదికలు రావాల్సి ఉంది. కాగా వరిపంట చెరువుల కింద, బోర్ల కింద సాగు కాగా కోతకు వచ్చే దశలో వర్షాలు కురవడంతో చేతికి అందిన పంట తడిచిపోయిందని వరి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

తర్లుపాడు : మిరప పంటలో ప్రస్తుతం తెగుళ్ల విజృంభిస్తునందున తక్షణమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి పి.వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని కలుజువ్వలపాడు, తర్లుపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

బొప్పాయిలో తెగుళ్లపై రైతులకు అవగాహన

ఎర్రగొండపాలెం రూరల్ : వాతావరణం మార్పు నేపథ్యంలో బొప్పాయి పంటకు ఆకు ముడ్డ తెగులు సోకిందని ఎర్రగొండపాలెం ఉద్యానవన శాఖ అధికారి పి. ఆదిరెడ్డి అన్నారు. బుధవారం మండంలోని వీరభద్రాపురం, బోయలపల్లి గ్రామాలలో మిరప, కంది, పత్తి, ఆరటి, బొప్పాయి పంటలను పరిశీలించారు.


ఘంటసాల విగ్రహావిష్కరణలో చైతన్య కళాస్రవంతి సభ్యులు

ఘంటసాల, త్యాగరాజుల విగ్రహావిష్కరణ

పొదిలి, డిసెంబరు 4 : (ఆంధ్రజ్యోతి) స్థానిక త్యాగరాజు నగర్‌లో పొదిలి చైతన్య కళాస్రవంతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఘంటసాల, త్యాగరాజుల విగ్రహాలను బుధవారం ఆవిష్కరించారు. అనంతరం జయంతివేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగరపంచాయతీ కమిషనర్ శ్రీనివాసులు పాల్గొని మాట్లాడుతూ తెలుగుజాతి గర్వించదగిన వ్యక్తి ఘంటసాల వెంకటేశ్వరరావు అన్నారు. అనంతరం కమిషనర్ చేతులమీదుగా ఘంటసాల విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఎంఈవో ఎం. శ్రీనివాసరెడ్డి, శానిటరీ అధికారి మారుతీరావ్, గాయకులు శివశంకర్, ప్రభాకర్‌రావు, మణి, రంగారావు, రఫి, అశోక్, రజిని, బీవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

అంకాలమ్మ తిరునాళ్లలో ఎమ్మెల్యే ముత్తుముల

గిద్దలూరు టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మాచర్ల నియోజకవర్గంలోని కారంపూడి గ్రామంలో పల్నాటి వీరులను స్మరించుకుంటూ ఏటా నిర్వహించే వీర్ల అంకాలమ్మ తిరునాళ్లలో మంత్రి గొట్టిపాటి రవి, ఎమ్మెల్యేలు జూలకంటి బ్రహ్మానందరెడ్డితో కలిసి గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.


ఎరిక్షన్ బాబును కలిసి వినతి పత్రం అందిస్తున్న బీసీ సంఘు నాయకులు

ఎరిక్షన్ బాబును కలిసిన బీసీ సంఘు నాయకులు

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎర్రగొండపాలెం నియోజకవర్గ బీసీ సంఘం నాయకులు టీడీపీ ఇన్‌చార్జీ గూడూరి ఎరిక్షన్ బాబును బుధవారం ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ఎర్రగొండపాలెం పట్టణంలో బీసీ భవనం స్థలం, భవన నిర్మాణం, పలు సమస్యలను ఆయనకు వివరించినట్లు వారు తెలిపారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎరిక్షన్ బాబును కలిసిన వారిలో నియోజకవర్గ అధ్యక్షులు యాపర్తి వీరయ్య, ప్రధాన కార్యదర్శి డాక్టర్ బట్టిపోతుల వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు ఎడవల్లి రామయ్య, అధికార ప్రతినిధి ముటుకూరి వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షులు బండ్ల బ్రహ్మయ్య, గౌరవ సలహాదారులు, నాయకులు తదితరులు ఉన్నారు.

క్రైం సమాచారం


కాలువలో జారిపడి వృద్ధుడి మృతి

మార్కాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కాలుజారి మురుగు కాలువలో పడి ఓ వృద్ధుడు వై.రంగారావు (71) మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం వెలుగుచూసింది. స్థానికుల కథనం మేరకు స్థానిక పూలసుబ్బయ్య కాలనీలో నివాసముంటున్న రంగారావు రాత్రి 10 గంటల సమయంలో ఆర్టీసీ బస్టాండ్ వైపునుంచి ఇంటికి నడుచుకుంటూ వెళుతున్నాడు. ఈ క్రమంలో సబ్ కలెక్టర్ బంగ్లా సమీపంలోకి వచ్చేసరికి రోడ్డు అంచునున్న మట్టిపై నడుస్తుండగా కాలు జారింది. దీంతో కాలువలో పడిపోయాడు. ఉదయం వరకు ఎవరూ గమనించలేదు. వేకువజామున అటుగా వెళ్తున్న పాదచారులు గమనించి రంగారావును బయటకు తీశారు. తలకు గాయమై రక్తస్రావం కావడంతో అప్పటికే మృతిచెందాడు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు మృతదేహాన్ని తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

త్రిపురాంతకం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పొలానికి నీరు పెట్టే క్రమంలో మోటారు వేసేందుకు వెళ్లి విద్యుత్ షాక్‌కు గురై రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలో బుధవారం రాత్రి జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం టి.చెర్లోపల్లి గ్రామానికి చెందిన రైతు పువ్వకాయల కేశయ్య(50) తన గ్రామ సమీపంలోని పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. సాయంత్రం వేళ మోటార్ ఆన్ చేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. రాత్రవుతున్నా కేశయ్య రాకపోవడంతో పొలం వద్దకు వెళ్లి చూసిన బంధువులకు ఆయన మృతి చెంది కనిపించాడు. దీంతో పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై శివబసవరాజు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం వైపాలెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాగా కేశయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కంభంలో యువకుడు మృతి


కమల్‌రాజ్ (24)

కంభం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శుభ కార్యం జరుగుతున్న గృహానికి విద్యుత్ లైట్లను అలంకరిస్తున్న యువకుడు షాక్‌తో మరణించిన సంఘటన కంభం పట్టణంలో బుధవారం సాయంత్రం జరిగింది. విద్యుత్ ఏఈ నరసయ్య కథనం ప్రకారం కంభం మండలం చిన్నకంభం గ్రామానికి చెందిన మున్నంగి కమల్‌రాజ్ (24) కంభంలోని ఓ సప్లయర్స్‌లో పని చేస్తున్నాడు. బుధవారం పట్టణంలో సూపర్ మార్కెట్ వీధిలోని ఓ గృహంలో జరుగుతున్న వివాహ వేడుకలకు విద్యుత్ దీపాలతో అలంకరిస్తుండగా షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని తల్లిదండ్రులు చిన్నకంభం గ్రామంలో నివాసం ఉంటున్నారు. తండ్రికి పక్షవాతం వచ్చి మంచానికే పరిమితం కావడంతో కమల్‌రాజ్ కుటుంబ బాధ్యతను మోస్తున్నాడు. కంభం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘాటు తగ్గిన మిర్చి



రోజురోజుకూ పతనమవుతున్న ధరలు

గతేడాది అంతా ఆశాజనకమే

ధరలు ఇంకా పెరుగుతాయన్న ఆశతో

కొందరు కోల్డ్ స్టోరేజీలలో నిల్వ

క్వింటాకు రూ.5 వేలు తగ్గిన వైనం

ఈ ఏడాది కోతకు వస్తున్న కాయలు

ఆందోళనలో రైతులు

ముండ్లమూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మిర్చి ధరలు పడిపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. నెలరోజుల వ్యవధిలోనే క్వింటాకు ధర రూ.5 వేలకుపైగానే తగ్గింది. గత ఏడాది మిర్చి సాగు చేసిన రైతులు ఆశాజనకంగా ధరలు ఉండడంతో భవిష్యత్తులో ఇంకా పెరుగుతాయన్న ఆశతో కోల్డ్ సోరేజీలలో నిల్వ పెట్టారు. ఇదిలా ఉండగా.. ఈ ఏడాది సాగు చేసిన మిర్చి చేలల్లో కాయ కోతకు రావడం, ధరలు పాతాళానికి పడిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది తేజా డీలక్స్ అనే రకం క్వింటా ధర రూ.21 వేల వరకు పలికింది. నెల రోజులుగా మిర్చి ధరలు 5 వేల నుంచి 6 వేల వరకు దిగజారాయి. ఒక్కసారిగా ధర తగ్గడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

కొత్తగా మార్కెట్లోకి వస్తున్న తేజా రకం, 341 రకం ధరలు రూ.11 నుంచి రూ.13 వేల ధర మాత్రమే పలుకుతోంది. ఆరుమూరు బేడిగ రూ.10 వేల నుంచి రూ.12 వేలు, సీడ్ రకాలు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు ధరలు పలుకుతున్నాయి. ధరలు పూర్తిగా దిగజారడంతో గతంలో సోరేజ్‌లో సరుకు నిల్వ చేసిన రైతులతో పాటు ఈ ఏడాది మిర్చి సాగుచేస్తున్న రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అప్పులు తెచ్చి ఆరుగాలం శ్రమించి మిర్చి సాగు చేసిన రైతులు రోజురోజుకూ పతనమవుతున్న ధరలను చూసి ఆందోళన చెందుతున్నారు. పంటపై తెచ్చిన అప్పులు తీర్చే పరిస్థితి లేదని వాపోతున్నారు.

ఉమామహేశ్వరఅగ్రహారం, పూరిమిట్ల, బొప్పూడివారిపాలెం, సుంకరవారిపాలెం, మారెళ్ల, నాయుడుపాలెం, తమ్మలూరు, పసుపుగల్లు, ముండ్లమూరు గ్రామాల రైతులు పలు కోల్డ్ స్టోరేజీలలో పండిన పంట 5 వేల క్వింటాళ్ల వరకు నిల్వ చేసిన పరిస్థితి. ధరలు దిగజారుతున్న పరిస్థితిలో చేసేదేమీ లేక ఉన్న ధరకే సరుకు అమ్ముకునేందుకు సిద్ధపడుతున్నారు. నిల్వ పెట్టిన రైతుల పరిస్థితి ఈ విధంగా ఉంటే... ఈ ఏడాది సాగు చేసిన రైతుల పరిస్థితి మరీ దుర్భరంగా తయారైంది.

భారీగా నష్టపోయాం



తెలప్రోలు ఆంజనేయులు, మిర్చి రైతు, బొప్పూడివారి పాలెం

గత ఏడాది రెండున్నర ఎకరాలలో సాగుచేసి పండించిన 50 క్వింటాళ్ల ఎండు మిర్చిని గుంటూరులోని ఓ కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేశా. పంట చేతి కందిన సమయంలో క్వింటా రూ.21 వేలకు అడిగారు. ఇంకా ధర పెరుగుతుందన్న ఆశతో నిల్వ ఉంచా. అసలుకే మోసం వచ్చిందని వాపోయాడు.

సర్వేయర్‌గా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ



శ్రీనివాసరావు

తాళ్లూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల సర్వేయర్‌గా వై.శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న సర్వేయర్ నాగరాజుబాబు రోడ్డు ప్రమాద బారినపడడంతో సెలవుపై వెళ్లాడు. ఆయన స్థానంలో తాళ్లూరు సచివాలయ విలేజ్ సర్వేయర్ మల్లికార్జున రావు ఇన్‌చార్జి సర్వేయర్‌గా విధులు నిర్వహించారు. తాజాగా నాగరాజు బాబును డిప్యూటేషన్‌పై ఒంగోలు ఏడీ కార్యాలయం టాస్క్‌ఫోర్సుకు బదిలీ చేయగా, టాస్క్‌ఫోర్సులో పనిచేస్తున్న యన్నాబత్తిన శ్రీనివాసరావును తాళ్లూరు తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ చేశారు.

మినుముకు తెల్ల దోమ దెబ్బ

కనిగిరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మినుము పంటను తెల్లదోమ ఆశించి రైతులకు తీవ్ర నష్టం ఏర్పరచింది. నియోజకవర్గంలో మినుము పంట 5,355 హెక్టార్లలో సాగు చేపట్టారు. ఆరు మండలాల్లో కనిగిరితో పాటు పీసీపల్లి మండలంలో అత్యధికంగా సాగు చేపట్టారు. వారం రోజులుగా తుఫాన్ ప్రభావంతో పట్టిన ముసురుతో మినప చేలకు తెల్లదోమ తెగులు సోకి ఆకులు రంధ్రాలు ఏర్పడి మొక్క జీవం కోల్పోతోంది. తెల్లదోమ నివారణకు ఫేమ్ 20ఎం.ఎల్ 1లీటరు నీటిలో కలిపి ఎకరాచొప్పున పిచికారీ చేయాలని వ్యవసాయశాఖ ఏడీఏ రమణ సూచించారు.

మధ్యాహ్నభోజనం తనిఖీ

తాళ్లూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగంబొట్లపాలెం జడ్పీహైస్కూలులో మధ్యాహ్నభోజన పథక అమలు తీరును ఎంఈవో జి.సుబ్బయ్య బుధవారం పరిశీలించారు. భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

పసుపుగల్లు మసీదుకు మైక్ సెట్ బహూకరణ

ముండ్లమూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పసుపుగల్లు మసీదుకు రూ.18వేలు విలువ చేసే మైక్ సెట్టును టీడీపీ సీనియర్ నేత కడియాల రమేష్ చేతుల మీదుగా బుధవారం సాయంత్రం దాత పందుగుల శ్రీనివాసరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ దేవాలయాలు, మసీదులు దాతల సహకారం ఉంటే అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఇందూరి పిచ్చిరెడ్డి, గ్రామ టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యులు వరగాని పౌలు, కొక్కెర నాగరాజు, మాజీ వైస్ ఎంపీపీ షేక్ మదార్‌వలి, షేక్ మస్తాన్‌వలి, వలి, పీరు సాహెబ్, గూడాల వెంకటేశ్వరరెడ్డి ఉన్నారు.

పోలీసుల పర్యవేక్షణలో ఆక్రమణల తొలగింపు

కనిగిరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కనిగిరిలో నెల రోజులుగా ఆక్రమణ తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. ప్రధాన వీధుల్లోని భారీ డ్రైనేజీలపై ఉన్న ఆక్రమణలను తొలగించిన నేపథ్యంలో స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో మున్సిపల్ అధికారులు రికార్డులు పరిశీలిస్తున్నారు. ఆక్రమణదారుల ఇంటి, షాపు పత్రాల అధారంగా ఉన్న స్థలాన్ని వదిలి వేస్తున్నారు. పత్రాలలో నమోదైన స్థలానికి మించి ఆక్రమిస్తే తొలగిస్తున్నారు. వారం రోజుల క్రితం మున్సిపల్ చైర్మన్ గఫార్ నివాసం వరకు వచ్చి ఆగిపోయిన ఆక్రమణల తొలగింపు ప్రక్రియ బుధవారం తిరిగి ప్రారంభించారు. ఇప్పటి వరకు మున్సిపల్ చైర్మన్ గఫార్‌తో పాటు ఆ పక్కనే ఉన్న మోటర్‌బైక్ షోరూం నిర్వాహకులు కోర్టులను ఆశ్రయించటంతో ఆగిపోయిందని ప్రజల్లో ప్రచారం నడిచింది. కానీ బుధవారం తిరిగి అక్కడి నుంచి తొలగింపు ప్రక్రియ చేపట్టిన అధికారులకు ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా పోలీసుల పర్యవేక్షణలో తొలగింపు చేపట్టారు. హెచ్ఎంపాడు ఎస్ఐ మాధవరావు ఆక్రమణల తొలగింపు ప్రక్రియను పర్యవేక్షించటంతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు సాగింది. భారీ డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడికను తొలగించి పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా మురుగు సక్రమంగా పారేందుకే ఆక్రమణల తొలగింపు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ జోసఫ్ డానియేలు చెప్పారు. ఆక్రమణల తొలగింపు సందర్భంగా డ్రైనేజీలో పడిన రాళ్లను శుభ్రం చేయించి డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు.



ఆక్రమణల తొలగింపు ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఎస్ఐ మాధవరావు

ఘనంగా డాక్టర్ లలిత్‌సాగర్ జన్మదిన వేడుకలు



దొనకొండలో కేక్ కట్ చేస్తున్నరమేష్, టీడీపీ నాయకులు

దొనకొండ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ స్థానిక కార్యాలయంలో నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ జన్మదిన వేడుకలను మండల పార్టీ అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోడి వెంకటేశ్వర్లు, కందుల నారపురెడ్డి, కొత్తం రఘునాథరెడ్డి, దుగ్గెంపూడి చెంచయ్య, వడ్లమూడి వెంకటేశ్వర్లు, కుందుర్తి లక్ష్మణ్, యరగొర్ల బసవయ్య, మన్నెం గాలయ్య, కొమ్మతోటి సుబ్బారావు, షేక్ తోహీద్, మోడి పెద్దఆంజనేయులు, ఫణిదపు వీరాంజినేయులు, చెన్నయ్య, కేశవ, యగ్గోని యల్లారెడ్డి, తోటా వెంకటేశ్వర్లు, విప్పర్ల లక్ష్మీరావు, అంకాల మల్లికార్జున, బండారు శ్రీను, పెమ్మసాని లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

దర్శిలోనూ...

దర్శి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ టీడీపీ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ పుట్టినరోజు వేడుకలను దర్శిలో ఘనంగా నిర్వహించారు. నాయకుడు కడియాల రమేష్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావులు పుట్టిన రోజు కేకును కట్ చేసి అభిమానులకు పంచారు. సాయిబాబా వృద్ధుల ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు కడియాల శివ, స్టీవెన్, పూసల చిన్నయ్య, బొట్ల కోటేశ్వరరావు, గొర్రె సుబ్బారెడ్డి, దేవతి మహనంద, వీసీ రెడ్డి, కోటా హనుమంతరావు, పుల్లలచెరువు చిన్నా, గుర్రం బాలకృష్ణ, యాదగిరి వాసు, నారపుశెట్టి మధు, వెలుగొండారెడ్డి, కొండవీటి సుబ్బారావు, కర్నాటి వెంకటనారాయణ, కంచేటి శ్రీనివాసరావు, ఫణిబాబు పాల్గొన్నారు.

తాళ్లూరులో...

తాళ్లూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తాళ్లూరులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద జరిగిన లలిత్‌సాగర్ జన్మదిన వేడుకల్లో మండల టీడీపీ అధ్యక్షులు బి.ఓబుల్‌రెడ్డి భారీ కేక్ కట్ చేశారు. అనంతరం పీహెచ్‌సీలోని రోగులకు, బీసీ బాలికల వసతి గృహంలో బాలికలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో నేతలు మానం రమేష్‌బాబు, శాగం కొండారెడ్డి, మేడగం వెంకటేశ్వరరెడ్డి, గొల్లపూడి వేణుబాబు, షేక్ కాశీం సైద్, ఆర్ పరిశుద్ధరావు, షేక్ మీరామొహిద్దీన్, చెన్నపురెడ్డి వీరనాగిరెడ్డి, ఇడమకంటి శ్రీనివాసరెడ్డి, కె.రామకోటిరెడ్డి, పిన్నిక రమేష్, జి.లక్ష్మీనారాయణ, మన్నేపల్లి సమర, రాచకొండ వెంకట్రావు, శివనాగిరెడ్డి, విద్యాసాగర్, నుసుం ఆదినారాయణరెడ్డి, కె.నాగార్జునరెడ్డి, పోలంరెడ్డి రమణారెడ్డి, మారం వెంకటరెడ్డి, అనపర్తి సుబ్బారావు, కె.రామయ్య, అన్వర్‌బాష, పేరిరెడ్డి, హనుమారెడ్డి, పాలం అంజిరెడ్డి, మరాబత్తుల సుజాత, మేలికా అంజమ్మ పాల్గొన్నారు. గుంటిగంగలోని వృద్ధాశ్రయాల్లో నిర్వహించిన వేడుకల్లో కార్యదర్శి వల్లభనేని సుబ్బయ్య, చాట్ల డానీ, తూము రవి, బద్దుల శ్రీను, సోమా సుబ్బారావు, ప్రసన్నకుమార్, యాతం శ్రీనివాసరెడ్డి, అనుమల కోటేశ్వరరావు, సాయి పాల్గొన్నారు.

ముండ్లమూరులో...

ముండ్లమూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలో టీడీపీ నేత లలిత్ సాగర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారీ కేకులు కట్ చేయటంతో పాటు అన్నదానాలు చేశారు.ఈ వేడుకల్లో కడియాల రమేష్, కూరపాటి శ్రీనివాసరావు, వరగాని పౌలు, వేముల పద్మా జానకి రామయ్య, దేవినేని కోటేశ్వరరావు, ఇందూరి పిచ్చిరెడ్డి, ఏరేసు వెంకటేశ్వరరెడ్డి, లక్కిరెడ్డి గంగిరెడ్డి, పాశం వెంకటేశ్వరరావు, సుంకర రాఘవరెడ్డి, కొర్రపాటి శ్రీనివాసరావు, కంచుమాటి శ్రీనివాసరావు, గూడాల సాంబశివారెడ్డి, చిమ్మిలి రాజేంద్రప్రసాదు, రామాంజనేయులు, కాటూరి గురవయ్య, పందుగుల శ్రీనివాసరెడ్డి, చింతల రాజారెడ్డి పాల్గొన్నారు.



దర్శిలో కేక్ కట్ చేస్తున్న పాపారావు, రమేష్



ముండ్లమూరులో కేక్ కట్ చేస్తున్న నేతలు



తాళ్లూరులో కేక్ కట్ చేస్తున్న నేతలు

మోపాడులో పెరిగిన నీటిమట్టం

పామూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో రెండురోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మోపాడు రిజర్వాయర్‌లో ఒక అడుగు మేర నీటిమట్టం చేరింది. గతంలో 7 అడుగుల నీటిమట్టం ఉండగా ఈ వర్షాలకు ఒక అడుగు నీరు చేరి మొత్తం 8 అడుగులుగా నమోదైంది. రిజర్వాయర్‌లో మరో 5 అడుగుల మేర నీరు చేరితే ఆయకట్టులో వరి పైర్లను సాగు చేస్తారని ఇరిగేషన్ సిబ్బంది తెలిపారు. ప్రస్తుతం ఆయకట్టు పరిధిలోని మోపాడు, కంభాలదిన్నె, బొట్లగూడూరు, లక్ష్మీనరసాపురం, తూర్పుకట్టకిందపల్లి ప్రాంతాల్లో మెట్ట పంటలైన మినుము, జొన్న పంటలను సాగు చేశారు.



మోపాడు రిజర్వాయర్‌లో 8 అడుగులకు చేరిన నీటి మట్టం

పైర్లలో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపాలి

పామూరు, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి) : పైరులో వర్షపు నీరు నిలబడితే తక్షణమే బయటకు పంపాలని ఉద్యానశాఖ హెచ్ఎం కే కుసుమ చెప్పారు. మండలంలోని చింతపూడు గ్రామంలో సాగులో ఉన్న మిరప పైరును పరిశీలించారు.

సీఎస్‌పురంలో...

సీఎస్‌పురం, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాలకు పైర్లలో నీరు నిల్వ లేకుండా చూచుకోవాలని ఏవో బి సంపత్ కుమార్ చెప్పారు. మండలంలోని రేగులచిలక, చెన్నపునాయునిపల్లె, గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనివాసులు, సహాయకులు వీ చిరంజీవి రెడ్డి, ఎం వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో చీడపీడల నివారణ

పీసీపల్లి, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): మినుము, కంది పైర్లలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా చీడపీడలను నివారించవచ్చునని మండల వ్యవసాయ అధికారి కె.ప్రకాశరావు చెప్పారు. మండలంలోని పెదయిర్లపాడు, వెంగళాయపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులతో పాటు ఏఈవో పుల్లయ్య, వీపీఏలు శ్రీనివాసరెడ్డి, రామిరెడ్డి పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

వెలిగండ్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలను బుధవారం వ్యవసాయాధికారులు, మండల టీడీపీ నాయకులు పరిశీలించారు. రైతలను అడిగి వివరాలను సేకరించారు. కోత దశకు వచ్చిన వరి నేలకు ఒరిగిపోవడంతో మెలకలు వచ్చాయని, శనగ పంట కూడా వర్షానికి మునిగిపోయిందని రైతులు తెలిపారు. ఏడీఏ రమణ, ఏవో రంగా కృష్ణలు నష్టాన్ని ప్రాథమికంగా అంచన వేశారు. మరో రెండు రోజులు క్షేత్రస్థాయిలో పైర్లను పరిశీలించి పూర్తి నివేదికను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ రైతు అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్ రెడ్డి, కర్నాటి భాస్కర్ రెడ్డి, జయపాల్ రెడ్డి, ముత్తిరెడ్డి శ్రీను పాల్గొన్నారు

పూత ఉన్న పంటలను రక్షించుకోవాలి

పామూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : పూతదశలో ఉన్న మినుము, కంది, శనగ పైర్లను జాగ్రత్తగా పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని ఏవో కే రాధ చెప్పారు. మండలంలోని దాదిరెడ్డిపల్లి, పడమటకట్టకిందపల్లి గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

ఈ పంటలో నమోదైతేనే ఫసల్ బీమా

దొనకొండ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : ఈక్రాప్‌లో నమోదు చేసుకుంటేనే ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం వర్తిస్తుందని మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ చెప్పారు. పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని వద్దిపాడు, పెద్దన్నపాలెం, ఆరవల్లిపాడు గ్రామాల్లో వ్యవసాయ సహాయకులు చేస్తున్న ఈ పంట నమోదును, దెబ్బతిన్న పంటలను ఆయన తనిఖీ చేశారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

ముండ్లమూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలు పరిష్కరించటంలో సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని ఎంపీడీవో ఆర్ జనార్దన్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని శంకరాపురం, పూరిమెట్ల, ఈదర, ఉమామహేశ్వర అగ్రహారం గ్రామాల్లోని సచివాలయాలను సందర్శించారు.

అవీఇవీ

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

పీసీపల్లి, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 6వ తేదీ నుంచి మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సీహెచ్ ఉషా తెలిపారు. ఈనెల 6నుంచి జనవరి 8వ తేదీ వరకు ఈ సదస్సులను నిర్వహిస్తామన్నారు. రైతులు తమ భూసమస్యలపై దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పామూరులో...

పామూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : మండలంలో గురువారం నుంచి వచ్చే ఏడాది జనవరి 9 తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బీవీ రమణారావు చెప్పారు. తొలిరోజు రావిగుంటపల్లి గ్రామ సచివాలయంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలి

దొనకొండ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : దొనకొండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే మంజూరు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం పంచాయితీ కార్యాలయం వద్ద నిసరన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు ఎనిమిది నెలలుగా జీతాలు లేక కుటుంబ పోషణ గడవక అప్పులు చేసుకొని జీవిస్తున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న ఎనిమిది నెలల వేతనాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు కుందుర్తి అనీల్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

వీఆర్వోలపై పని ఒత్తిడి తగ్గించాలి



కమిటీ సభ్యులను అభినందిస్తున్న సహచర వీఆర్వోలు

పామూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వీఆర్వోలపై పెరుగుతున్న పని ఒత్తిడి భారాన్ని తగ్గించాలని మండల వీఆర్వో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బూదాల కుమార్, దుద్దుకూరు శ్రీనివాసులు డిమాండ్ చేసారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పామూరు మండల వీఆర్వోల సంఘం నూతన కమిటీని బుధవారం ఎన్నుకొన్నారు. మండల వీఆర్వో సంఘం అధ్యక్షుడిగా బూదాల కుమార్, ప్రధాన కార్యదర్శిగా డీ శ్రీనివాసులు, కోశాధికారిగా జే సరస్వతి, సహాయకార్యదర్శిగా షేక్ మహ్మద్ రఫీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటి సభ్యులను సహచర వీఆర్వోలు అభినందించారు.

ఘనంగా విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విభిన్న ప్రతిభావంతులు

కురిచేడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని కురిచేడులోని భవిత కేంద్రంలో బుధవారం జరిగింది. ముందుగా విభిన్న ప్రతిభావంతులతో కలిసి ఎంఈవో సుబ్బారావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయి ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారి పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వారిని చిన్నచూపు చూడవద్దని హితవు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస రెడ్డి, ఐసీఆర్‌టీ సురేష్, గురువర్థన్, సారా సులోచన, వెంకటరావులు పాల్గొన్నారు.

బంగ్లాలో హిందూ దేవాలయాలపై దాడులు ఆపాలి



ర్యాలీ నిర్వహిస్తున్న హిందువులు

కురిచేడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : బంగ్లాదేశ్‌లో హిందువులు, హిందూ దేవాలయపై దాడులను ఖండిస్తూ కురిచేడులో ర్యాలీ నిర్వహించారు. ఇస్కాన్ స్వామీజిని అరెస్టు చేయడం దారుణమని, అతని తరఫున వాదించే లాయర్‌పై కూడా దాడి చేయడం అమానుషమని నినదించారు. హిందువులంతా ఐక్యం కావాలని ఇటువంటి దాడులు ఆపాలని కోరారు. ఈ ర్యాలీలో కురిచేడుకు చెందిన అయ్యప్పశెట్టి, సుబ్బారెడ్డి, రావైరి క్రిష్ణారావు, పిచ్చయ్య, వీరాచారి, శ్రీనివాస్, రావూరి కిశోర్, కొప్పురావూరి కిశోర్‌లు పాల్గొన్నారు.

తారురోడ్డు నిర్మాణానికి భూమి పూజ



రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న పువ్వాడి

పామూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని వీరభద్రాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి గ్రామంలోని ఆర్అండ్‌బీ రహదారి వరకు అంతర్గత రోడ్డును తారురోడ్డుగా మార్చేందుకు ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి రూ.45 లక్షలు మంజూరు చేసినట్లు గ్రామ టీడీపీ నాయకులు పువ్వాడి రామారావు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో కలిసి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టాలని కాంట్రాక్టర్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ గొడుగులూరి కిరణ్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు పునాటి వెంకటేశ్వర్లు, మన్నె చంద్రశేఖర్, పీ శ్రీను, వెంకటలక్ష్మయ్య, పవన్ పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

ముండ్లమూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వై నాగరాజు హెచ్చరించారు. ఆయన బుధవారం మండలంలోని శంకరాపురం గ్రామంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నాగరాజు మాట్లాడుతూ గ్రామస్థులందరూ ఐకమత్యంగా ముందుకు సాగాలన్నారు. చిన్న చిన్న విషయాలకు పంతాలకు వెళ్లి గొడవలకు పాల్పడవద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ఎన్ వెంకటేశ్వరరెడ్డి, సిబ్బంది మహేష్, ప్రేమానిధి పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల మోసాలకు గురికావద్దు

ప్రజలు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మోసపోవద్దని ఎస్ఐ నాగరాజు చెప్పారు. ఆయన బుధవారం మండలంలోని వేంపాడులో సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు.

ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలి

ముండ్లమూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని ఏపీవో కే నాగరాజు చెప్పారు. స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమావేశం బుధవారం జరిగింది.



బకాయిల భారం



- మున్సిపాలిటీల్లో పేరుకుపోతోన్న పన్నులు
- మొండిబాకీల్లో ప్రభుత్వ కార్యాలయాల వాటానే అధికం
- నోటీసులు జారీ చేస్తున్నా పట్టించుకోని శాఖాధికారులు
- మార్చికి వసూలు చేయాలని ఆదేశాలు.. లక్ష్యం నెరవేరేనా?

ఆంధ్రజ్యోతి ఫోకస్

(ఆంధ్రజ్యోతి - న్యూస్‌నెట్‌వర్క్)

సామాన్యుడు పన్ను చెల్లించకపోతే మున్సిపల్ అధికారులు నానాయాగీ చేస్తారు. నగదు సర్దుబాటు కాక ఆలస్యంగా చెల్లిస్తే జరిమానాలు వేస్తారు. అలాంటిది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, వారి ఆస్తులకు సంబంధించిన పన్నులు రూ.లక్షలో పేరుకుపోతున్నా పట్టడంలేదు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపాలిటీల పరిధిలో పదుల సంఖ్యలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, ఆయా శాఖలకు సంబంధించిన ఆస్తులు ఉన్నాయి. అయితే కొన్ని శాఖల నుంచి రెండు దశాబ్దాలుగా పన్ను బకాయిలు పేరుకుపోయాయి. అసలు తాము మున్సిపాలిటీ పరిధిలో ఉన్నాము.. మున్సిపాలిటీ నుంచి సౌకర్యాలు పొందుతున్నాము.. అందుకు పన్నులు చెల్లించాలి.. అన్న విషయమే ఆయా శాఖలు మరిచాయి. ఈ కారణంగా ఆయా శాఖల కార్యాలయాలకు సంబంధించి రూ.లక్షల్లో పన్ను బకాయిలు పేరుకుపోయాయి. మార్చి కల్లా బకాయిలు వసూలు చేయాలని లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. అయితే బకాయిలు చెల్లించాలన్న స్పృహ ఆయా శాఖల అధికారుల్లో లేదు. వసూలు చేయాలన్న ఆలోచన మున్సిపల్ అధికారుల్లో కానరావడంలేదు. పురపాలక సంఘాలకు ప్రధాన ఆదాయ వనరు.. పన్నులు. ఇలాంటి పన్నులు పేరుకుపోతున్నా వసూళ్లపై అధికారులు దృష్టి సారించడంలేదని, అందువల్లే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల పన్ను బకాయిలు రూ.కోట్లకు చేరాయని తెలుస్తోంది. పన్నుల వసూళ్లలో కనీస ప్రయత్నం కూడా ఉండటంలేదని ఈ ఆర్థిక సంవత్సరంలో వసూలైన పన్నులను చూస్తే తెలుస్తోంది. కమిషనర్లు ఆయా శాఖల అధికారులకు పన్ను బకాయిలకు సంబంధించి ఎప్పటికప్పుడు నోటీసులు జారీ చేస్తున్నా.. వారు పట్టించుకోవడంలేదు. ఏటికేడు బకాయిలు పేరుకుపోతున్నా చెల్లింపులపై ఆయా శాఖల అధికారులు ఆలోచన చేయడం లేదు. ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి ఆస్తి పన్ను కొన్నేళ్లుగా కొండలా పేరుకుపోయాయి. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి రైల్వే, బీఎస్ఎన్ఎల్, పోస్టల్ తదితర శాఖల పన్నులు పెద్దఎత్తున పేరుకుపోయి ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి ఏపీ సీపీడీసీఎల్, పోలీస్, జ్యూడిషియల్, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, విద్యాశాఖలకు సంబంధించి పన్నులు వసూలు కావాల్సి ఉంది.



రూపాయి కూడా చెల్లించని ప్రభుత్వం

చీరాల: మున్సిపాల్టీకి పన్ను బకాయిలు పేరుకుపోతున్నాయి. బుధవారం నాటికి ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి రూ.2,77,38,369 చెల్లించాలి. వీటిలో తహసీల్దార్ కార్యాలయం నుంచి అత్యధికంగా రూ.78,95,432 పేరుకుపోయి ఉంది. పోలీస్‌స్టేషన్లు, క్వార్టర్లకు సంబంధించి రూ.57,41,208 బకాయి ఉండగా ఆదాయం పుష్కలంగా ఉండే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రూ.1,56,294, సబ్ ట్రెజరీ కార్యాలయం రూ.1,21,522, డ్రైనేజి కార్యాలయం, క్వార్టర్లు రూ.34,48,186, ఇరిగేషన్ కార్యాలయం నుంచి రూ.5,93,452 బకాయిలు పేరుకుపోయాయి. పట్టణ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు రూపాయి కూడా పన్నులు చెల్లించకపోవడంతో బకాయిల్లో పెద్దమొత్తంలో వీటివే ఉన్నాయి. ఇక సాధారణ అసెస్‌మెంట్లు 23,286 ఉండగా వాటి డిమాండ్ రూ.12,48,92,187 కాగా ఇప్పటి వరకు రూ.6,41,35,112 వసూలు చేశారు. రూ.6,07,57,074 వసూలు కావాల్సి ఉంది. కొన్ని మొండి బకాయిలు వసూలు కాకపోవడానికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పలువురు కౌన్సిలర్లే కారణమని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.



ఎస్‌ఎస్పీ కార్యాలయ బకాయి రూ.13 లక్షలు

అద్దంకి: అద్దంకి మున్సిపాలిటీ పరిధిలో 17 ప్రభుత్వ భవనాలకు సంబంధించి సుమారు రూ.71 లక్షల బకాయిలున్నాయి. వీటిలో ప్రధానంగా ఎస్ఎస్పీ కార్యాలయం నుంచి రూ.13.63 లక్షలు, ఎంపీడీవో కార్యాలయం నుంచి రూ.12.13 లక్షలు, బీసీ బాలికల వసతిగృహం నుంచి రూ.9.54 లక్షలు, పోలీస్ స్టేషన్ నుంచి రూ.7.32 లక్షలు, స్త్రీ శక్తి భవన్ నుంచి రూ.5.90 లక్షలు, ఆర్‌అండ్‌బీ బంగ్లా నుంచి రూ.4.75 లక్షలు, డీఈ కార్యాలయం నుంచి రూ.5.16 లక్షలు, తహసీల్దార్ కార్యాలయం నుంచి రూ.4.98 లక్షలు, ఇరిగేషన్ కార్యాలయం నుంచి రూ.3.08 లక్షలు, వ్యవసాయ శాఖ కార్యాలయం నుంచి రూ.1.32 లక్షలు బకాయిలున్నాయి.



పోలీసు బకాయే అత్యధికం

బాపట్ల: బాపట్ల పురపాలక సంఘ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాల పన్ను బకాయిలు పెద్దఎత్తున పేరుకుపోయాయి. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి సుమారు రూ.2 కోట్లు, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.13 లక్షలకు పైగా పన్ను బకాయిలున్నాయి. పోలీసు భవనాలకు సంబంధించి అత్యధికంగా రూ.53,62,201 బకాయిలున్నాయి. అటవీశాఖ రూ.64,986, పీడబ్ల్యూడీ రూ.11,03,941, గురుకుల పాఠశాల రూ.47,34,931, ఆర్‌అండ్‌బీ రూ.17,14,397, మత్స్యశాఖ రూ.11,36,803, మండలపరిషత్ 9,56,045, తాలూకా కార్యాలయం రూ.14,64,139, విద్యాశాఖ రూ.9,44,627, ఎస్సీ కార్పొరేషన్ రూ.24,89,011, ఆర్‌అండ్‌బీ అతిథిగృహం రూ.17,28,914, పంచాయతీరాజ్ కార్యాలయాలు రూ.18,18,502, మార్కెట్‌కమిటీ కార్యాలయాల నుంచి రూ.1,86,988 బకాయిలున్నాయి.

43 కార్యాలయాలు.. రూ.1.45 కోట్లు

పొన్నూరు: పొన్నూరులో 43 ప్రభుత్వ కార్యాలయాలు ఉండగా రూ.1,45,61,975 పన్ను బకాయిలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి. తహసీల్దార్ కార్యాలయం రూ.21,52,868, ఫిషరీష్ కార్యాలయం రూ.21,46,140, పంచాయతీ రాజ్ డీఈ కార్యాలయం రూ.16,33,162, ట్రాన్స్‌కో రూ.13,04,645 బకాయిలు ఉన్నాయి. నీటి పారుదలశాఖ, పోలీస్‌స్టేషన్లు, మండల ప్రజా పరిషత్ కార్యాలయం, పోలీస్ క్వార్టర్ల పన్ను బకాయిలు భారీగా పేరుకుపోయాయి. అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు పన్ను బకాయిలు చెల్లించాలని నోటీసులు జారీ చేసినట్లు మున్సిపల్ రెవెన్యూ అధికారి వెంకటేశ్వర రావు తెలిపారు.



బకాయిలు రూ.77.80 కోట్లు

గుంటూరు: గుంటూరులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు 984 ఉండగా ఇంతవరకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో 705 కార్యాలయాలు ఉండగా రూ.35.46 లక్ష బకాయి ఉంది. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి 279 కార్యాలయాలు ఉండగా బకాయి రూ.77.45 కోట్లు పెండింగ్‌లో ఉంది. ఆయా కార్యాలయాలకి సంబంధించిన బకాయి రూ.77.80 కోట్లు ఉన్నట్లు నగర పాలక సంస్థ అధికారులు తెలిపారు. రూ.కోట్లలో బకాయిలు పెండింగ్‌లో ఉన్నా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఈ విషయంపై నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారులను వివరణ కోరగా ఇప్పటికే నోటీసులు పంపించామని తెలిపారు.



రెండు దశాబ్దాలుగా చెల్లింపులు లేవు

చిలకలూరిపేట: చిలకలూరిపేట మునిసిపాలిటీకి ప్రభుత్వ కార్యాలయాల పన్ను బకాయిలు రూ.1.88 కోట్ల వరకు ఉన్నాయి. జిల్లా పరిషత్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ ఆస్తులకు సంబంధించి రెండు దశాబ్దాలుగా, పోలీస్ శాఖ నుంచి దశాబ్ద కాలంగా పన్నుల చెల్లింపులు లేవు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పదేళ్లుగా పన్ను చెల్లించలేదు. ఎస్సీ కార్పొరే షన్ దుకాణాలకు సంబంధించి 2005 నుంచి, పంచాయతీరాజ్ దుకాణా లు 2009 నుంచి పన్ను బకాయిలు ఉన్నాయి. తహసీల్దారు కార్యాలయం రూ.27.48 లక్షలు, ఎస్సీ కార్పొరేషన్ దుకాణాలకు సంబంధించి రూ.29.27 లక్షలు, పంచాయతీరాజ్ దుకాణాల నుంచి రూ.15.29 లక్షలు, శారదా జిల్లా పరిషత్ హైస్కూల్ రూ.12.47 లక్షలు, జడ్పీ బంగళా రూ.6.5 లక్షలు, హైస్కూల్ రూ.21.79 లక్షలు, ఎస్సీ బాలుర హాస్టల్ రూ. 5.92 లక్షలు, అర్బన్ పోలీస్‌స్టేషన్ నుంచి రూ.7.15 లక్షలు వసూలు కావాల్సి ఉంది.

- రాయితీ రుణాలను అటకెక్కించిన గత ప్రభుత్వం
- కూటమి పాలనలో జిల్లాల వారీగా నిధులు కేటాయింపు
- లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు



రుణాల విషయంలో బీసీ సంఘాల నాయకులకు కలెక్టరేట్‌లో నిర్వహించిన అవగాహన సదస్సు (ఫైల్)

బీసీ కార్పొరేషన్‌కు... రుణ కళ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

వెనకబడిన వర్గాల సాధికారత కోసం ఏర్పాటు చేసిన బీసీ కార్పొరేషన్‌ను కేవలం అలంకారప్రాయంగా మార్చి ఐదేళ్ల పాటు రాయితీ రుణాలు అనే మాటే లేకుండా గత ప్రభుత్వం పాలన సాగించింది. రాయితీ రుణాలు అందక ఆయా కులవృత్తుల వారితో పాటు నిరుద్యోగులు తీవ్ర నిరాశకు లోనయ్యారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఈ ఐదేళ్ల వ్యవధిలో దాదాపు లక్ష మంది బీసీలు ఈ రాయితీ ఫలాలకు దూరంగా ఉండిపోయారు. కూటమి ప్రభుత్వం బీసీల ఆర్థిక సాధికారతను అత్యంత ప్రాధాన్య అంశంగా తీసుకుని కార్పొరేషన్‌కు జవసత్వాలు కల్పించడంతో పాటు రాయితీకి సంబంధించి లబ్ధిదారుల సంఖ్యతో పాటు నిధుల మంజూరుపై కూడా స్పష్టత ఇవ్వడంతో ప్రభుత్వ నిర్ణయం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే జిల్లాల్లో బీసీ సంఘాలతో సమావేశాలు కూడా పెట్టిన అధికారులు లబ్ధిదారుల ఎంపికను ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జరపడానికి కసరత్తు చేస్తున్నారు

2014-19 మధ్య పెద్ద సంఖ్యలో లబ్ధి...

2014--19 మధ్య టీడీపీ పాలనలో వెనకబడిన వర్గాలకు వివిధ పథకాల ద్వారా పెద్ద ఎత్తున లబ్ధి చేకూరింది. వాటిలో (మిగతా 6వ పేజీలో..)

> **కార్పొరేషన్ క్రియాశీలకంగా...**
> ఈ మొత్తం రుణాల ప్రక్రియలో బీసీ వెల్ఫేర్ విభాగంతో పాటు కార్పొరేషన్‌కూడా పూర్తి స్థాయిలో భాగస్వామ్యం కానున్నాయి. ఏకపక్ష నిర్ణయాలు కాకుండా తొలి దశ కింద బీసీ కార్పొరేషన్ అధికారులు ఆయా బీసీ కుల సంఘాల ప్రతినిధులతో సమావేశమై రుణాల మంజూరులో తగిన సూచనలు, సలహాలు కోరుతున్నారు. లబ్ధిదారుల ఎంపికలో కూడా ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పూర్తి పారదర్శకంగా ప్రక్రియ జరగాలనే ఆదేశాలు ఇప్పటికే సంబంధిత అధికారులకు అందాయి.

తుఫాన్ నష్టం.. అన్నదాతకు కష్టం

- తేమకు సడలింపులు ఇచ్చినా.. రైతులకు ఇబ్బందులే
- బస్తాకు రూ.1350 మాత్రమే చెల్లిస్తూ దళారుల దోపిడీ
- నేడు జంపనిలో ధాన్యం సేకరణ కేంద్రాన్ని పరిశీలించనున్న ఇన్‌చార్జి మంత్రి



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఫెంగస్ తుఫాన్ ప్రభావం చివరి మూడు రోజుల్లో జిల్లాపై ప్రభావం చూపడంతో వరి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. దాదాపు రెండు లక్షల ఎకరాల్లో వరిపైరు కోతకు సిద్ధంగా ఉన్న దశలో కురిసిన వర్షాలు రైతులు దిక్కుతోచని స్థితిలో పడేశాయి. ఇదిలా ఉంటే వేల ఎకరాల్లో వరిపైరు నేలవాలడంతో ఎకరాకు దిగుబడి విషయంలో గణనీయంగా తేడా వచ్చే అవకాశాలు ఉంటాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ దాదాపు 18,000 ఎకరాల్లో వరి కోతలు పూర్తయి ధాన్యం చేతికొచ్చినా కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించినది 1900 టన్నులే కావడం గమనార్హం. దాదాపు 5,000 టన్నులు బహిరంగ మార్కెట్‌కు తరలిందనేది క్షేత్రస్థాయి పరిస్థితులు చెబుతున్నాయి. తుఫాన్ నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలలో ధాన్యం సేకరణ జరుగుతున్న తీరును పరిశీలించడానికి గురువారం ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి వేమూరు మండల పరిధిలోని జంపనికి రానున్నారు. జిల్లాకు చెందిన మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్ కూడా ఆయన వెంట ఉంటారనేది సమాచారం. మంత్రుల రాకతో క్షేత్రస్థాయిలో ధాన్యం అమ్మకాల విషయంలో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులకు పరిష్కారం దొరుకుతుందనే ఆశాభావాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. మిల్లులలో డ్రయ్యర్లు లేకపోవడం అన్నదాతలకు ఇబ్బందిగా మారింది. కేవలం 28 మిల్లుల్లోనే అందుబాటులో ఉండడం వాటిలో కూడా కొన్ని పనిచేయకపోవడం తేమ శాతం విషయంలో ఇబ్బందులకు కారణమైంది. డ్రయ్యర్లు అన్ని మిల్లుల్లో అందుబాటులో ఉంటే గంటల వ్యవధిలోనే ధాన్యం ఆరబోతకు వీలుండేదని, కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో బిక్కుబిక్కుమంటూ వరుణుడు వైపు చూస్తూ ఆరబెట్టుకోవాల్సిన పరిస్థితి ఉందనేది రైతుల ఆవేదన. ధాన్యంసేకరణ ఎక్కువగా వేమూరు నియోజకవర్గ పరిధిలోనే ఉంటుంది. కానీ ఎక్కువ కెపాసిటీ కలిగిన మిల్లులు ఇక్కడ లేకపోవడం కూడా రైతులకు ఇబ్బందిగా మారింది. నిబంధనల విషయంలో సడలింపులు ఇచ్చామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో అన్నదాతలు దళారులనే ఆశ్రయించాల్సి వస్తోంది. ఇదే అదనుగా వారు 75 కేజీల బస్తాకు కేవలం రూ.1350 మాత్రమే చెల్లిస్తూ రైతులను నిలువునా వంచిస్తున్నారు. మిల్లర్లు తీసుకున్న బ్యాంక్ గ్యారెంటీలలో ఇప్పటికే చాలా వరకు పరిమితి దాటింది. దీంతో తమకు దగ్గరగా ఉండే మిల్లులో ధాన్యం ఇచ్చే వెసులుబాటు రైతులకు లేకుండా పోయింది.

మిర్చియార్డు ప్రక్షాళన?

- గాడిన పెట్టేందుకు రంగంలోకి ప్రభుత్వం
- నేడు మంత్రి అచ్చెన్నాయుడి అధ్యక్షతన కీలక సమావేశం
- హాజరు కానున్న మార్కెటింగ్ ఉన్నతాధికారులు, మిర్చియార్డు అధికారులు



గుంటూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు మిర్చియార్డు అంతర్జాతీయ ఖ్యాతి పొందింది. అదే సమయంలో అక్రమాలు, అవినీతికూపంలో కూరుకుపోయింది. గత వైసీపీ హయాం లో నాటి ప్రభుత్వ పెద్దలు మిర్చియార్డును భ్రష్టుపట్టించారు. పాలకవర్గం అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చేసింది. విచ్చలవిడిగా జీరో, కటింగ్, బిల్ టూ బిల్ వ్యా పారాలను అమలు చేయించారు. మరోవైపు కమీషన్ ఏజంట్, వేమెన్ లైసెన్సుల రెన్యువల్స్, పేరు మార్పులతో రూ.కోట్లు దోచేశారు. ఈ పరిస్థితుల్లో మిర్చియార్డు ప్రక్షాళనకు రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఇక్కడి పరిస్థితు లను చక్కదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించింది. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో రూ.వందల కోట్ల అవినీతి జరి గిందని విజిలెన్స్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన దృష్ట్యా యార్డుని గాడిన పెట్టేందుకు తానే రంగంలోకి దిగాలని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు నిర్ణయించారు. గురువారం చుట్టుగుంట సెంటర్‌కు సమీపంలోని మార్కెటింగ్ కమిషనరేట్‌కు రావాల్సిందిగా మిర్చియార్డు అధికారులను ఆదేశించారు. ఈ సమావే శానికి మార్కెటింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరి బుడితి రాజశేఖర్, డైరెక్టర్ విజయసునీత, జాయింట్ డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లు కూడా హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో సమావేశంలో ఏ అంశాలపై చర్చించి ఎలాంటి ఆదేశాలు జారీ చేస్తారోనన్న ఉత్కంఠ మార్కెటింగ్ వర్గాల్లో నెలకొన్నది. మిర్చియార్డు మాజీ ఛైర్మన్ మన్నవ సుబ్బారావు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ విజిలెన్స్ డీజీకి చేసిన ఫిర్యాదు ఆధారంగా నిర్వహించిన విచారణలో రూ.346కోట్ల అవినీతి జరిగినట్లు ఆ శాఖ తేల్చింది. దీనిపై మంత్రి నిర్వహించే సమావేశంలో చర్చించి చర్యలకు ఆదేశాలు జారీ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

మిర్చి అమ్మి పెట్టేది.. కొనుగోలు చేసేదీ వారే

మిర్చియార్డులో కొంతమంది వ్యాపారులకు బహుళ లైసెన్సులు ఉన్నాయి. కమీషన్, ఎక్స్‌పోర్టు లైసెన్సులు కలిగిన కుటుంబాలు దాదాపుగా 50కి పైగానే ఉన్నట్లు సమాచారం. అయితే ఒకే పేరుతో ఇవి లేకపోవడంతో వాటికి చట్టబద్ధత సమకూరింది. దీంతో రైతు మిర్చియార్డుకు తీసుకొచ్చిన సరుకుకు సరైన ధర లభించే పరిస్థితి లేకుండా పోయింది. ఇందుకు కారణం ధర ఆఫర్ చేసే ఎక్స్‌పోర్టర్, అమ్మే కమీషన్ వ్యాపారి రక్తసంబంధీకులు అవుతుండటమే. ఇక కొంతమంది వ్యాపారులకు కోల్డ్‌స్టోరేజ్‌లు ఉండటంతో వాటిని నింపుకోవడానికి మార్కెట్‌లో ధర పెరగకుండా చూస్తారు. దాంతో రైతు చేసేది లేక కోల్డ్‌స్టోరేజ్‌లో నిల్వ చేసుకునేందుకు మొగ్గు చూపుతాడు. ఈ విధంగా అన్ని వైపుల నుంచి యార్డులో రైతును పిండుకుంటున్నారు. వేలానికి నిర్వచనం పోటీ. అయితే మిర్చియార్డులో ఇందుకు విరుద్ధమైన అర్థం ఉన్నది. వేలం అంటే రైతు ఇష్టాఇష్టాలతో సంబంధం లేకుండా వ్యాపారులే నిర్ణయిస్తారు. ఇందుకు అనుకూలమైన పరిస్థితులను వ్యాపారులే సమకూర్చుకున్నారు. బడా ఫరంలు ఎంత ధరని నిర్ణయిస్తే దానినే ఇతర వ్యాపారులు కూడా అనుసరిస్తూ ఉంటారు. ఇలా యార్డులో రైతు తెచ్చిన మిర్చిని అమ్మి పెట్టేది ఒకరే, కొనుగోలు చేసేది ఒకరే కావడంతో పోటీ లేకుండా పోతున్నది. కేంద్ర ప్రభుత్వం ఈ-నామ్ విధానాన్ని తీసుకొచ్చినా బిడ్డింగ్‌లోనూ పోటీ కనిపించదు. ఒక ఎగుమతి వ్యాపారే బిడ్డింగ్‌లో పాల్గొంటారు. దాంతో అతడే సక్సెసర్ అవుతారు. ఒకవేళ రెండు బిడ్‌లు దాఖలైనా ఆ రెండు కూడా ఆ ఎక్స్‌పోర్టర్‌కు చెందినవే అవుతున్నాయి.

గుట్కా వ్యాపారికి అందలం

గత ప్రభుత్వంలో ఓ గుట్కా వ్యాపారిని వైసీపీ పెద్దలు తీసుకొచ్చి మిర్చియార్డు పీఠంపై కూర్చోబెట్టారు. అనతికాలంలోనే కోకొల్లలుగా అక్రమాలకు పాల్పడి రూ.కోట్లు పోగేసుకొన్నాడు. చంద్రగిరి ఏసురత్నం ఛైర్మన్‌గా వ్యవహరించిన సమయంలో రెన్యువల్‌కు రావాల్సిన లైసెన్సులను కొందరు కోర్టులో వేసి స్టే తెచ్చుకుని రాకుండా చేశారు. ఆయన రాజీనామా తర్వాత లైసెన్సుల వ్యవహారాన్ని వైసీపీ నేతలు తెరపైకి తెచ్చారు. అధికారులను ఏమార్చి ఒకేసారి ఏకంగా 270కి పైగా లైసెన్సుల రెన్యువల్ చేసేశారు. ఇందులో కనీసం రూ.5 కోట్లు పైగానే చేతులు మారాయన్న విషయం బహిరంగ రహస్యమే.



అమ్మానాన్నలకు ఆహ్వానం

- 7న ప్రభుత్వ బడుల్లో ప్రత్యేక సమావేశాలు
- తల్లిదండ్రులు, గురువులు ఒకే వేదికపైకి..
- పాఠశాల, విద్యార్థి ప్రగతిపై ప్రత్యేకచర్చ
- పాఠశాలల అభివృద్ధిపై దిశానిర్దేశం
- ఉమ్మడి జిల్లాలో ఏర్పాట్లు పూర్తి..
- బాపట్ల జిల్లాలో పాల్గొననున్న సీఎం చంద్రబాబునాయుడు

గుంటూరు(విద్య), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని సర్కారు పాఠశాలల్లో ఉపాధ్యాయుల్ని, తల్లిదండ్రుల్ని ఒకే వేదికపైకి తీసుకువచ్చే మహత్తర కార్యక్రమానికి సర్వం సిద్ధం అయింది. సీఎం చంద్రబాబు నాయుడు బాపట్ల జిల్లాలో జరిగే వేడుకల్లో పాల్గొని సమావేశాలను లాంచనంగా ప్రారంభించనున్నారు. ఇక గ్రామస్థాయి నుంచి అన్ని పాఠశాలల్లో 7వ తేదీన విద్యార్థుల తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని ఒకే వేదికపైకి చేర్చి విద్యాపరమైన అంశాలు చర్చించి ప్రభుత్వ పాఠశాలల్ని మరింత బలోపేతం చేసే మహత్తర కార్యక్రమానికి విద్యాశాఖ ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే పాఠశాల స్థాయిలో విద్యార్థినీ విద్యార్థుల ప్రగతి నివేదికలు, వైద్య నివేదికలు సిద్ధం చేశారు. కార్యక్రమ నిర్వహణ కోసం విద్యాశాఖ విద్యార్థుల సంఖ్యను ఆధారంగా నిధులు మంజూరు చేసింది.

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, యూపీ, మండల పరిషత్ పాఠశాలలు దాదాపు 3,872 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో ఒకటి నుంచి పదవ తరగతి వరకు 6.97 లక్షల మంది విద్యార్థిని విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈనేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఇద్దరు సమావేశాల్లో పాల్గొనేలా ఇప్పటికే ప్రత్యేక ఆహ్వానాలు పాఠశాల స్థాయి నుంచి హెచ్ఎంలు పంపారు.

పాఠశాల సమగ్ర అభివృద్ధికి దిశానిర్దేశం

ప్రభుత్వ పాఠశాలల సమగ్రాభివృద్ధికి ఈ సమావేశాలు దిశానిర్దేశం చేయనున్నాయి. ఏటా పాఠశాల స్థాయిలో జరిగే తల్లిదండ్రుల సమావేశాలకు భిన్నంగా ఈ సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం మార్గదర్శకాలు (మిగతా 6వ పేజీలో..)



అమర గాయకుడు ఘంటసాల



ఘంటసాల విగ్రహానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

అద్దంకిటౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అమర గాయకుడు ఘంటసాల అని, సినీ గీతాలే కాకుండా ఆయన వ్యాఖ్యానంతో పాడి ఆలపించిన భగవద్గీత తెలుగువారి ప్రతి ఇంటా ఉంటోందని విశ్రాంత ఆర్‌జేడీ డాక్టర్ యూ దేవ పాలన అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో బుధవారం పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి సందర్భంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న ఘంటసాల విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు ఘంటసాల గురించి పలు విషయాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో జ్యోతి చంద్రమౌళి, ఎస్‌సీ, ఎస్‌టీ, బీసీ, మైనారిటీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళి సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, నందిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ హత్య కేసు కొట్టివేత

సంతమాగులూరు, డిసెంబరు 4 : సంతమాగులూరు గ్రామ మాజీ సర్పంచ్ గడ్డం వెంకటరెడ్డిని 10-4-2016వ తేదీన ఆయన ఇంటివద్ద వేట కొడవళ్లతో దారుణంగా హత్య చేశారు. ఈ కేసుకు సంబంధించి అప్పటి నుంచి కోర్టులో వాదనలు జరుగుతున్నాయి. ఈ కేసులో సంతమాగులూరు గ్రామానికి చెందిన అట్లా చినవెంకటరెడ్డితో పాటుగా మరో 6గురిపై అప్పట్లో కేసు నమోదు చేశారు. వారిలో ఒకరు మృతి చెందగా, మిగిలిన 6మంది విచారణకు హాజరవుతూ వస్తున్నారు. బుధ వారం ఒంగోలు కోర్టులో 7వ అదనపు అడిషినల్ జడ్జి టి.రాజావెంకటాద్రి ఈ కేసుకు సంబంధించి విచారణలో ఎటువంటి నిర్ధారణ కాక పోవడంతో ఈ కేసును కొట్టివేసినట్లు తెలిపారు.

సంతమాగులూరులో పికెట్

గడ్డం వెంకట రెడ్డి హత్య కేసును బుధవారం ఒంగోలు కోర్టులో కొట్టివేసిన నేపథ్యంలో సంతమాగులూరు గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

నివాసాల మధ్య మద్యం దుకాణం వద్దు

పోలీసులకు గ్రామస్థుల ఫిర్యాదు

చీరాలటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు నివసించే స్థావరాలు, నిత్యం విద్యార్థులు రాకపోకలు చేసే మార్గంలో మద్యం దుకాణాన్ని మరో ప్రాంతానికి తరలించాలని పలువురు ఈపూరుపాలెం గ్రామస్థులు అన్నారు. ఈపూరుపాలెంలో ఇటీవల అనుమతి పొందిన లక్కీ వైన్స్‌పై కొందరు గ్రామస్థులు వ్యతిరేకత తెలిపారు. ఈక్రమంలోనే గతంలో ఎస్పీ తుషార్‌డూడీకి ఫిర్యాదు చేశారు. బుధవారం ఈపూరుపాలెం ఎస్సై చంద్రశేఖర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మద్యం దుకాణం వలన అక్కడ నివసించే ప్రజలు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. వందల సంఖ్యలో అటుగా విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నట్లు వారు ఎస్సైకు వినతిపత్రం అందజేశారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించనున్నట్లు ఎస్సై వారికి హామీ ఇచ్చారు.

స్త్రీ నిధి రుణాలను సకాలంలో చెల్లించాలి

పంగులూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్త్రీ నిధి రుణాలు తీసుకున్న వారు సకాలంలో తిరిగి చెల్లించాలని లేకుంటే చర్యలు తప్పవని స్త్రీ నిధి మేనేజర్ టెక్కెం శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వెలుగు కార్యాలయంలో బుధవారం వీవోఏల సమీక్షా సమావేశం జరిగింది. స్త్రీ నిధి రుణాలు సభ్యులకు అధిక మొత్తంలో ఇచ్చి వారి అభివృద్ధికి దోహదపడాలని శ్రీనివాసరావు కోరారు. సమావేశంలో డీఎంజీ భాస్కరరావు, సీసీలు సాల్మన్, సురేష్, చంద్ర, భాస్కరమ్మ, వీవోఏలు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన ఉండాలి

అద్దంకిటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీపై విద్యార్థులకు అవగాహన ఉండాలని ప్రిన్సిపాల్ డాక్టర్ వీ మోహనరావు అన్నారు. బుధవారం కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్‌ఎస్‌ఎస్ విభాగాల ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వ హించారు. ప్రధాన రహదారి వరకు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో రెడ్ రిబ్బన్ క్లబ్ కన్వీనర్ బి. అశోక్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సేవలు ప్రశంసనీయం

చినగంజాం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు అందిస్తున్న సహాయ సహకారాలు ప్రశంసనీయయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.దేవదత్తం అన్నారు. మండలంలోని పెదగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని క్రీడా మైదానంలోని పిచ్చి మొక్కలు, పొదలను పాఠశాల పూర్వ విద్యార్థులు, రామదండు సేవాదళ్ సభ్యులు బుధవారం శుభ్రం చేశారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రం చేసినట్లు హెచ్‌ఎం తెలిపారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఆసోది సుదర్శన్‌రెడ్డి, పీ.డి. ఎం.అనిల్‌కుమార్, పాఠశాల పూర్వ విద్యార్థులు, రామదండు సేవాదళ్ సభ్యులు పాఠశాల పరిసరాల శుభ్రతలో పాల్గొన్నారు.

గోకులం షెడ్లను త్వరగా నిర్మించాలి

పర్చూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పర్చూరు, చీరాల నియోజకవర్గ పరిధిలో మంజూరైన గోకలం షెడ్ల నిర్మాణాలను త్వరిత గతిన పూర్తిచేయాలని బాపట్ల జిల్లా సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి పి.శాంతారావు అన్నారు. బుధవారం జాతీయ ఉపాధిహామీ పథకం కార్యాలయంలో చీరాల, వేటపాలెం, పర్చూరు, కారంచేడు, ఇంకొల్లు మండాల ఉపాధి హామీ సిబ్బందితో గోకుల నిర్మాణాల పురోగతి తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పశుపోషకులకు సౌలభ్యం కల్పించే విధంగా తక్కువ ఖర్చుతో నాణ్యమైన షెడ్లను నిర్మించి లబ్ధిదారులకు అందజేయాలన్నారు. నిర్మాణ కొలతలు తదితర ఆంశాల గురించి తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో పర్చూరు ఏపీవో బుల్లియ్య, ఆయా మండలాల ఉపాధి హామీ పథకం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దిగజారిన ధాన్యం ధరలు

- ఏర్పాటుకు నోచుకోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు
- తక్కువ ధరకు కొంటున్న వ్యాపారులు
- తీవ్రంగా నష్టపోతున్న అన్నదాతలు

దర్శి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ధాన్యం రైతులను ప్రైవేట్ వ్యాపారులు దగా చేస్తున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని తక్కువ ధరలకు కొనుగోలు చేస్తూ దోచుకుంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు వారు చెప్పిన ధరకే విక్రయిస్తున్నారు. అధికారులు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు గురించి పట్టించుకోవటం లేదని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవటంతో నిల్వ ఉంచితే మరింత నష్టపోవాల్సి వస్తుందనే భయంతో వ్యాపారులు అడిగిన మేరకు తక్కువ ధరకు విక్రయిస్తున్నారు.

మద్దతు ధర అమలు కావడం లేదు..

ప్రస్తుతం ప్రైవేట్ వ్యాపారులు 75 కేజీల బస్తాను రూ.1400 కొనుగోలు చేస్తున్నారు. కొంతమంది తరుగు కింద మరో మూడు కేజీలు అదనంగా తీసుకుంటున్నారు. ప్రభుత్వం గ్రేడ్-1 రకానికి 75 కేజీల బస్తాకు రూ.1740, సాధారణ రకానికి రూ.1725 మద్దతు ధర నిర్ణయించింది. కేంద్రాలు ఆరంభమైతే ఆ మేరకు రైతులకు గిట్టుబాటు ధర లభించేది ఇప్పటి వరకు ఎక్కడా కేంద్రాలు ఆరంభం కాకపోవటంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులపై ఆధారపడాల్సి వస్తుంది. తుపాన్ ప్రభావంగా నాలుగు రోజులుగా తరచూ చిరుజల్లులు పడుతుండటంతో రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. భారీ వర్షం కురిస్తే కళ్లాల్లో ఉన్న ధాన్యం తడిసిపోతుందని ఆందోళన చెందుతున్నారు. సన్న, చిన్న కారు రైతులు ధాన్యాన్ని ఇళ్లల్లో నిల్వ చేసుకునే అవకాశం లేక కళ్లాలు చేసిన వెంటనే తక్కువ దరలకు విక్రయిస్తున్నారు. దీంతో రైతులు బస్తాకు రూ.300పైగా రాబడి కోల్పోతున్నారు. అధికారులు మార్కెటింగ్‌లో జరుగుతున్న దోపిడీని గుర్తించి కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పట్టిపీడిస్తున్న జ్వరాలు

- ఎక్కడచూసినా బాధితులే
- పది రోజుల్లో 16 వేల కేసులు
- ఎక్కువ మందికి గున్యా, మలేరియా
- అక్కడక్కడా డెంగ్యూ
- మంచం పట్టిన గ్రామాలు
- కిటకిటలాడుతున్న ఆసుపత్రులు

జిల్లాలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. గ్రామాలకు గ్రామాలు మంచం పడుతున్నాయి. ఎక్కువ మంది గున్యా లక్షణాలతో బాధపడుతున్నారు. తీవ్రత ఎక్కువగా ఉన్న వారు జిల్లా కేంద్రంలోని ప్రైవేటు వైద్యశాలల్లో చేరుతున్నారు. ఆర్థికస్థోమత లేని వారు ఇంటి వద్దనే ఉండి స్థానిక వైద్యుల వద్ద చికిత్స చేయించుకుంటున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులను మాత్రమే పరిగణనలోకి తీసుకొని డెంగ్యూ కేసులు నమోదు కావడం లేదని వైద్యారోగ్య శాఖ అధికారులు చెప్తున్నప్పటికీ ప్రైవేటు వైద్యశాలల్లో రోజుకు 50 నుంచి 70కిపైగా ఈ కేసులు బయటపడుతున్నట్లు తెలుస్తోంది. డెంగ్యూ పేరుతో ప్రైవేటు వైద్యశాలల నిర్వాహకులు రోగుల నుంచి రూ.వేలకు వేలు పిండుకుంటున్నారు. మలేరియా కేసులు తక్కువగానే ఉన్నా టైఫాయిడ్ కేసులు ఓ మోస్తరుగా నమోదువుతున్నాయి. అధిక వర్షాలు, పారిశుధ్య లోపమే వ్యాధుల వ్యాప్తికి ప్రధాన కారణమైంది.



రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వర బాధితులు

ఒంగోలు(కలెక్టరేట్)/మార్కాపురం/కొండపి, డిసెంబరు 4 : జిల్లావాసులను సీజనల్ వ్యాధులు పట్టిపీడిస్తున్నాయి. ముఖ్యంగా విష జ్వరాలు వణికిస్తున్నాయి. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా అన్నిచోట్లా జ్వరపీడితులు కన్పిస్తున్నారు. పది రోజుల నుంచి తీవ్ర అధికమైంది. వర్షాల కారణంగా దోమల ఉత్పత్తి పెరగడం, నీటి నిల్వలు చేరడం, పారిశుధ్యం అంతంతమాత్రంగా ఉండటమే వ్యాధుల వ్యాప్తికారణమైంది. దీంతో వైద్యశాలలు బాధితులతో కిటకిటలాడుతున్నాయి. ముందుగా సమీపంలో ఉండే ఆర్‌ఎంపీలు, పీఎంపీల వద్ద వైద్య సేవలు పొంది అక్కడ తగ్గకపోతే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్తున్నారు. అక్కడ కూడా నయంకాకపోవడంతో ప్రైవేటు వైద్యశాలల్లో చేరుతున్నారు. విషజ్వరాలు ప్రధానంగా మార్కాపురం, కనిగిరి డివిజన్‌తోపాటు ఒంగోలు డివిజన్‌లో జిల్లాకేంద్రమైన ఒంగోలు, చీమకుర్తి, కొండపి మండలాల్లో మరింత ఎక్కువగా ఉన్నాయి.

జిల్లాలో నమోదైన కేసులు
జనవరి నుంచి ఇప్పటివరకు
4.60లక్షల వైరల్ ఫీవర్‌లు,
322 డెంగ్యూ కేసులు నమోదు
గత పది రోజుల్లో 16వేల వైరల్ ఫీవర్ కేసులు
36 మలేరియా జ్వరం కేసులు
భారీగా గున్యా కేసులు నమోదు

పెరుగుతున్న బాధితులు

జిల్లావ్యాప్తంగా అధికారుల లెక్కల ప్రకారం పది రోజుల వ్యవధిలో 16వేల మందిపైగా విష జ్వరాల బారినపడటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో సాధారణ వైరల్ ఫీవర్‌తోపాటు డయోరియా గున్యా, చికెన్ ఫాక్స్, మలేరియా, డెంగ్యూ కేసులు కూడా నమోదవుతున్నాయి. విస్తారంగా కురుస్తున్న వర్షాలతో ప్రజానీకం వైరల్ ఫీవర్ బారిన పడుతున్నా పంచాయతీ పాలకవర్గాలు పారిశుధ్య నిర్వహణ గురించి పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అధికారులు కూడా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

ఫీవర్ సర్వే ఎక్కడ?

వైద్యారోగ్యశాఖ ద్వారా ఎప్పటికప్పుడు గ్రామాల్లో పరిస్థితుల అవగాహన కోసం ఫీవర్ సర్వే నిర్వహించాల్సి ఉంది. దీని ద్వారా కుటుంబంలో ఎవరికి జర్వాలు ఉన్నాయి, ఇంకేమైనా వ్యాధులు ఉన్నాయా.. అని తెలుసుకునే అవకాశం ఉంది. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండాపోయింది. దీంతో ఎంత మందికి వైరల్ ఫీవర్ ఉందో కూడా అధికారికంగా లెక్కలు తేలడం లేదు. కేవలం ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చిన కేసులను నమోదు చేసుకొని మమ అనిపిస్తున్నారు.

నమోదు కాని వారెందరో

ప్రైవేటు వైద్యశాలలో కొన్నిరకాల వ్యాధులను మాత్రమే నమోదు చేస్తుంటారు. మిగిలిన వాటిని నమోదు చేసే పరిస్థితి లేదు. ఇక ప్రతి గ్రామంలో ఆర్‌ఎంపీలు, పీఎంపీలు విస్తరించారు. వారి వద్ద కూడా ప్రతిరోజు వందలాది మంది జ్వరాలు, ఇతర వ్యాధులకు చికిత్స పొందుతున్నారు. అటువంటి వారి లెక్కలు నమోదు కావడం లేదు. ఇక జిల్లా వ్యాప్తంగా అనేక రకాలు వ్యాధుల బారిన పడి మెరుగైన చికిత్స కోసం ఇతర జిల్లాలకు వెళ్లిన వారు కూడా కనిపిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా ఈ విధంగా ప్రజానీకం వ్యాధుల బారిన పడుతున్నా వైద్యారోగ్యశాఖ మాత్రం కనీసం గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహించి ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఇవ్వాల్సి ఉన్నా పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది.

కొండపి మండలంలోని పెదకండ్లగుంటలో చికున్ గున్యా విజృంభించింది. ఇప్పటికే 50మంది దీని బారిన పడ్డారు. అనేక మంది నడవలేని స్థితిలో మంచం పట్టారు. కీళ్లనొప్పులతో కదల్లేకపోతున్నారు. కొందరు కర్రల సాయంతో నడుస్తున్నారు. వయసు మీరిన వారు దోగాడాల్సి వస్తుందని పలువురు వివరించారు. వైద్యారోగ్యశాఖ అధికారులు స్పందించి గ్రామంలో శిబిరం ఏర్పాటు చేసి మందులు ఇవ్వాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మార్కాపురం ప్రాంతంలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. మార్కాపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు రోజుకు 350మంది రోగులు వస్తుండగా అందులో 100 మందికిపైగా జ్వరపీడితులు ఉంటున్నారు. ప్రైవేటు వైద్యశాలు, ఆర్‌ఎంపీల వద్దకు రోజుకు 500 మందికిపైగానే జ్వరాలతో బాధపడుతున్న వాళ్లు వచ్చి వైద్యం చేయించుకుంటున్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

- ప్రధానంగా భూసమస్యల పరిష్కారమే ప్రధాన అజెండా
- గ్రామాల్లో నిర్వహించేందుకు షెడ్యూల్ రూపకల్పన
- రెవెన్యూతోపాటు దేవదాయ, రిజిస్ట్రేషన్ శాఖ భాగస్వామ్యం
- ప్రజాప్రతినిధులకు కూడా ఆహ్వానం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూసమస్యల పరిష్కారంపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టాభూములతోపాటు అసైన్డ్, దేవదాయ, చుక్కల భూములను దోచేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున భూముల ఆక్రమణలు జరిగినట్లు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అలాగే వారం వారం జరిగే గ్రీవెన్స్‌సెల్‌తోపాటు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉన్నతాధికారులను కలిసి పలువురు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయా సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులోభాగంగా శుక్రవారం నుంచి వచ్చే ఏడాది జనవరి 8వతేదీ వరకు గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ఉత్తర్వులు జారీచేసింది. అందుకనుగుణంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా నేతృత్వంలో జిల్లాలోని 38 మండలాల్లో గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లుచేశారు. ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఆయా మండలాల్లో గ్రామాలవారీగా సదస్సులు నిర్వహించేందుకు షెడ్యూల్ కూడా రూపొందించారు. ఆ షెడ్యూల్ ప్రకారం గ్రామ సభలు నిర్వహించనున్నారు.

సమస్యలపై అర్జీల స్వీకరణ

ఈ గ్రామసభల్లో రెవెన్యూతోపాటు దేవదాయ, రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు కూడా ఈ సదస్సుల్లో పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. ప్రధానంగా గ్రామాల్లో ఫ్రీహోల్డ్ భూములతోపాటు 22(ఏ), ప్రభుత్వ భూముల ఆక్రమణలను గుర్తించడంతోపాటు భూములు ఉండి ఆన్‌లైన్ కానటువంటి సమస్యలతోపాటు పలు రకాల సమస్యలపై గ్రామ సభల్లో అర్జీలను స్వీకరించనున్నారు. స్వీకరించిన అర్జీలను కంప్యూటరీకరణ చేసి ఆయా సమస్యలను నిర్దిష్ట గడువులోపు పరిష్కరించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే జిల్లాలో లక్షలాది ఎకరాలు ప్రభుత్వ భూములు భూకబ్జాలు, అన్యాక్రాంతం కావడంతో అటువంటి భూములపై ప్రత్యేక దృష్టిసారించారు. ఆ భూములన్నింటిని గ్రామాల వారీగా గుర్తించేందుకు రెవెన్యూ యంత్రాంగం సిద్ధమైంది.

40వేల ఎకరాల దేవుడి భూములు అన్యాక్రాంతం

మరోవైపు జిల్లాలో దేవదాయ భూములు కూడా 40వేల ఎకరాలు అన్యాక్రాంతమైనట్లు ఇప్పటికే ఆ శాఖ గుర్తించింది. అటువంటి భూములను కూడా గుర్తించేందుకు చర్యలు చేపట్టారు. అలాగే ప్రజలకు సంబంధించి ఇతర రెవెన్యూ సమస్యలను కూడా ఆ సదస్సుల్లో అర్జీలు తీసుకొని కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కారం చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. కుటుంబ సమస్యల కారణంగా నెలకొన్న భూ సమస్యలపై కూడా దృష్టిసారించినట్లు సమాచారం. ఇప్పటికే కలెక్టర్ తమీమ అన్సారియా సదస్సులపై సబ్‌కలెక్టర్, ఆర్డీవోలు, మండల తహసీల్దార్లకు దిశానిర్దేశం చేసింది. ఈనెల 6వతేదీ నుంచి జరగనున్న రెవెన్యూ సదస్సులను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు గ్రామాల వారీగా షెడ్యూల్ రూపొందించాలని ఆదేశాలు జారీ చేయడంతో తదనుగుణంగా మండల స్థాయిలో తహసీల్దార్లు తేదీల వారీగా షెడ్యూల్‌ను కూడా రూపొందించారు.

ఏలూరి ఆదేశాలతో శరవేగంగా సీసీ రోడ్డు పనులు



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న టీడీపీ నేతలు

కారంచేడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాలలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో సక్రమంగా రోడ్లు, డ్రైనేజీలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం రాకతో ప్రజల ప్రయాణ కష్టాలు తీరుతున్నాయి. అంతర్గత రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా నిధులు మంజూరు కావడంతో పర్చూరు నియోజకవర్గంలో పనులు చకచకా సాగుతున్నాయి. కారంచేడులో సీసీ రోడ్డు నిర్మాణానికి స్థానిక టీడీపీ నాయకులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఈఏ కుమార్, జాగర్లమూడి ప్రహ్లాద్, చాగంటి లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ సభ్యులు శేషారత్నం, సర్పంచ్ శివపార్వతి, భూలక్ష్మి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుతో అధిక ఆదాయం



మాట్లాడుతున్న ఏడీఏ ధన్‌రాజ్

అద్దంకిటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఉద్యాన పంటల సాగుతో అధిక ఆదాయం పొందవచ్చని ఉద్యాన శాఖ అధికారి ఎస్.దీప్తి తెలిపారు. బుధవారం మండలంలోని నాగులపాడు, వేలమూరిపాడు గ్రామాలల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూరగాయలు సాగు చేసిన రైతులకు ఎకరాకు రూ.8వేలు, పూల సాగు చేసిన రైతులకు ఎకరాకు రూ.6200 ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. మీనీ ట్రాక్టర్, ట్రాక్టర్ మౌంటెడ్ స్ప్రేయర్, తైవాన్ స్ప్రేయర్‌లు రాయితీపై అందిస్తున్నట్లు తెలిపారు. వర్షాలకు రైతులు అప్రమత్తంగా ఉండాలని, భూములలో నీరు నిల్ల లేకుండా చూసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కొత్రపాటి వెంకట కృష్ణ తెలిపారు. ప్రతి రైతు ఈ పంట నమోదుచేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ అనూష, రైతులు పాల్గొన్నారు.

పోషక లోపాలు లేకుండా చూడాలి

మేదరమెట్ల : వర్షాలు అధికంగా కురుస్తున్నందున శనగ, పొగాకు, మినుము సాగులో పోషక లోపాలు లేకుండా చూసుకోవాలని ఏడీఏ ధన్‌రాజ్ తెలిపారు. బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రాసంగులపాడు, కనగాలవారిపాలెం గ్రామాలలో శనగ పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా వెంటనే బయటకు పెట్టాలని రైతులకు సూచించారు. నీరు నిల్వ ఉంటే శనగ పంట కుళిపోతుందన్నారు. పోటాష్ భాస్వరం ఎరువులు వేయడం వలన నాణ్యమైన దిగుబడులు వస్తాయన్నారు. సమగ్ర సస్యరక్షణ చర్యలలో భాగంగా జిగురు అట్టలను పొలంలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. తెగుళ్లు, పురుగులు కనిపించిన వెంటనే వ్యవసాయ అధికారిని సంప్రదించి అవసమైన మందులు వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరావు, రామిరెడ్డి, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంట బీమా చేయించాలి

చినగంజాం : రైతులు పంటల బీమానుచేయించాలని వ్యవసాయాధికారి కే.భాస్కరరావు అన్నారు. కడవకుదురు గ్రామంలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతు సేవా కేంద్రం వద్ద జరిగిన సభలో ఏవో మాట్లాడారు. పీఎం కిసాన్‌కి సంబంధించిన రైతులు ఎవరైనా ఈకేవైసీ చేయించుకోని వారు ఉంటే వెంటనే చేయించుకోవాలని సూచించారు. వేరుశనగ పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ చైతన్య రైతు సేవా కేంద్రం సిబ్బంది బి.కిషోర్, దీవెన, రైతులు పాల్గొన్నారు.

40 శాతం రాయితీతో గడ్డికత్తిరించే యంత్రం

యద్దనపూడి : పశుపోషకులకు 40 శాతం రాయితీతో గడ్డికత్తిరించు యంత్రం చాఫ్ కట్టర్‌ను అందిస్తున్నట్లు పశు వైద్యాధికారి పీ శారద అన్నారు. బుధవారం యద్దనపూడి మండలంలో పోలూరు, శ్యామలవారిపాలెం గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో ఎస్.మేరమ్మ, వ్యవసాయ సహాయకులు లీలాసత్య, పలువురు రైతులు పాల్గొన్నారు.

15లోగా ఫసల్ బీమా చెల్లించాలి

రైతులు ఈనెల 15వ తేదీలోగా రబీ పైర్లకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద ఇన్స్యూరెన్స్ చేయించాలని మార్టూరు మండల వ్యవసాయ అధికారి వీరగంధం కిరణ్ కుమార్ అన్నారు. బొల్లాపల్లి గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది చైతన్య తదితర రైతులు పాల్గొన్నారు.

అమ్మానాన్నలకు ఆహ్వానం

(5వ పేజీ తరువాయి)

జారీ చేసింది. పాఠశాలల్లో విద్యా కమిటీ ఎన్నికలు పూర్తి అయ్యాయి. ఈ నేపథ్యంలో కమిటీ సభ్యుల్ని, తల్లిదండుల్ని పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములుగా చేసి ఎప్పటికప్పుడు విద్యార్థుల ప్రతిగతి, పాఠశాల అభివృద్ధి పర్యవేక్షించేలా కార్యాచరణ సిద్ధం చేశారు.

- పాఠశాలలో అభివృద్ధికి అవసరమైన కోనుగోళ్ళ బడ్జెట్, సుందరీకరణ, పర్యావరణ పరిక్షణ, మరుగుదొడ్లు, విద్యార్థులు, ఉపాధ్యాయుల అంతర్గత సమస్యలు, మంచినీరు ఇతర అంశాలపై సమావేశంలో చర్చిస్తారు. .
- విద్యార్థుల ప్రగతి, వారి ఆరోగ్యానికి సంబంధించిన వైద్య నివేదికలు అంటే శారీరక, మానసిక, కంటి సంబంధ సమస్యలు, పౌష్టికాహార లోపం వంటివి ఇందులో నివేదిస్తారు. కొన్నిచోట్లు ప్రత్యేక మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.
- పాఠశాల పూర్తి అయిన తరువాత ఇంటి వద్ద విద్యార్థుల్ని ఎలా పర్యవేక్షించాలి? సెల్‌ఫోన్, టీవీలు, ట్యాబ్‌లు, ఇతర సామాజిక మాధ్యమాల వినయోగంపై నియంత్రణ ఎలా ఉండాలి? వంటి అంశాలుచర్చిస్తారు.
- ప్రత్యేక సమావేశాల సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు, తల్లిదండ్రులకు పోటీలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

పాఠశాలల్లో తల్లిదండ్రుల భాగస్వామ్యం పెంచడానికే : డీఈవో రేణుక

పాఠశాలల్లో జరిగే అభివృద్ధి పనుల్లో, విద్యార్థుల ప్రగతిలో తల్లిదండ్రుల్ని భాగస్వాములుగా చేయడానికే ఇటువంటి సమావేశాలు నిర్వహిస్తున్నామని, జిల్లాలో క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు పూర్తి అయ్యాయని డీఈవో సీవీ రేణుక వెల్లడించారు. ప్రత్యేక సమావేశాలకు సంబంధించి ఇప్పటికే షెడ్యూల్ ఉపాధ్యాయులకు, హెచ్‌ఎంలకు అందజేశామని వివరించారు. పండుగ వాతావరణంలో సమావేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు రేణుక బుధవారం "ఆంధ్రజ్యోతి"కి వివరించారు.

బీసీ కార్పొరేషన్‌కు... 'రుణ' కళ

(5వ పేజీ తరువాయి)

ముఖ్యంగా ఆదరణ పథకం, వెనకబడిన తరగతుల అభివృద్ధి కార్పొరేషన్ కింద రుణాలు, వాహనాలను రాయితీపై అందించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఐదేళ్ల పాలనలో దాదాపు 40,000 మందికి రూ.800 కోట్ల లబ్దిని బీసీలకు చేకూర్చిన ఘనత అప్పటి టీడీపీ ప్రభుత్వానిది. కానీ 2019లో వైసీపీ గద్దెనెక్కగానే ఈ పథకాలన్నింటికి గ్రహణం పట్టించడంతో పాటు బీసీ కార్పొరేషన్‌ను నిర్వీవం చేసేసింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాయితీ రుణాలకు నోచుకోని వెనకబడిన వర్గాల ప్రజలు అన్ని విధాలుగా నష్టపోయారు.

ప్రస్తుతం నిధుల కేటాయింపు...

కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే బీసీలకు ఏ విధంగా లబ్ది చేకూర్చాలనే అనే అంశంపై దృష్టి పెట్టింది. దానికి అనుగుణంగానే జిల్లాల వారీగా నిధులు కేటాయింపుతో పాటు లబ్దిదారుల సంఖ్యను కూడా ప్రకటించింది. గుంటూరు జిల్లాకు సంబంధించి ఏడాది వ్యవధిలో రూ.69 కోట్లను వెనకబడిన వర్గాల రుణాల కోసం రాయితీల రూపంలో అందించాలని కేటాయింపులు జరపడంతో పాటు 4,490 మందికి ఈ నిధుల ద్వారా లబ్ది చేకూర్చాలని సంకల్పించింది. అదే విధంగా బాపట్ల జిల్లాకు గాను రూ.47.60 కోట్లు కేటాయించిన పాలకులు 2,875 మందికి లబ్ది చేకూర్చేలా ప్రణాళికలు రచించారు. ఇక పల్నాడు జిల్లాకు వచ్చేసరికి 3,691 మంది లబ్దిదారులకు గాను రూ.58 కోట్లను ఖర్చు చేయనున్నారు. దీనికి సంబంధించిన ప్రక్రియ ఇప్పటికే మొదలు కాగా డిసెంబరు రెండో వారం నుంచి లబ్ధిదారుల ఎంపికను చేపట్టే దిశగా అడుగులు వేయనున్నారు

మహిళలు, చేతివృత్తులు

రాయితీ రుణాలలో అగ్ర తాంబూలం మహిళలతో పాటు చేతివృత్తుల వారికే కేటాయించే విధంగా మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఆయా యూనిట్ల ఏర్పాటుకు రుణాలు అందించడంతో పాటు నైపుణ్యంపై కూడా ప్రత్యేక శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇక మహిళల విషయానికి వచ్చేసరికి బ్యూటీషియన్ విభాగంతో పాటు మగ్గం, కంప్యూటర్ ఇతర నైపుణ్య కోర్సుల్లో శిక్షణ ఇచ్చి వారికి రాయితీ రుణాలు అందించి సొంతకాళ్ల మీద నిలబడేలా ప్రభుత్వం వారికి అండగా నిలవనుంది.

శిశు విక్రయం కేసు చీమకుర్తిలో నమోదు

నిందితులను విచారిస్తున్న పోలీసులు

ఒంగోలు క్రైం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శిశువును విక్రయించిన ఘటనకు సంబంధించి చీమకుర్తి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. చీమకుర్తి మండలం చంద్రపాడుకు చెందిన మహిళ తన చిన్నబిడ్డను తీసుకొని బస్సులో ప్రయాణం చేస్తుండగా పొదిలికి చెందిన గుర్నాధం అరుణ పరిచయమైంది. మాటలు కలిపింది. తనకు ఐదుగురు ఆడపిల్లలని చెప్పడంతో, వేరే వాళ్లకు పిల్లలు లేరు మీ పాపను ఇస్తావా.. అని అడగడంతో పాప తల్లి అంగీకరించింది. దీంతో గత నెల 30న అరుణ పాప తల్లికి ఫోన్ చేసి బిడ్డను తీసుకొని వేటపాలెం రమ్మని చెప్పింది. వారు వెళ్లగా అక్కడ అరుణ కర్లపాలెంకు చెందిన ఎస్‌కె షబానాను పరిచయం చేసింది. అక్కడ మరికొంత మంది కూడా ఉన్నారని పాప తల్లి ఫిర్యాదులో పేర్కొంది. రూ.లక్షకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అందుకు సంబంధించి షబానా పాప తల్లికి రూ.50వేలు ఇచ్చినట్లు తెలిపింది. పాపను ఇచ్చి అక్కడ నుంచి అందరూ వచ్చేశారు. అయితే తల్లికి బిడ్డ గుర్తురావడంతో చీమకుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం కేసు నమోదు చేసి పాపను కర్లపాలెం నుంచి తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. షబానా, మధ్యవర్తిగా ఉన్న అరుణలను చీమకుర్తి పోలీసులు విచారిస్తున్నారు.

శిశువు విక్రయం రిమ్స్‌లో జరగలేదు : సూపరింటెండెంట్ వివరణ

కాగా రిమ్స్‌లో ఎలాంటి శిశు విక్రయాలు జరగలేదని జీజీహెచ్ సూపరింటెండెంట్ టి.జమున తెలిపారు. ఫిర్యాది చీమకుర్తి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం పొదిలికి చెందిన మహిళ బస్సులో పరిచయం అయ్యిందని, బాధిత తల్లి పోలీసులు చెప్పారని వివరించారు. రిమ్స్‌లో శిశు విక్రయాలు జరగలేదని చెప్పారు.

20లోగా కవిత్వ పోటీలు నిర్వహించండి

ఇంకొల్లు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో జరగనున్న తెలుగు కవిత్వ పోటీలను ఈ నెల 20వ తేదీలోగా నిర్వహించాలని పరిషత్ జిల్లా సంచాలకులు పిడపర్తి పేరిరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. పోటీలలో ప్రథమ విజేత జిల్లా స్థాయి పోటీకి అర్హులన్నారు. జిల్లా స్థాయిలో మొదటి, ద్వితీయ, తృతీయ విజేతలకు రూ.1000, రూ.750, రూ.500 నగదు బహుమతిని అందజేస్తారన్నారు. పూర్తి వివరాలకు 9492274525కు సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మేదరమెట్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కొరిశపాడు సబ్ స్టేషన్ పరిధిలో నూతనంగా బ్రేకర్ ఏర్పాటు చేస్తున్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు మధ్యాహ్నం 3 గంటల నుండి 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

ప్రాంగణం..భయం..భయం

- చిట్టడవిలా మారిన ఆట స్థలం
- కస్తూర్బా గాంధీకి ఉదారంగా ఇచ్చిన దాతలు
- అభివృద్ధి చేయాలని మంత్రి గొట్టిపాటికి విజ్ఞప్తి చేసిన ఉపాధ్యాయులు
- వెంటనే బాగు చేయించాలని కోరుతున్న విద్యార్థినులు


విద్యాలయం ఆట స్థలంలో దట్టంగా ఉన్న ముళ్లపొదలు

బల్లికురవ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కస్తూర్బా బాలికలు ఆడుకునేందుకు దాతలు ఇచ్చిన స్థలం వృథాగా పడి ఉంది. రోజూ ఆటలు ఆడుకోవాల్సిన విద్యార్థినులు ముళ్ల పొదలు చూసి భయంతో తరగతులకే పరిమితమవుతున్నారు. లక్షలు విలువైన ఆట స్థలాన్ని ఉదారంగా ఇచ్చిన దాతలు చిట్టడవిలా ఉండడం చూసి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే ఆటలు ఆడుకునేందుకు వీలుగా ప్రాంగణాన్ని అభివృద్ధి పరచాలని కోరుతున్నారు.

బల్లికురవ మండలం గుంటుపల్లి గ్రామ పరిధిలో గత రెండు దశాబ్దాల కిందట బడి మానేసిన బాలికలకు మెరుగైన విద్యను అందించాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక కృషితో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. విద్యాలయానికి అవసరమైన ఐదు ఎకరాల స్థలాన్ని గుంటుపల్లి గ్రామస్థులు ఉచితంగా ఇచ్చారు. కొంత కాలం కిందట విద్యాలయంలో ఇంటర్ తరగతులను కూడా ప్రారంభించారు. బాలిక అవసరానికి దాతలు ఇచ్చిన స్థలంలో ప్రస్తుతం ముళ్ల పొదలు పెద్ద ఎత్తున అలుముకున్నాయి. దీంతో కాసేపు ఆటలు ఆడుకునేందుకు పిల్లలు భయపడుతున్నారు. తరగతి గదుల నుంచి ఒక్కరూ బయటకు రావడం లేదు. విద్యాలయం చుట్టూ పొలాలు ఉండడం, ఆటస్థలం అడవిలా మారడంతో పాములు, విషపురుగులు వస్తాయని విద్యార్థినులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో క్రీడా స్థలాన్ని కొంత అభివృద్ధి చేసినప్పటికీ తిరిగి ముళ్లచెట్లు బాగా పెరిగిపోవడంతో ఆటలు ఆడేందుకు వీలులేకుండా పోయిందని అంటున్నారు. కేజీబీవీ క్రీడా ప్రాంగణం దుస్థితిని ఇటీవల బల్లికురవ వచ్చిన మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

వెంటనే ప్రాంగణం అభివృద్ధికి చొరవచూపాలని కోరినట్లు చెప్పారు. దీనిపై మంత్రి స్పందిస్తూ ఉపాధి పథకం కింద ఆట స్థలాన్ని అభివృద్ధి చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇప్పటికైనా అధికారులు ప్రాంగణం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్థులు కోరుతున్నారు.


శేషమ్మను విచారిస్తున్న అధికారులు

కొడుకు నుంచి తల్లికి భూమి అప్పగింత

పంగులూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తన పోషణ చూడకుండా వారసత్వంగా సంక్రమించిన భూమిని దౌర్జన్యంగా సాగు చేసుకుంటున్న కుమారుడి నుంచి ఆ భూమిని తిరిగి తల్లికి అధికారులు అప్పగించారు. మండలంలోని కోటపాడు గ్రామానికి చెందిన బత్తుల శేషమ్మ భర్త రామకోటికి కొండమూరు రెవెన్యూలో సర్వే నెంబరు 2-1లో 0.31 సెంట్ల విస్తీర్ణం గల వ్యవసాయభూమి ఉంది. వీరికి తిరుపతయ్య, శ్రీను అనే ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు చనిపోగా చిన్నకుమారుడు శ్రీను తనకు చెందిన భూమిని దౌర్జన్యంగా సాగు చేసుకుంటూ తన పోషణ చూడటం లేదని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. ఆ ఫిర్యాదును అందుకున్న తహసీల్దార్ సింగారావు బుధవారం ఎంపీడీవో స్వరూపారాణి, ఎస్ఐ వినోద్‌బాబులతో కలసి కొండమూరులోని ఆ భూమిని పరిశీలించి తగు విచారణ జరిపారు. విచారణ అనంతరం శ్రీనుకు ఎంసీ నెం.47 నోటీసు ఇచ్చి, 0.31 సెంట్ల భూమిని శేషమ్మకి అప్పగించినట్లు తహసీలాదర్ సింగారావు తెలిపారు.

టీడీపీ కార్యకర్త మృతి

కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే కొండయ్య

వేటపాలెం, చీరాల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : టీడీపీ కార్యకర్త కొమ్ము వీరయ్య (54) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొండయ్య, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాతాని ఉమామహేశ్వరరావు ఆ కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారికి అండగా ఉంటామని చెప్పారు.

ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ జీవీ చౌదరి

బల్లికురవ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో రోడ్లపై వాహనాలను ఇష్టానుసారంగా నిలిపి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని బల్లికురవ ఎస్ఐ జీవీ చౌదరి హెచ్చరించారు. బుధవారం బల్లికురవ, వేమవరం నాలుగు రోడ్ల కూడలిలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తున్న పలు దుకాణాల వారికి ఎస్ఐ కౌన్సెలింగ్ నిర్వహించారు. దుకాణాల ముందు ఎవరైనా వాహనాలు ఉంచితే దుకాణదారులు చెప్పాలన్నారు. రోడ్లపై ఇష్టానుసారం నిలిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం మల్లాయపాలెం కూడలి వద్ద విజువల్ పోలీసింగ్‌లో భాగంగా వాహనాలను ఎస్ఐ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. లైసెన్స్‌లు లేనివారికి పెనాల్టీని విధించారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

వేటపాలెం,చీరాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో ప్రజల రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి గ్రామ రెవెన్యూ సదస్సులను శుక్రవారం నుంచి ప్రారంభమవుతాయని తహసీల్దార్ పార్వతి బుధవారం తెలిపారు. 6వ తేదీన వేటపాలెం, 10నదేశాయిపేట, 12న రామన్నపేట, 14న పుల్లరిపాలెం, 17న పందిళ్లపల్లి, 18న పందిళ్లపల్లి, 21న నాయినిపల్లి, చల్లారెడ్డిపాలెం పంచాయతీ, 27న కొత్తపాలెం, జనవరి 3వ తేదీన పాపాయిపాలెం, 8న కొత్తపేటలో గ్రామ సదుస్సులు ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతాయన్నారు. ఈ సదస్సులకు తహసీల్దార్, మండల సర్వేయర్, ఆయా గ్రామ వీఆర్వో, ఆర్ఐ, ఎండోమెంట్ ఈవో, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ ప్రతినిధి హాజరవుతారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు.

పర్చూరు : భూ సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పి.బ్రహ్మయ్య అన్నారు. బుధవారం గ్రామాలవారీగా ఆ యా పంచాయితీ కార్యాలయాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సుల వివరాలను వెల్లడించారు.

మేదరమెట్ల : కొరిశపాడు మండలంలోని అన్ని రెవిన్యూ గ్రామాలల్లో రెవిన్యూ సమస్యలు పరిష్కారం కోసం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి తెలిపారు. 6న బొడ్డువానిపాలెం, 10న తిమ్మనపాలెం, 13న తమ్మవరం, 17 మేదరమెట్ల, 21న రావినూతల, 23 పమిడిపాడు, 27 దైవాలరావూరు, 31 అనమనమూరు, జనవరి 2 కొరిశపాడు, 4న పి.గుడిపాడు, 7న మేదరమెట్ల, 8 ప్రాసంగులపాడు, రాచపూడి గ్రామాలల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు సుబ్బారెడ్డి తెలిపారు. సమస్యలు ఉన్న రైతులు గ్రామ సభలలో పాల్గొనాలన్నారు.

ఇంకొల్లు : రైతుల భూసమస్యలను పరిష్కరిచేందుకు శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎస్.వెంకటరత్నం తెలిపారు.

మార్టూరు : భూ సమస్యల పరిష్కారానికి ఈ నెల 6 శుక్రవారం నుంచి గ్రామాలలో రెవెన్యూ సదస్సులు ప్రారంభిస్తున్నట్లు తహసీల్దార్ టి ప్రశాంతి బుధవారం ప్రకటనలో తెలిపారు.

యద్దనపూడి మండలంలో ఈనెల 6న అనంతవరం 10న యనమదల 11న పోలూరు 13న పూనూరు 17 న జాగర్లమూడి 19న వింజనంపాడు 20 న గన్నవరం 21న యద్దనపూడిలో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు.

సారా విక్రయదారుడి అరెస్ట్

చీరాలటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సారా విక్రయిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెంలో దాడులు నిర్వహించి కనక రమేష్‌ను అరెస్ట్ చేశారు. అతని వద్ద మూడు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచనున్నట్లు నాగేశ్వరరావు తెలిపారు.

11 మంది జూదరుల అరెస్ట్

రూ.7,250 నగదు స్వాధీనం

వేటపాలెం, చీరాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దేశాయిపేట శివారులో జరుగుతున్న పేకాట స్థావరంపై బుధవారం ఎస్సై వెంకటేశ్వర్లు, సిబ్బందితో కలసి దాడి చేశారు. పేకాట ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకుని రూ.7,250 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

జాతీయ సర్వే పరీక్షకు 350 మంది హాజరు

అద్దంకిటౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యార్థుల సామర్థ్య సాధనను అర్థం చేసుకోవడానికి బుధవారం మండలంలోని 14 పాఠశాలలో 3, 6 , 9 తరగతుల విద్యార్థులకు పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షన్ పేరుతో జాతీయ సర్వే కోసం పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో మొత్తం 360 మంది విద్యార్థులకు గాను 350 మంది హాజరైనట్లు ఎంఈవో గంగాధరరావు తెలిపారు ఈ పరీక్షలను ఫీల్డ్ పరిశీలకులు తనిఖీ చేశారు. పలు కేంద్రాలను ఎంఈవో 2 సుధాకరరావు పరిశీలించారు.


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో గంగాధరరావు


క్రీడాకారులకు ఆర్థిక సాయం అందజేస్తున్న టీడీపీ నేతలు

క్రీడాకారులకు రూ.20వేల ప్రోత్సాహం

- సమకూర్చిన టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్

చీరాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయిలో 39వ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైన వై.యశ్వంత్‌రాజ్, పి. మహాలక్ష్మికి బుధవారం టీడీపీ నాయకులు ప్రోత్సాహకాన్ని అందజేశారు. నియోజవకర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్ సమకూర్చిన రూ.20వేల ప్రోత్సాహకాన్ని టీడీపీ కార్యాలయంలో వారు క్రీడాకారులకు అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నేత కౌతవరపు జనార్దనరావు మాట్లాడుతూ 39వ నేషనల్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌కు ఎంపికైన విజయ్‌నగర్ కాలనీకి చెందిన యశ్వంత్‌రాజు(లాంగ్‌జంప్), వైకుంఠపురానికి చెందిన మహాలక్ష్మి (400 మీటర్ల పరుగు), కోచ్ ధనుంజయ్ శ్రీనివాస్‌కు ఆ మొత్తం అందజేసినట్లు తెలిపారు. వారు పోటీలలో రాణించి చీరాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.12,600 ప్రోత్సాహక నగదు బహుమతిని క్రీడాకారులకు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పోలుదాసు రామకృష్ణ, చారుగుళ్ల గురుప్రసాద్, సుధాకరరావు, వలివేటి మురళీకృష పాల్గొన్నారు.

గృహాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో కుసుమకుమారి

బల్లికురవ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో పెండింగ్‌లో ఉన్న గృహాలను ఈనెల 20వ తేదీలోపు పూర్తి చేయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కె.కుసుమకుమారి కోరారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో గృహ నిర్మాణాల గ్రౌండింగ్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఇప్పటి వరకు బల్లికురవ మండలంలో 123 గృహాలు పనులు పూర్తి కావాల్సి ఉందని, 20వ తేదీలోపు 70 ఇళ్ల పూర్తి చేయాలని టార్గెట్ ఉందన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బంది వెంటనే లబ్ధిదారులను కలిసి అవగాహన కల్పించాలన్నారు. ఎవరైనా కొత్తగా గృహాలు కావాలంటే వారి వద్ద దరఖాస్తులు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ ఏఈ రమణనాయక్, మండల ఈవోపీఆర్డీ సుమతి పాల్గొన్నారు.

శనగ సాగులో విత్తన శుద్ధిని పాటించాలి

పంగులూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రైతులు పంట సాగులో విత్తన శుద్ధిని పాటించడం ద్వారా భూమిలో ఉన్న వ్యాధి కారక సిలింద్రాలను నశింపచేయవచ్చని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని ఆరికట్లవారిపాలెం, ముప్పవరం గ్రామాలలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. శనగ, పొగాకు పంటలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మాగులూరి వీరాంజనేయులు, మార్కెటింగ్, వ్యవసాయ శాఖ సిబ్బంది బాలకృష్ణ, అలెగ్జాండర్, దిల్షా, పలువురు రైతులు పాల్గొన్నారు.

కూలీల ఆటోని ఢీకొట్టిన లారీ

ఏడుగురికి తీవ్రగాయాలు


చీరాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

చినగంజాం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆటోను గుర్తు తెలియని లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు మహిళా కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని పూలవారిపాలెం గ్రామ సమీపంలోని 216వ జాతీయ రహదారిపై బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం చినగంజాం గ్రామానికి చెందిన షేక్ పర్వీన్, షేక్ మస్తానీ కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని మూలగానివారిపాలెం గ్రామానికి చెందిన గుంజి లలిత, జానా మేరి, సత్తాయిపాలెం గ్రామానికి చెందిన గాలంకి ప్రసన్న, రేపూరి సుమలత, భాగ్యనగర్ గ్రామానికి చెందిన పులిపాటి జ్యోతి వేటపాలెం మండలం పొట్టి సుబ్బయ్యపాలెంలోని రొయ్యల ఫ్యాక్టరీలో పని చేసేందుకు ప్రతి రోజూ వెళ్తూ ఉంటారు. వీరిని కడవకుదురు గ్రామ పంచాయతీ పరిధిలోని పాతపాడు గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి తన ఆటోలో తీసుకెళ్తుంటారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం శ్రీనివాసరెడ్డి తన ఆటోలో 7మంది మహిళలను తీసుకొని వెళ్లి, ఫ్యాక్టరీలో పని అనంతరం చినగంజాం గ్రామానికి వస్తున్నారు. పూలవారిపాలెం సమీపంలోని జాతీయ రహదారిపై ఇసుక ట్రాక్టర్‌కు చింతకాయ ఊడిపోవడంతో ట్రాక్టర్‌ని అక్కడే ఉంచారు. జాతీయ రహదారిపై నిలిపిన ట్రాక్టర్‌ని ఆటో అధికమించే క్రమంలో ఒంగోలు వైపు నుంచి వస్తున్న లారీ ఆటోని ఢీకొట్టింది. ఈ ఘటనలో జ్యోతి, మస్తానీ, సుమలత, జాన్‌మేరి, పర్వీన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రసన్న, లలిత, ఆటో డ్రైవర్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. ఘటనా స్థలంలో మస్తాని ఎడమ చేయి విరిగిపడింది. చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం మస్తానీని గుంటూరుకు, సుమలతను ఒంగోలు వైద్యశాలకు తరలించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.


తహసీల్దార్‌ను కలిసిన వీఆర్వోల సంఘ సభ్యులు

వీఆర్వో సంఘ అధ్యక్షునిగా బాబయ్య

పంగులూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల వీఆర్వోల సంఘ అధ్యక్షునిగా అంబవరపు బాబయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల వీఆర్వో సంఘ నూతన కార్యవర్గ ఎన్నిక బుధవారం పంగులూరులో జరిగింది. సంఘ ఉపాధ్యక్షునిగా జంద్రాజుపల్లి వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా గుమ్మడి నాగు, కోశాధికారిగా ఉదయగిరి సుమతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారు తహసీల్దార్ సింగారావును మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని తహసీల్దార్ అభినందించారు.

వీవోల సంఘం నూతన కమిటీ

పంగులూరు : మండల వీవోఏల నూతన కార్యవర్గ ఎన్నిక బుధవారం జరిగింది. వీవోఏల సంఘ అధ్యక్షురాలిగా తోకచిచ్చు చిన్న, ఉపాధ్యక్షురాలిగా బొగ్గవరపు కల్పన, కార్యదర్శిగా మేక నాగమణి, సహాయ కార్యదర్శిగా బాచిన మనోరంజని, కోశాధికారిగా నాదెండ్ల లక్ష్మితిరుపతమ్మను ఏకగ్రీంగా ఎన్నుకున్నారు.

చినబాబును పరామర్శించిన మంత్రి రవికుమార్

బల్లికురవ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కె.రాజుపాలెంకు చెందిన టీడీపీ నేత జాష్టి కృష్ణబాబు (చినబాబు) ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ వెంకటనారాయణబాబు, టీడీపీ నేతలు ఉన్నారు.


జానకిదేవిని సన్మానిస్తున్న పద్మశాలీ బహుత్తమ సంఘం

దేవునికి, భక్తులకు సేవ చేసే అదృష్టం


టీటీడీ పాలక మండలి సభ్యురాలు జానకిదేవి

చీరాల/ఈపూరుపాలెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర పుణ్యక్షేత్రంలో దేవునికి, భక్తులకు సేవ చేసుకునే భాగ్యం తనకు దక్కిందని టీటీడీ పాలక మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకిదేవి అన్నారు. ఇటీవల దేవస్థానంలో పాలక మండలిలో చోటు దక్కించుకున్న ఆమె మొదటిసారిగా స్వగ్రామమైన చీరాల మండలం ఈపూరుపాలెంలో శ్రీలక్ష్మీ అనంత పద్మనాభస్వామి దేవస్థాన కమిటీ ప్రతినిధులు ఏర్పాటు చేసిన అభినందన సభకు హాజరయ్యారు. ఈసందర్భంగా కమిటీ ప్రతినిధులు ఆమెను ఘనంగా సన్మానించారు. పార్టీకి చేసిన సేవలను గుర్తించి తనకు ఈ అవకాశం ఇచ్చిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గంజి సుబ్బారావు, బాలాజీ చిన్నారావు, ఆకురాతి పద్మిని, ఉమామహేశ్వరరావు, వెంకటరమణ, కాటూరి చెంబయ్య నరసింహారావు, శ్రీరామచంద్రమూర్తి, కూర్మదేవ బాబా, పుండరీయ్య, లోకేశ్వరరావు, దామర్ల శ్రీకృష్ణ, స్థానికులు పాల్గొన్నారు.

పద్మశాలీ బహుత్తమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి చీరాల పద్మశాలి రామమందిరంలో జానకిదేవిని ఘనంగా సన్మానించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల మనోభావాల మేరకు వారికి మెరుగైన సేవలు అందిస్తూ, స్వామివారి సేవలో తన వంతు బాధ్యతగా నడుచుకుంటానని ఆమె చెప్పారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు మండూరి ప్రభాకరరావు, కార్యదర్శి గాత్ర నాగరాజు, కోశాధికారి గుంటి పాపారావు, గౌరవాధ్యక్షుడు గాత్ర పకీరయ్య, వెంకటేశ్వరరావు (బాబు) పాల్గొన్నారు.

తారస్థాయికి రామలింగేశ్వరస్వామి దేవస్థాన వ్యవహారం

ఎండోమెంట్ అధికారుల సమక్షంలోనే ఇరువర్గాల వాగ్వాదం


ఆలయ భూములను పరిశీలిస్తున్న ఎండోమెంట్ అధికారులు

చీరాలటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెం రామలింగేశ్వర స్వామి దేవస్థానం వ్యవహారం తారస్థాయికి చేరింది. అర్చకులు వీరేశలింగం ప్రసాద్‌ను అకారణంగా తొలగించారని ఫిర్యాదు అందడంతో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సూర్యప్రకాష్‌రావు బుధవారం విచారణ చేపట్టారు. ఫిర్యాదు చేసిన అర్చక స్వామి గతంలో దేవదాయ ఆస్తుల విషయంలో అక్రమాలకు పాల్పడుతున్నట్లు పాలక సంఘ ప్రతినిధులు గతంలో పలు ఆరోపణలు చేశారు. ఈక్రమంలోనే ఆయనను తొలగించారు. అర్చక స్వాముల సంఘం, పాలక సంఘం మధ్య అగ్గిరాజుకున్నట్లయింది. ఈక్రమంలోనే బుధవారం విచారణకు వచ్చిన అధికారుల సమక్షంలోనే వాగ్వాదాలు జరిగాయి. ఎట్టకేలకు రెండు వర్గాలను విచారించిన అధికారులు దేవదాయ భూములను కూడా నిశితంగా పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రెండు వర్గాల ప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

అజాత శత్రువు రోశయ్య

వర్ధంతి కార్యక్రమాల్లో వక్తలు



రోశయ్య విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పిస్తున్న, టీడీపీ, వైసీపీ నాయకులు

చీరాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వివిధ హోదాల్లో పనిచేసి, సుదీర్ఘ రాజకీయ జీవితంలో అజాత శత్రువుగా హుందాగా వ్యవహరించిన డాక్టర్ కొణిజేటి రోశయ్యను నేటి తరం రాజకీయ నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. డాక్టర్ కొణిజేటి రోశయ్య వర్ధంతి సందర్భంగా బుధవారం టీడీపీ, వైసీపీ నేతలు, కార్యకర్తలు విడివిడిగా రోశయ్య విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయా సందర్భాల్లో ఆయా పార్టీల నాయకులు మాట్లాడుతూ అనేక పదువుల్లో కొనసాగిన రోశయ్య వాటికి వన్నె తెచ్చారని కొనయాడారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.



ఎర్రవాగులో అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

పోటెత్తిన వరద.. ఉప్పొంగిన ఎర్రవాగు

- వాహన రాకపోకలకు అంతరాయం
- పల్లెలకు తెగిన సంబంధాలు

- వివరాలు 6లో



కావలి : బురదతో నిండిన బాలక్రిష్ణారెడ్డినగర్ రోడ్డు

నమ్మండి.. ఇది రోడ్డేనండి!

కాలు మోపితే సర్రుమనే జారే ఈ రోడ్డును చూశారా!? ఇదెక్కడో మారుమూల ప్రాంతంలోనిది కాదు.. కావలి మున్సిపాలిటీ పరిధిలోని పేదల కాలనీల రోడ్లు వర్షాలకు ఇలా బురదమయంగా మారాయి. బాలక్రిష్ణారెడ్డినగర్, ముసునూరు ఇందిరమ్మ కాలనీలకు వెళ్లే ప్రధాన రోడ్లతోపాటు అంతర్గత రహదారులు సైతం బురదతో జర్రుబుర్రులాడుతున్నాయి. దీంతో పిల్లలు, వృద్ధులు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి. అత్యవసర పరిస్థితుల్లో ఆటోలు కూడా ఇక్కడకు రావడం లేదు. అధికారులు, పాలకులు స్పందించి కాలనీలో రోడ్లను బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

- కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి)



నెల్లూరులో జేసీ మాల్ ప్రారంభం అనంతరం పట్టుచీరను ప్రదర్శిస్తున్న సినీ నటి ప్రియాంక మోహన్

వివరాలు 6

హిందువులపై దాడులు అమానుషం

- నెల్లూరులో హిందూ సంఘాల భారీ ర్యాలీ



నెల్లూరు (సాంస్కృతికం) డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న హింసాకాండపై నిరసన తెలియజేస్తూ బుధవా రం సాయంత్రం నెల్లూరులో హిందూ సంఘాలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించాయి. వీఆర్‌సీ మైదానం నుంచి గాంధీబొమ్మ, కనకమహల్, ఏసీ సెంటర్ మీదుగా గాంధీబొమ్మ వద్దకు ర్యాలీ చేరుకుంది. సీనియర్ న్యాయ వాది పల్నాటి రామదండు మాట్లాడుతూ ఇస్కాన్ సిటీ కార్యనిర్వాహకుడు రామకృష్ణ దాసుపై పెట్టిన అక్రమ కేసులను తక్షణం బంగ్లా ప్రభుత్వం ఉపసంహరిం చుకోవాలని డిమాండ్ చేశారు. లలితా మహేశ్వర పీఠాధిపతి మహేష్‌స్వామి మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత పేరుగాంచిన ఇస్కాన్ సంస్థకు చెందిన కృష్ణదాస్ విషయంలో బంగ్లాదేశ్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు మానవ హక్కులను హరించడమేనని విమర్శించారు. ఈ ప్రదర్శనలో నాయకులు పీ సురేంద్రరెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, రాజేశ్వరమ్మ, మిడతల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నమస్తే.. అందరూ బాగున్నారా!?


- నగరంలో నటి ప్రియాంక మోహన్ సందడి
- అట్టహాసంగా జేసీ మాల్ ప్రారంభం

నగరంలో జేసీ మాల్ ప్రారంభోత్సవం అట్టహాసంగా జరిగింది. ఇందులో పాల్గొన్న నటి ప్రియాంక మోహన్ 'నమస్తే అందరూ బాగున్నారా!?' అంటూ అభిమానులను ఆప్యాయంగా పలకరించారు.

కావలి మున్సిపాలిటీపై 'అమృత్' భారం

నాటి వైసీపీ సర్కారు పాపం కావలి పురపాలక సంఘాన్ని వెంటాడుతూనే ఉంది. పట్టణవాసుల దాహం తీర్చదానికి కేంద్ర ప్రభుత్వం 'అమృత్' పథకం ద్వారా రూ.100 కోట్లు మంజూరు చేసింది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.29 కోట్లు నాటి వైసీపీ పెద్దలు మంజూరు చేయకపోవడంతో మున్సిపాలిటీనే బ్యాంకులో రుణం తీసుకుని చెల్లించింది. ఇప్పటిదాకా 90 శాతం పనులు పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో ప్రజలకు మంచినీరు మాత్రం అందడంలేదు. అదీనూగాక బ్యాంకు నుంచి తెచ్చిన రుణానికి ఈఎంఐ చెల్లింపులు గుదిబండగా మారాయి. ఇక అమృత్-2 కింద రూ.50 కోట్లు మంజూరవగా, ఆ నిధులు అందకనే ఆర్థిక సంఘం నిధులను మినహాయించుకోవడం మున్సిపల్ ఖజానాను కుంగదీస్తోంది.

- రూ.100 కోట్లలో 52 కోట్ల ఖర్చు
- తన వాటా చెల్లించని నాటి వైసీపీ సర్కారు
- రూ.29 కోట్ల బ్యాంకు రుణం ద్వారా ఇచ్చిన పురపాలకం
- ఇందుకు ఈఎంఐ రూ.35 లక్షలు
- మలివిడతలో మరో రూ.50 కోట్ల మంజూరు
- నిధులు రాకనే ఆర్థిక సంఘం ఫండ్ నుంచి కట్
- అయినా పురవాసులకు అందని నీరు



నిర్మాణం పూర్తయినా వినియోగంలోకి రాని ఓవర్‌హెడ్ ట్యాంకు

కావలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కావలి పురపాలక సంఘానికి అమృత్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన ఆనందం కన్నా ఆ నిధులలో తన వాటా చెల్లించడం పురపాలక సంఘానికి ఆర్థిక భారమైంది. అమృత్ పథకం కింద పట్టణంలో మంచినీటి సరఫరా మెరుగుదలకు, మురుగునీరు శుద్ధి చేసేందుకు రూ.100 కోట్లు గతంలో మంజూరయ్యాయి. ఆ నిధులతో చేపట్టిన మంచినీటి ప్రాజెక్ట్ ఇంకా వినియోగంలోకి రాకున్నా అమృత్ వాటా చెల్లింపులకు బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలకు ప్రతినెలా రూ.35 లక్షలు ఈఎంఐ కింద కట్టాలి. ఇక అమృత్-2 కింద బలహీనవర్గాల కాలనీలకు మంచినీటి సరఫరాకు, మురుగునీటి శుద్ధికి మరో రూ.50 కోట్లు మంజూరయ్యాయి. అయితే ఆ నిధులతో ఇంకా పనులు చేపట్టలేదు. నిధులూ రాలేదు. కానీ మున్సిపల్ వాటా కింద 15వ ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వమే మినహాయించుకుంది. నిధులు ఇవ్వకుండానే మున్సిపల్ వాటా కింద ముందుగానే తీసుకోవడం ఏమిటనే చర్చ ఇప్పుడు విస్తృతంగా నడుస్తోంది.

నాటి వైసీపీ సర్కారు పాపం

వాస్తవంగా అమృత్ పథకం కింద కేంద్రం మంజూరు చేసిన నిధులలో 50 శాతం కేంద్ర ప్రభుత్వం భరిస్తుండగా 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం, 10 శాతం మున్సిపాలిటీ భరించాలి. అయితే తొలుత మంజూరు చేసిన రూ.100 కోట్లలో 10 శాతం వాటా కింద మున్సిపాలిటీ రూ.10 కోట్లు మాత్రమే చెల్లించాలి. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్ర ప్రభుత్వ వాటా సక్రమంగా ఇవ్వక పోవటంతో మున్సిపాలిటీయే బ్యాంకు నుంచి రూ.29 కోట్ల రుణం తెచ్చి చెల్లించింది. అయితే ఆ రుణానికి ప్రతినెలా ఈఎంఐ కింద బ్యాంకుకు రూ.35 లక్షలు చెల్లించాల్సి ఉండటంతో మున్సిపాలిటీకి ఆర్థిక భారమైంది.

పురవాసులను తీరని దాహం

అమృత్ పథకం తొలివిడత మంజూరైన రూ.100 కోట్లలో రూ.52 కోట్లతో మంచినీటి ప్రాజెక్ట్ పనులు చేపట్టారు. సుమారు 175 కి.మీ పొడవున పైపులైన్ నిర్మించాల్సి ఉండగా దానిని కుదించి 75 కి.మీ పైపులైను నిర్మాణంతో సరిపెట్టారు. పట్టణంలోని అన్ని ప్రాంతాలకు పైపులైన్ల నిర్మాణంచేలా డిజైన్ చేసినా క్షేత్రస్థాయిలో అలా జరగలేదు. ఆ పైపులైన్ల పరిధిలో బలహీన వర్గాలకు 7,500 కొళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉండగా 3,500 కనెక్షన్లు ఇచ్చేందుకు కూడా సరిపడా పైపులైన్ల విస్తరణ జరగలేదు. మరోవైపు ఆరు ఓవర్‌హెడ్ ట్యాంకులు ఉండగా వాటిలో ఒక్క బుడంగుంట కాలనీలోని ఓవర్‌హెడ్ ట్యాంకు తప్ప మిగిలిన ఐదు వినియోగంలోకి రాలేదు. ఒక జీఎల్ఎస్ఆర్ ట్యాంకు నిర్మించినా దానిని వినియోగంలోకి తేలేదు. సమ్మర్‌స్టోరేజి ట్యాంకు వద్ద నిర్మించిన ఫిల్టరేషన్ పాయింట్‌ను కూడా పూర్తిగా వినియోగంలోకి తేలేదు. మొత్తమ్మీద అమృత్ పథకం కింద 90 శాతం పనులు పూర్తయినట్లు బిల్లులు చేసి రూ.50 కోట్లు వెచ్చించినా ఇంకా దాని ద్వారా నీటి సరఫరా జరగలేదు. వాస్తవంగా అమృత్‌పథకం పూర్తిగా వినియోగంలోకి వస్తే పట్టణంలో ఏ మారుమూల ప్రాంతంలో కూడా తాగునీటి ఎద్దడి అనేది ఉండదు. ప్రస్తుతం వినియోగంలోకి రానందున ప్రతినెలా తాగునీటి ట్యాంకర్లకు రూ.10 లక్షలు వెచ్చించాల్సి వస్తోంది. ఒక పక్క తాగు నీటి ట్యాంకులకు, మరోపక్క అమృత్ రుణం ఈఎంఐలకు మున్సిపల్ నిధులు వెచ్చించాల్సి రావటంతో ఆర్థిక భారం పెరిగి మున్సిపాలిటీ ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంటోంది.



ముసునూరు ఇందిరమ్మ కాలనీలో అసంపూర్తిగా పైపులైన్

ట్రేడ్ మాయ

నెల్లూరు నగర పాలక సంస్థ ఆరోగ్య విభాగంలో మరో భారీ అవినీతి కుంభకోణం వెలుగులోకి వచ్చింది. ట్రేడ్ లైసెన్సుల పేరిట కార్పొరేషన్‌కు చెందాల్సిన నిధులను పెద్ద మొత్తంలో అధికారులు స్వాహా చేసినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆరోగ్య విభాగం రికార్డుల్లో 13,383 ట్రేడ్ లైసెన్సులు ఉన్నట్లు చూపగా రెవెన్యూ విభాగం మాత్రం 26 వేల కమర్షియల్ అసెస్‌మెంట్లకు పన్ను విధిస్తున్నట్లు లెక్కల్లో తేల్చింది. మరి మిగిలిన ఆ 12,617 ట్రేడ్ లైసెన్సులు ఎక్కడున్నాయి...? వాటి ద్వారా వస్తున్న ఆర్థిక లబ్ధి ఏ ఖాతాల్లో జమవుతోందన్నది ప్రశ్నార్థకంగా మారింది.

- నెల్లూరు కార్పొరేషన్‌లో రికార్డులకెక్కని వాణిజ్య లైసెన్సులు
- 26 వేల కమర్షియల్ అసెస్‌మెంట్లకు పన్ను
- ట్రేడ్ లైసెన్సులు 13,383 మాత్రమే
- మిగిలిన 12,617పై తేలని లెక్క
- నగర పాలిక ఖజానాకు రూ.కోట్లలో గండి
- శానిటేషన్ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్ల చేతివాటంపై అనుమానం





నెల్లూరు(సిటీ), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో వాణిజ్య, వ్యాపారాలకు కార్పొరేషన్ నుంచి తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్సు పొందాలి. వీటిని మున్సిపల్ ఆరోగ్య విభాగం పర్యవేక్షిస్తుంది. నగరంలోని 166 డివిజన్ సచివాలయాల పరిధిలో నివాసాలుకాక వాణిజ్యపరంగా 13,383 భవనాలున్నట్లు ఆ విభాగం లెక్క కట్టింది. వీటి నుంచి ట్రేడ్ లైసెన్సుల రూపేణ గడిచిన పదేళ్లలో కార్పొరేషన్ ఖాజానాకు రూ.28.60 కోట్లు చేరాలని, ప్రస్తుత 2024-25 ఆర్థిక సంవత్సరంలో మరో రూ.4.27 కోట్లు కలిసి మొత్తంగా రూ.32.88 కోట్లు నగర పాలక సంస్థకు వసూలు కావలసి ఉందని రికార్డుల్లో నమోదు చేసింది. ఈ మొత్తం బకాయిలో రూ.14.82 కోట్లు వసూలు చేయగా ఇంకా రూ.18.06 కోట్లు రావాల్సి ఉందని నిర్ధారించారు. ఇంత వరకు బాగానే ఉంది. అయితే, నగరంలో 13,383 మాత్రమే వాణిజ్య పరమైన భవనాలు న్నట్లు ఆరోగ్య విభాగం కరాకండిగా చెబుతోంది. కానీ, రెవెన్యూ విభాగం మాత్రం 26 వేల వాణిజ్యపరమైన భవనాలున్నట్లు తేల్చి వాటికి అసెస్‌మెంట్లను జారీ చేసి పన్ను కూడా విధించింది. ఆ మేరకు పన్ను వసూళ్లు కూడా జరుగుతున్నాయి. ఈ రెండు విభాగాల మధ్య ఇంతటి భారీ వ్యత్యాసం ఎలా వచ్చింది...? అన్నది కార్పొరేషన్ యంత్రాంగంలో చర్చనీయాంశంగా మారింది. రెండు విభాగాల మధ్య స్వల్ప వ్యత్యాసాలుండటం సహజం. కానీ, రెండింతలకుపైగా తేడా ఉండటంపై అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఆ 12 వేల లైసెన్సులు ఎక్కడ?

ఆరోగ్య విభాగం లెక్కల్లో చూపని సుమారు 12 వేల ట్రేడ్ లైసెన్సులు ఎక్కడున్నాయి?, వాటి ద్వారా వచ్చే ఆదాయం ఎవరికి చేరుతోంది?, ఎంత మేర వసూలవుతోంది? అన్నది కార్పొరేషన్‌లో హాట్ టాపిక్‌గా మారింది. అధికారికంగా ప్రకటించిన 13వేల లైసెన్సుల ద్వారానే కార్పొరేషన్‌కు పదేళ్లలో రూ.28.60 కోట్లు వస్తే మరి, లెక్కల్లో చూపని 12వేల లైసెన్సుల ద్వారా కార్పొరేషన్‌కు చేరాల్సిన ఎన్ని కోట్ల రూపాయలకు గండి పడిందో అర్థం చేసుకోవచ్చు.

అధికారులు, సిబ్బంది చేతివాటంపై అనుమానాలు

కార్పొరేషన్ ఆరోగ్య విభాగం నుంచి క్షేత్ర స్థాయిలో కీలకంగా పని చేసే శానిటేషన్ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్ల పనితీరుపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ట్రేడ్ లైసెన్సుల విధింపు, వసూళ్ల బాధ్యత వారిదే. ఈ నేపథ్యంలో రికార్డుల్లో చూపని 12 వేల వాణిజ్య కేంద్రాల నుంచి అనధికారి కంగా వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ మొత్తం సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్ల జేబులోకి చేరుతున్నట్లు అనుమానాలున్నాయి. నగరమంతా సర్వే చేస్తే వాస్తవాలు వెలుగులోకి రావడమేకాక వాణిజ్య భవనాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది.

రైల్వేలో 'గుర్తింపు' సందడి

- 11 ఏళ్ల తర్వాత యూనియన్ ఎన్నికలు
- రెండు రోజులపాటు పోలింగ్.. నేటితో ముగియనున్న ప్రక్రియ
- 12న ఫలితాల వెల్లడి



నెల్లూరులోని పోలింగ్ కేంద్రం వద్ద యూనియన్ నాయకులు ఏర్పాటు చేసిన శిబిరాలు

నెల్లూరు (వెంకటేశ్వరపురం) డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : భారతీయ రైల్వే శాఖలో 11 ఏళ్ల తర్వాత కార్మిక యూనియన్ గుర్తింపు ఎన్నికలు జరుగుతున్నాయి. దీంతో ఉమ్మడి జిల్లాలోని నాలుగు రైల్వేస్టేషన్లలో సందడి నెలకొన్నది. రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారంపై కేంద్ర ప్రభుత్వంతో చర్చించేందుకు యునియన్ల వ్యవస్థ ఎప్పటినుంచో ఉన్నది. ఈ నేపథ్యంలో ప్రతి ఐదేళ్లకు ఒకసారి యునియన్ గుర్తింపు ఎన్నికలు దేశవ్యాప్తంగా జరుగుతాయి. అయితే, 2013లో ఎన్నికల జరగ్గా 2018లో తిరిగి ఎన్నికల జరగాల్సి ఉండగా కేంద్రం అనుమతించలేదు. 11ఏళ్ల తర్వాత ప్రస్తుతం కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో రైల్వే కార్మిక యునియన్ల గుర్తింపు ఎన్నికలు జరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని గూడూరు డివిజన్ పరిధిలో నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్, గూడూరుతోపాటు కృష్ణపట్నం స్టేషన్‌లతోపాటు బిట్రగుంట డివిజన్ పరిధిలోని బిట్రగుంట స్టేషన్‌లో బుధ, గురువారాలలో పోలింగ్ జరగనుంది. గూడూరు డివిజన్‌లో సుమారు 950 మంది, బిట్రగుంట డివిజన్‌లో 850 మంది కార్మికులు, ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. తొలిరోజున గూడూరు డివిజన్‌లో 527 మంది, బిట్రగుంట డివిజన్‌లో 314 మంది ఓటు వేశారు.

బరిలో ఐదు యూనియన్లు

ప్రధానంగా రైల్వేశాఖలో ఐదు ప్రధాన యునియన్లు అయిన రైల్వే మజ్దూర్ యునియన్, సౌత్ సెంట్రల్ ఎంప్లాయీస్ సంఘ్, సౌత్ సెంట్రల్ మజ్దూర్ యునియన్, దక్షిణ మధ్య రైల్వే కార్మిక సంఘం, ఇండియన్ రైల్వే మజ్దూర్ యునియన్‌లు పోటీలో ఉన్నాయి. ఈ నెల 12వ తేదీన ఫలితాలు వెలువడ నున్నట్లు కార్మిక సంఘం నాయకులు తెలిపారు. మొత్తం పోలైన ఓట్లలో 30 శాతం వచ్చిన యూనియన్‌కు కేంద్ర ప్రభుత్వ 'గుర్తింపు' ఉంటుంది. కార్మిక సమస్యలపై సదరు యూనియన్ నాయకులే కేంద్రంతో చర్చించే అవకాశం ఉంటుంది.



దారి దుస్థితి చూడు.. దత్తాత్రేయా...!

మండలంలోని మొగిలిచెర్ల నుంచి ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన దత్తాత్రేయ స్వామి గుడికి వెళ్లే రోడ్డు కురుస్తున్న వర్షాలకు బురదమయమైంది. దీంతో ఆలయానికి వెళ్లాలంటే పాదచారులు, వాహనదారులు తీవ్రఇక్కట్లు పడుతున్నారు. సుమారు 3 కి.మీ దూరం రోడ్డంతా ఇలాగే ఉంది. స్వామి దర్శనానికి వెళ్లే భక్తులు కూడా అష్టకష్టాలు పడుతున్నారు. అధికారులు స్పందించి ఈ రహదారిని బాగు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి)

తెల్లవారుజామున చెంచయ్య అనే వ్యక్తి బహిర్భూమికి వెళుతుండగా రోడ్డుకు అడ్డంగా ఉన్న కొండచిలువను చూడకుండా దానిపై కాలుపెట్టి జారీ కిందపడ్డాడు. కొండచిలువను గమనించి గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు అక్కడకు చేరుకుని చంపేందుకు ప్రయత్నించారు. అయితే, అది ఓ ట్రాక్టర్‌లోకి దూరిం ది. దాదాపు గంట సేపు హడావుడి అనంతరం కొండ చిలువను హత మార్చారు. భారీ సైజులో ఉన్న కొండచిలువను గ్రామస్థులు ఆసక్తి కరంగా చూశారు.

- ఆత్మకూరు (ఆంధ్రజ్యోతి)



కామ్మో.. ఎంత పెద్ద కొండచిలువో!

రోడ్డు ఇలా... ప్రయాణం ఎలా?

నెల్లూరు - జొన్నవాడ మార్గంలో పొట్టేపాళెం వద్ద రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఏడాదికిపైగా ఇక్కడి కలుజుపై నీటి ప్రవాహం ప్రమాదకరంగా ఉండటంతో అధికారులు ప్రత్యామ్నాయ మార్గాన్ని ఏర్పాటు చేశారు. ఇది ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు మాత్రమే ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు. అయితే కార్లు, జీపులు కూడా దీనిపైనుంచే వెళ్లడంతో గుంతలుపడి ప్రమాదాలకు హేతువుగా మారింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు బిక్కు, బిక్కుమంటూ వెళ్తున్నారు. అధికారులు, పాలకులు స్పందించి ఇక్కడి రోడ్డును ఆధునీకరించాల్సిన అవసరం ఉంది.

- నెల్లూరు రూరల్ (ఆంధ్రజ్యోతి)



భలే ఇంటి పంట.. రుచులంట!

• విస్తరిస్తున్న మిద్దెతోటలు

ఇంటి ఆవరణలో అదీ గ్రామీణ ప్రాంతాలకే పరిమితమైన పెరటి తోటలు ఇప్పుడు నగరాలకూ విస్తరించాయి. యాంత్రిక జీవనం నుంచి బయట పడేందుకు పచ్చని మొక్కల మధ్య ఆహ్లాదంగా గడిపేందుకు ఇంటి ఆవరణలో, మిద్దెలపైన వీటిని ఏర్పాటు చేసుకుంటున్నారు. పండ్లు, పూలు, కాయగూరలు, ఆకుకూరలు, ఆయుర్వేదం, ఫ్యాషన్ మొక్కలు ఇలా ఎన్నో రకాల మొక్కలను పెంచుతున్నారు. ఒకరితో మొదలైన ఈ 'మిద్దె తోటలు' సామాజిక మాధ్యమాల ద్వారా బాగా విస్తరించాయి. తోటలపై తమ అభిరుచులను పంచుకునేందుకు, సూచనలు, సలహాలు వాట్సాప్ గ్రూపుల ద్వారా ఒకరినొకరు పంచుకుంటున్నారు. నెల్లూరులోని భక్తవత్సలనగర్‌కు చెందిన గోపిశెట్టి సందీప్ తన ఇంటి మిద్దెపై మొక్కలను పెంచడమేగాక రకరకాల మొక్కలను స్నేహితులకు, సన్నిహితులకు ఇచ్చుపుచ్చుకుంటూ ముందుకు సాగుతున్నారు.

- నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)



నగరంలోని భక్తవత్సలనగర్‌కు చెందిన గోపిశెట్టి సందీప్‌కు చిన్ననాటి నుంచే కాయగూరలు, పూలు, పండ్ల మొక్కలు పెంపకంపై ఆసక్తి ఉంది. ఇంటి పరిసర ప్రాంతాల్లో తోటల పెంపకంలో తన తండ్రికి సహకరించేవారు. చేతికొచ్చిన పండ్లు, కూరగాయలను బంధువులు, స్నేహితులకు పంచేవారు. బీటెక్ చదువుతన్న సమయంలోనే సందీప్ రెండు, మూడు సార్లు వివిధ రకాల పూలు, కూరగాయల, పండ్ల మొక్కలను పెంచేందుకు ఆసక్తి చూపినా మెలకువలు తెలియక విఫలమ య్యారు. ఆ తరువాత వ్యాపార నిమిత్తం పూణెలో ఉన్నప్పుడు ఇంటి దగ్గర తల్లి వంటకు అవసరమైన కూరగాయలు తీసుకొచ్చేందుకు ఇంటి నుంచి చాలా దూరం వెళ్లాల్సి రావడం, పడుతున్న ఇబ్బందులు సందీప్‌ను కాస్త ఇబ్బంది పెట్టాయి. దీంతో మిద్దె తోటల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలపై దృష్టి పెట్టారు. తెలిసిన రైతులు, యూట్యూబ్ ఛానెళ్ల ద్వారా 2019లో ఇంటి మరమ్మతులతోపాటు మిద్దె తోటల పెంపకానికి అవసరమైన తొట్టెలు, పందిరులు ఏర్పాటు చేసుకున్నారు. అంతేగాక కారు టైర్లు, వాటర్ క్యాన్లు, పీవీసీ పైపులతో చిన్నపాటి కుండీలను ఏర్పాటు చేసి వివిధ రకాల పూలు, పండ్లు, కూరగాయలతోపాటు ఆయుర్వేద మొక్కలను పెంచడం ప్రారంభించారు. మొక్కలకు అవసరమైన ఎరువును సైతం తయారు చేసుకుంటున్నారు. మామ్స్ టెర్రస్ గార్డెన్ అని పేరు కూడా పెట్టుకున్నారు.









• పండ్లు, కూరగాయలు, పూల పెంపకం
• ఫ్యాషన్ మొక్కలకూ చోటు
• వాట్సప్ గ్రూపుల్లో అనుభవాల షేరింగ్
• మానసిక ఉల్లాసానికి ఇవే బెటర్ అంటున్న పెంపకందారులు

వాట్సప్ గ్రూపులో...

మిద్దె తోటల పెంపకం ప్రారంభించిన కొత్తల్లో తనకు తెలిసిన నలుగురితో వాట్సాప్ గ్రూపును ప్రారంభించారు సందీప్. ప్రస్తుతం రెండు గ్రూపులు ఉండగా అందులో దాదాపు 480 మంది సభ్యులు ఉన్నారు. నెలకొకసారి సమావేశాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. సమావేశాల్లో ఒకరికొకరు పండ్లు, కూరగాయలతోపాటు ఖరీదైన ఎడారి, షోకేస్ మొక్కలు ఉచితంగా ఇచ్చి పుచ్చుకుంటున్నారు. అంతేగాక మొక్కలు పెంచుకునేందుకు అవసరమైన టబ్బులు కూడా అందించుకోవడం విశేషం. మిద్దె తోటల పెంపకాన్ని గుర్తించిన రైతు నేస్తం ఫౌండేషన్ 2022లో సందీప్‌కు అవార్డు కూడా అందించి ప్రోత్సహించింది.

పెంచుతున్న మొక్కలు

అలువేరా, మల్టీవిటమిన్, నేల ఉసిరి, వాము, లెమన్ గ్రాస్, కొండపిండాకు, పెన్సిల్ కాక్టస్, ఇన్సులిన్ ప్లాంట్, పుదీనా, మునగ వంటి ఆయుర్వేద మొక్కలను పెంచుతున్నాను. అలాగే ద్రాక్ష, డ్రాగన్ ఫ్రూట్, అంజీర, సీతాఫలం, దానిమ్మ వంటి పండ్లమొక్కలు, గోంగూర, ఆకుకూరలు, వంగ, బెండ, బీన్స్, గుత్తిబీర, కరివేపాకు తదితర ఇంటికి అవసరమైన కూరగాయల మొక్కలు పెంచుతున్నాను. ఎడారి షోకేస్ మొక్కలు అడేనియం, బోన్సే, కాక్టస్, సెకలెన్స్‌లతోపాటు రణపాల, క్రోటాన్ వంటి మొక్క లతో తోట ఎంతో అందంగా ఉంటోంది.



ఇంట్లోనే ఎరువుల తయారీ

మిద్దె తోటల పెంపకానికి అవసరమైన ఎరువులు స్వయంగా తయారు చేసుకుంటాను. మట్టి, ఎండి రాలిపోయిన ఆకులు, మొక్కలు, ఆవుపేడ, గోమూత్రంతో మొక్కలకు అవసరమైన ఎరువును సిద్ధం చేసుకుంటాను. ఫిష్ పాండ్‌లో ఉండే నీటిని కూడా ఎరువులుగా వినియోగిస్తాను. ఉద్యోగ రీత్యా బయట ఎక్కువ తిరుగుతుంటాను. అయినా వారంలో ఒకరోజు పూర్తిగా మిద్దె తోటలకు కేటాయిస్తాను. ఎక్కువ సమయం ఇక్కడే గడుపుతాను.

- గోపిశెట్టి సందీప్







ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పిచ్చి మొక్కలను తొలగిస్తున్న కార్పొరేషన్ కార్మికులు

టిడ్కో సముదాయం శుభ్రం

• ప్రత్యేక బృందాలతో చెత్త, ముగురు తొలగింపు
• స్థానికుల హర్షం

నెల్లూరు (వెంకటేశ్వరపురం) డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు లోని వెంకటేశ్వరపురంలో ఉన్న టిడ్కో గృహ సముదాయం ఎట్టకేలకు శుభ్రపడింది. టిడ్కో నివాసాల వద్ద పారిశుధ్య పరిస్థితులపై 'చెత్తకుప్పలు.. మురుగు కంపు' శీర్షికతో బుధవారం ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనంతో కార్పొరేషన్ యంత్రాంగం కదిలింది. ప్రత్యేకంగా కార్మిక బృందాలను ఏర్పాటు చేసి పిచ్చి మొక్కలను, మురుగు, వ్యర్థాలను తొలగించారు. దుర్వాసన రాకుండా బ్లీచింగ్ చల్లారు అనేక నెలలుగా ఉన్న సమస్యలు పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

పోటెత్తిన వరద.. ఉప్పొంగిన ఎర్రవాగు

కందుకూరు మండలంలో మోపాడు చెరువు నిండటంతో మంగళవారం రాత్రి తలుపులు ఎత్తి వరదనీటిని వదిలారు. బుధవారం ఉదయానికి పంది వాగు నుంచి వరద ఉధృతి పెరగడంతో ఒకదశలో పదిగేట్లు ఎత్తారు. దీంతో కందుకూరు - గుడ్లూరు మార్గం, కందుకూరు - చుట్టుగుంట మార్గంలోని ఎర్రవాగు పొంగి ప్రవహించటంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎర్రవాగులో ఆర్టీసీ బస్సు ఆదుపుతప్పడంతో ప్రయాణికుల్లో భయాందోళన నెలకొంది. బస్సు పూర్తిగా పక్కకు వెళ్లడంతో అత్యవసర ద్వారం నుంచి ప్రయాణికులు బయటపడ్డారు. చుట్టుగుంట మార్గంలో ఆటోలు, మోటారుసైకిళ్ల ప్రయాణించే వీలు లేకపోవటంతో ఉలవపాడు, ఆత్మకూరు, మన్నేటికోట, కుమ్మరిపాలెం, చుట్టుగుంట తదితర గ్రామాల ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. అత్యవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాలలో పది కిలోమీటర్లకుపైగా చుట్టూ తిరిగి కందుకూరు చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- కందుకూరు, (ఆంధ్రజ్యోతి)

రేపు కళా ఉత్సవ్ పోటీలు

ఇందుకూరుపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లెపాడు డైట్ కళాశాల ఆధ్వర్యంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీలు శుక్రవారం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కే వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన అన్నీ యాజమాన్యాల పాఠశాలల్లో 9, 10, 11, 12 తరగతులు చదువుతున్న విద్యార్థులు ఈ పోటీలకు అర్హులని తెలిపారు. గాత్ర సంగీతం (సాంప్రదాయ, జానపద, భక్తి, దేశభక్తి), వాయిద్య సంగీతం, (సంప్రదాయ, పెర్కుసివ్, మెలోడి, ఆర్కెస్ట్రా) నాట్యం (సాంప్రదాయం, జానపదం), దృశ్యకళలు (ద్విమితీయ చిత్రణ, చిత్రలేఖనం, రంగులు వేయడం, అద్దకం, వ్యంగ్యచిత్రం, క్యారికేచర్, త్రిమితీయ చిత్రణ- శిల్పం, నమూనా, సాంప్రదాయబద్ధ ఆటబొమ్మలు, ఆటలు, చేతిపనులు), రంగస్థలం (ఏకపాత్రాభినయం, ధ్వన్యనుకరణ, నాటిక, నాటకం), సాంప్రదాయ కథలు చెప్పడం, నృత్యం, నాటకం, సంగీత) పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రతి విభాగం నుంచి వ్యక్తిగతంగానూ, ఐదుగురి బృందంతోనే పోటీల్లో పాల్గొనవచ్చని వివరించారు. ఒక్కొక్క విద్యా సంస్థ నుంచి ఒక్కొక్క కళారూపంలో విద్యార్థి లేక విద్యార్థిని మాత్రమే విడివిడిగా పాల్గొనాలన్నారు. గత ఏడాది జరిగిన కళా ఉత్సవ్‌లో బహుమతులు సాధించినవారు పోటీకి అనర్హులని తెలిపారు. విద్యార్థులు వారికి అవసరమైన సామగ్రిని వారే తెచ్చుకోవాలన్నారు. ప్రతి కళారూప ప్రదర్శనకు ఐదునిముషాలు మాత్రమే సమయం ఉంటుందన్నారు. పోటీల్లో పాల్గొనేవారు తమ వివరాలను డైట్ కళాశాల మెయిల్‌కు పంపాలని ఆయన తెలిపారు.

నమస్తే.. అందరూ బాగున్నారా!?

• నగరంలో నటి ప్రియాంక మోహన్ సందడి • అట్టహాసంగా జేసీ మాల్ ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నమస్తే నెల్లూరు బాగున్నారా.. అంటూ యువతను కేరెత్తించిన నటి ప్రియాంక మోహన్ బుధవారం నెల్లూరులో నూతన వరవడికి నిత్య నూతన ఫ్యాషన్లకు నిలయమైన జేసీ మాల్ ప్రారంభోత్సవానికి విచ్చేసింది. ముందుగా మాల్ ముందు స్టేజీ మీద తన కోసం వచ్చిన అభిమానులను ఆప్యాయంగా పలకరించింది. దీంతో అభిమానుల కేరింతలతో ఆ ప్రాంతమంతా హోరెత్తిపోయింది. అనంతరం నెల్లూరు రూరల్, కోవూరు ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కార్పొరేటర్ దాసరి అమృతలతో కలిసి జేసీ మాల్‌ను ప్రారంభించారు. మాల్‌లోని అన్ని ఫ్లోర్లను తిరిగి వస్త్రాలను ప్రదర్శించారు. అనంతరం నటి ప్రియాంక మోహన్ విలేకరులతో మాట్లాడుతూ జేసీ మాల్ అంటే ఫ్యాషన్ ఫర్ ఆల్ అంటూ కితాబిచ్చారు. కుటుంబం మొత్తానికి కావాల్సిన వస్త్రాలు వేలాది రకాలు ఇక్కడ ఉన్నాయి. ప్రారంభ ధర రూ.99లేనంటూ తెలిపారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని నిత్యనూతన డిజైన్ల వస్త్ర ప్రపంచాన్ని తలపిస్తోందని తెలిపారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆశీస్సులతో వ్యాపారంలో ఎదిగి మరిన్ని షాపింగ్ మాల్‌లు ప్రారంభించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం అతిథులను జేసీ మాల్ అధినేత ఎం.జనార్ధన్ రెడ్డి, జమునారెడ్డి దంపతులు, డైరెక్టర్ కృష్ణారావు శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం షాపింగ్‌మాల్ కొనుగోలుదారులతో కిటకిటలాడింది.



జేసీ మాల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న నటి ప్రియాంక మోహన్, ఎమ్మెల్యేలు ప్రశాంతి, శ్రీధర్‌రెడ్డి తదితరులు



జేసీ మాల్‌లో కొనుగోలు దారుల సందడి

'సోమశిల'లో 71 టీఎంసీల నీరు

అనంతసాగరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయంలో నీటినిల్వ పెరుగుతోంది. బుధ వారం 9,578 క్యూసె క్కుల ఇన్‌ఫ్లో ఉండగా 71.119 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కండలేరుకు 2,000, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 150, డెల్టాకు 50 క్యూసెక్కులు సరఫరా చేస్తు న్నారు.

● ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి): గండిపాళెం జలాశయం నీటిమట్టం 15.5 అడుగులకు చేరినట్లు జలవనరుల శాఖ డీఈ కె.చంద్రమౌళి పేర్కొన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పైతట్టు ప్రాంతాల నుంచి 380 క్యూసెక్కుల వరద ప్రవా హం జలాశయానికి వస్తున్నట్లు తెలిపారు.

● సంగం, (ఆంధ్రజ్యోతి) : సంగం బ్యారేజీకి వస్తున్న వరద నిలకడగా ప్రవహిస్తోంది. వర్షం కారణంగా వాగులు, వంకలు ప్రవహించి బీరాపేరు, బొగ్గేరు ద్వారా సుమారు ఆరు వేల క్యూసెక్కుల నీరు బ్యారేజీకి చేరుతున్నాయి. దీంతో నీటిమట్టం 11.1 అడుగులు చేరిం ది. కావలి కాలువకు 500 క్యూసెక్కులు, కనిగిరి రిజర్వాయర్‌కు 350 క్యూసెక్కులు, నెల్లూరు చెరువుకు 50 క్యూసెక్కులు, నెల్లూరు తాగునీటికి 50 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు. మిగిలిన నీటిని బ్యారేజీ గేట్ల ద్వారా దిగువ నెల్లూరు బ్యారేజీకి విడుదల చేస్తున్నారు.

● రాపూరు, (ఆంధ్రజ్యోతి) : కండలేరు డ్యాం సామర్థ్యం 68 టీఎంసీలు కాగా ప్రస్తుతం 54 టీఎంసీల నీరు ఉన్నట్లు ఏఈ కట్ట తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌ఫ్లో 3,650 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 980 క్యూసెక్కులు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

● లింగసముద్రం (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టులో నీటిమట్టం పెరుగుతోంది. ప్రస్తుతం నీటినిల్వ 18.8 అడుగులు ఉంది. మన్నేరు ఎగువ నుంచి 220 క్యూసెక్కులు, సోమశిల ఉత్తర కాలువ నుంచి 130 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.

కలెక్టరేట్‌లో ఐటీడీఏ ఆధార్ కేంద్రం

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ కార్యాల య ఆవరణలో ట్రెజరీ కార్యాలయం వెనుక వైపు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. నగరంలోని ఐటీడీఏ కార్యాలయంలో ఒక ఆధార్ కేంద్రం గిరిజనుల కోసం ప్రత్యేకంగా ఉండగా తాజాగా కలెక్టరేట్‌లో కూడా అలాంటి కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి పరిమళ పేర్కొన్నారు. గిరిజనులతోపాటు అందరూ ఈ కేంద్రాన్ని వినియోగించుకునే అవకాశం కల్పించారు.

మార్చి నాటికి ఇళ్ల నిర్మాణాలు
పూర్తి చేయాలి : ఈఈ


జగనన్న లేఅవుట్‌లో ఇళ్లను పరిశీలిస్తున్న ఈఈ

ఉదయగిరి రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులు 2025 మార్చి నాటికి ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయాలని గృహ నిర్మాణ శాఖ ఈఈ దయాకర్ సూచించారు. బుధవారం మండలంలోని కొండాయపాళెం పంచాయతీ గంగిరెడ్డిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ నెల్లూరు, ఆత్మకూరు డివిజన్ల పరిధిలోని 22 మండలాల్లో ప్రస్తుతం 39,045 ఇళ్ల నిర్మాణం జరుగుతోందన్నారు. వారంతా వచ్చే ఏడాది మార్చి చివరి నాటికి పూర్తి చేస్తే ప్రభుత్వ రాయితీ లభించడంతోపాటు నూరు శాతం బిల్లుల మంజూరుకు చర్యలు చేపడతామన్నారు. గడువులోపు నిర్మాణం చేయని లబ్ధిదారుల ఇళ్లను రద్దు చేయడం జరుగుతుందన్నారు. నూతన పక్కాగృహాల మంజూరుకు సంబంధించి ప్రభుత్వం జనవరిలో విధివిధానాలు మంజూరుచేసే అవకాశముందన్నారు. ఈకార్యక్రమంలో ఏఈ రామకృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి, ఇంజనీరింగ్ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ఎమ్మెల్యే కాకర్ల ధ్యేయం : మన్నేటి


ఆనకట్ట పనులు పరిశీలిస్తున్న మన్నేటి వెంకటరెడ్డి

ఉదయగిరి రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన ఉదయగిరి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చర్యలు చేపడుతున్నట్లు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి పేర్కొన్నారు. బుధవారం రూ. 9 కోట్లతో జరుగుతున్న ఉదయగిరి ఆనకట్ట సుందరీకరణ పనులను టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఆనకట్ట సుందరీకరణ పనులు పూర్తయితే ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. ట్యాంక్‌బండ్ ఆధునికీకరణతోపాటు మరో ఐలాండ్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు. మురుగునీరు, వ్యర్థాలు ఆనకట్టలోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే తన సొంత నిధులతో ట్యాంక్‌బండ్ సుందరీకరణకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ నిర్వహణకు అనుమతులు తప్పనిసరి


అనుమతి పత్రం ఇస్తున్న ఏవో

వింజమూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కలిగిరి మండలాల్లోని నర్సరీ నిర్వాహకులు ఆంధ్రప్రదేశ్ నర్సరీ చట్టం -2010 నిబంధనల ప్రకారం తప్పకుండా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వింజమూరు ఉద్యాన అధి కారి షేక్ షహీల్ తెలిపారు. బుధ వారం వింజమూరు గ్రామంలో లైసెన్స్ లేని నర్సరీ నిర్వాహకులకు నోటీసులు జారీ చేసి నాలుగు రోజుల లోపల తగిన ధ్రువ పత్రాలతో లైసెన్స్‌కు దరఖాస్తు చేసు కోవాలన్నారు. అలాగే నర్సరీ చట్టంపై అవ గాహన కల్పించారు. మొక్కలు విక్రయించే టప్పుడు అన్ని వివరాలతో కూడిన బిల్లులను రైతులకు అందజేయాలన్నారు. నర్సరీ రిజిస్ట్రేషన్‌కు అవసరమైన అప్లికేషన్ ఫారం వింజమూరులోని ఉద్యాన శాఖ కార్యాలయంతోపాటు రైతు భరోసా కేంద్రాలలో కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. పై రెండు మండలాల్లోని నర్సరీ నిర్వాహకులు అప్లికేషన్‌తోపాటు అవసరమైన పత్రాలు సమర్పించి ఈనెల 8వ తేదీ లోపల రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

అసెంబ్లీ ఆవరణలో రోశయ్య విగ్రహం పెట్టాలి


కొణిజేటి రోశయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య ప్రముఖులు

కావలిటౌన్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి) : దివంగత మాజీ సీఎం కొణిజేటి రోశయ్య విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేయాలని ఆర్యవైశ్య సంఘం కావలిశాఖ అధ్యక్షుడు తటవర్తి రమేష్ కోరారు. బాపూజీనగర్‌లోని ఆర్యవైశ్య సంఘం కార్యాలయంలో రోశయ్య తృతీయ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ముందుగా రోశయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కావలి లో సైతం రోశయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నేతలు కోరారు. కార్యక్రమంలో ఓరుగంటి రామకృష్ణ, పోతుగంటి శ్రీకాంత్ ప్రసాద్, ఏ శివ, సురేష్, శ్రీనివాసులు, గిరి, రాము, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే వంటేరు జన్మదిన వేడుకలు


గురువులను సత్కరించిన వంటేరు దంపతులు

జలదంకి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం మండలంలోని ఆయన అభిమానులు, టీడీపీ నేతలు ఘనంగా నిర్వహించారు. ముందుగా పద్మావతి కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో కేక్ కట్ చేశారు. బ్రాహ్మణ క్రాకలో రక్తదాన శిబిరం నిర్వహించారు. అదే గ్రామంలోని హైస్కూల్‌లో పూర్వ గురువులు ఎస్‌వీ రాజు, చేజర్ల రమణారెడ్డిలను వంటేరు ఘనంగా సత్కరించారు. టీటీడీ డెయిరీ, క్యాలెండర్‌లతోపాటు రూ.10వేల నగదు బహూకరించారు. హైస్కూల్ విద్యార్థులకు విద్యా ఉపకరణాలు అందిచారు. వరదారెడ్డి ఎస్టీకాలనీలోనూ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు పీ మధురెడ్డి, పీ భాస్కర్‌రెడ్డి, వీ జయచంద్రారెడ్డి, టీ మధుసూదనరావు, పీ రామక్రిష్ణారెడ్డి, కె.మాధవరెడ్డి, సర్పంచి, ఉపసర్పంచిలు ఐ.సుధాకర్, డీ. మాల్యాద్రిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ మున్సిపల్ కౌన్సిలర్లు టీడీపీలో చేరిక


కౌన్సిలర్లను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ

ఆత్మకూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం వైసీపీకి చెందిన ఇద్దరు మున్సిపల్ కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. 1వ వార్డు వైసీపీ కౌన్సిలర్ మలబంటి రాజశేఖర్, వైసీపీకి అనుబంధంగా ఉన్న 2వ వార్డు కౌన్సిలరు దగ్గుమాటి శివ కోటారెడ్డిలకు టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ పార్టీ కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, జిల్లా తెలుగు యువత మాజీ ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, టీడీపీ మున్సిపల్ కౌన్సిలర్లు సూరా భాస్కర్‌రెడ్డి, కొప్పోలు రమాదేవి, షేక్ గౌస్‌బాష, మాదాల శ్రీనివాసులనాయుడు, గండ్ల వేణు పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

శ్రీసుబ్రహ్మణ్య విద్యా సంస్థ వార్షికోత్సవం

వింజమూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రాజీవ్‌నగర్‌లోని శ్రీసుబ్రహ్మణ్య విద్యా సంస్థ మొదటి వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ డైరెక్టర్ సురేంద్రరాజు మాట్లాడుతూ వింజమూరు పట్టణంలో నవోదయ ఎంసెట్ కోచింగ్ సెంటర్ ఏర్పాటుచేసి సంవత్సరం అయిన సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాము, చెంచయ్య, పూర్వ కళాశాల సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో పొంగి ప్రవహిస్తున్న వాగులు

● నీట మునిగిన వరినాట్లు ● రాకపోకలకు వాహనదారుల అవస్థలు


కందుకూరు: పొంగి ప్రవహిస్తున్న ఎర్ర వాగు


జలదంకి : 9వమైలు వద్ద నీట మునిగిన వరినాట్లు

కందుకూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాను అనంతరం కొనసాగుతున్న అల్పపీడన ద్రోణి ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో నియోజకవర్గంలో చెరువులు జలకళను సంతరించుకున్నాయి. బుధవారం సాయంత్రానికి రాళ్లపాడుకు నీటిమట్టం 18.8 అడుగులకు చేరింది. బుధవారం ఉదయం మన్నేరు ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలతో ఒక్కరోజులోనే అడుగు నీరు పెరగ్గా ప్రస్తుతం 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. గురువారానికి 19.5 అడుగులకు రాళ్లపాడు నీటిమట్టం చేరే అవకాశం ఉందని ఎగువన మరో జల్లు వర్షం కురిసినా రాళ్లపాడు ప్రాజెక్టు కూడా నిండుతుందని అంచనా వేస్తున్నారు.

నీటమునిగిన వరినాట్లు

● జలదంకి : మండలంలో మంగళ, బుధవారాల్లో వర్షం ముంచెత్తింది. దీంతో కలుజులు, వాగులు, వంకలు పొంగిపొర్లాయి. నీటి ప్రవాహానికి మండలంలోని పలుగ్రామాల్లో వరినాట్లు, నారుమళ్లు నీటమునిగాయి. వారం క్రితం వేసిన వరినాట్లు కావడంతో నీరు బయటకు వెళ్లకపోతే కుళ్లిపోయి పనికిరాకుండా పోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

పొంగుతున్న వాగులు

● బిట్రగుంట : బోగోలు మండలంలో బుధవారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగి నీరంతా చెరువుకు చేరాయి. దీంతో కడనూతల, కోవూరుపల్లి, బోగోలు చెరువులు కలుజులు పారుతున్నాయి. పొలాల్లోకి వర్షపునీరు చేరుకుంది. వర్షం ఇలానే కొనసాగితే నాట్లు వేసుకున్న రైతులు తీవ్రంగా నష్టపోతారు.

సురక్షిత ప్రాంతాలకు గిరిజనుల తరలింపు

బోగోలు మండలం రామస్వామిపాలెం గిరిజన కాలనీలోని ఇళ్లలోకి వర్షపు నీరు చేరుకోవడంతో తహసీల్దారు ఆదేశాల మేరకు వీఆర్వో మోహన్‌రావు బుధవారం గిరిజనులను సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఆర్వో అశోక్, స్థానికులు బత్తుల మల్లికార్జునరావు, రవిచంద్ర పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను అరికట్టాలి

● హిందూ రక్షా వేదిక ఆధ్వర్యంలో నిరసన


కావలిటౌన్: నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంస్థలు

కందుకూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో గత కొద్దినెలలుగా హిందువులపై జరుగుతున్న అకృత్యాలను, అక్కడ మహిళలపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలను ఆపేందుకు భారత ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని హిందూ రక్షా వేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా తలపెట్టిన ఆందోళనల్లో భాగంగా బుధవారం కందుకూరులో నిరసన ర్యాలీ, మానవహారం ఏర్పాటు చేశారు. పట్టణంలోని అంకమ్మ దేవాలయం నుంచి పెద్దసంఖ్యలో హిందువులు సబ్ కలెక్టరు కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించి వినతిపత్రం అందజేశారు. పోస్టాఫీసు సెంటర్‌లో మానవహారం ఏర్పాటుచేసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ రక్షావేదిక ప్రతినిధులు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులు, ఇతర మైనారిటీలపై అకృత్యాలు పెరిగిపోయాయని, అక్కడ ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళనకు దిగుతున్న హిందువులను కూడా అరెస్టులు చేసి జైళ్లకు పంపుతున్నారని, ఈ దశలో భారత ప్రభుత్వం కఠినంగా వ్యవహరించి బంగ్లాదేశ్‌లో పరిస్థితులను కట్టడిచేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో హిందూ రక్షావేదిక ప్రతి నిధులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

● కావలిటౌన్: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను నిరసిస్తూ బుధవారం హిందూ సంస్థల ప్రతినిధులు, బీజేపీ నేతలు ట్రంకురోడ్డులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు కందుకూరి సత్యనారాయణ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు నిర్వహించడం అమానుషమని, ఆటవిక చర్య అని అన్నారు. కార్యక్రమంలో సీవీసీ సత్యం, ఇంటూరి రమణయ్య, వేదగిరి సూర్యనారాయణాచార్యులు, సుదీర్, మందా కిరణ్ పాల్గొన్నారు.

● వింజమూరు : బంగ్లాదేశ్‌లో హిందువులను కాపాడాలని, హిందువులపై దాడులను ఆపాలని నినాదాలు చేస్తూ వింజమూరు శివాలయం నుంచి బంగ్లా సెంటర్ వరకు హిందూ రక్ష వేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ సావర్కర్, బీజేపీ అధ్యక్షుడు డేగా మధుయాదవ్. కదిరి రంగారావు, మధుసూదన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, భానుప్రకాష్, రమేష్, గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు


హుండీ నగదు లెక్కిస్తున్న గ్రామ పెద్దలు

సంగం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగమేశ్వరాలయ ఇన్‌చార్జి ఈవో చైతన్య ఆధ్వర్యంలో బుధవారం హుండీ నగదును లెక్కించారు. అక్టోబరు 15వ తేదీ నుంచి డిసెంబరు 4 వరకు రూ.83,173 హుండీ ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో పూజారి గోపాలకృష్ణమూర్తి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పుస్తకాలే నిజమైన నేస్తాలు

కావలిటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు పుస్తకాలే నిజమైన నేస్తాలని ఎంఈవో-1 గోవిందయ్య పేర్కొన్నారు. బుధవారం వెంగళరావునగర్‌లోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి విద్యార్థులకు పరకాష్ రాష్ట్రీయ సర్వేక్షణ్-2024 నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో భాగంగా పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలను ఆయన పరిశీలించి మాట్లాడారు. పాఠశాల పనితీరు పట్ల హెచ్‌ఎం హయ్యూల్ హయ్యామ్‌ను అభినందించారు. కార్యక్రమంలో శిక్షకులు బీ అనిత, వో రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం తరలింపు

కలిగిరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో బుధవారం ఆ కార్యాలయాన్ని గ్రామ సచివాలయం -2 భవనంలోకి మార్చినట్లు ఎంపీడీవో ప్రత్యూష తెలిపారు. మండల ప్రజలు నూతన కార్యాలయం నిర్మాణం జరిగే వరకు ఈ మార్పును గమనించాలని ఆమె కోరారు.

సీపీఎం సభలను జయప్రదం చేయండి

కావలిటౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇందుకూరుపేటలో ఈనెల 7, 8 తేదీల్లో జరగనున్న సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పట్టణ కార్యదర్శి పీ పెంచలయ్య కోరారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రజా, కార్మిక, కర్షక సమస్యల పరిష్కారం కోసం పార్టీ చేసిన పోరాటాలు, ఉద్యమాల గురించి మహాసభల్లో చర్చిస్తారని తెలిపారు. భవిష్యత్ ప్రణాళికలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకుంటారని తెలిపారు.

విద్యార్థులకు రాష్ట్రీయ సర్వేక్షణ్ పరీక్ష

ఉదయగిరి రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నార్త్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం రాష్ట్రీయ సర్వేక్షణ్ పరీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసేందుకు జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలిలోని స్వతంత్ర సంస్థ పరాఖ్ ఈ పరీక్ష నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ జాఫర్ మొహిద్దీన్ పేర్కొన్నారు. ఈ పరీక్షలను కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయం ఉపాధ్యాయుడు బీవీ రవికృష్ణ పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి


డీఈకి వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జరగనున్న సాగు నీటి సంఘాల ఎన్నికలకు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య బుధవారం జలవనరుల శాఖ డీఈ చంద్రమౌళికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బండగానిపల్లి పంచాయతీ లింగాలచెరువు ఆయకట్టు పరిధిలో అర్హత కలిగిన పలువురు రైతులకు ఓటర్ల జాబితాలో పేర్లు లేవన్నారు. రైతులకు ఎలాంటి సమాచారం లేకుండా ఓటర్ల జాబితా ప్రకటించారని, అధికారులు ప్రకటించిన ఓటర్ల జాబితాలో చనిపోయిన, అనర్హుల పేర్లు అధికంగా ఉన్నాయన్నారు. సాగులో పొలాలు ఉండే రైతులకు ఓటు హక్కు కల్పించాలని కోరారు.

అర్హులకు న్యాయం చేయాలి: టీడీపీ

ఆయకట్టు పరిధిలో అర్హులైన ప్రతిఒక్కరికి న్యాయం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి జలవనరుల శాఖ డీఈ చంద్రమౌళికి విన్నవించారు. జాబితాలో చనిపోయిన, అనర్హుల పేర్లు ఉన్నాయని, వాటిని తొలగించి అర్హులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కాకు విజయమ్మ, రైతులు దేవసాని సుధాకర్‌రెడ్డి, కల్లూరి రమణారెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఆత్మకూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : : దివ్యాంగుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పలు పథకాలు ప్రవేశపెట్టిందని మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన దివ్యాంగులకు ప్రభుత్వం అందిస్తున్న చేయూతను వివరించారు. అనంతరం పలువురు దివ్యాంగులకు శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెప్మా టీఎంసీ మాధవి, ఆర్పీ సభ్యులు, పొదుపు సంఘాల గ్రూపు లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ఆదరించాలి

అల్లూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో ప్రతిఒక్కరూ దివ్యాంగులను ఆదరించాలని ఎంఈవో-1 రవీంద్రనాథ్ అన్నారు. పట్టణ పరిధిలోని ఎంపీయూపీ అనుబంధ భవిత కేంద్రంలో బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు దివ్యాంగ విద్యార్థులకు వీల్‌చైర్, రోలేటర్‌లు అందించి, భోజన సౌకర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 సునీత, హెచ్‌ఎం మల్లికార్జునరావు, భవిత కేంద్ర నిర్వాహకులు జే సునీత, పీ శిల్పా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇంటూరి చొరవతో గ్రామకంఠం భూములకు విముక్తి

లింగసముద్రం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : లింగసముద్రం గ్రామంలో సర్వే నంబరు 79లోని గ్రామ కంఠం భూమి గత 7 సంవత్సరాల క్రితం 22-బిలోని నిషేధిత భూముల జాబితాలో నమోదైంది. దీంతో ఈ సర్వే నంబరులోని ఎ 18.80 సెంటు నివాస స్థలంలో రిజిస్ట్రేషన్లు జరగక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ విషయమై ఎన్నిసార్లు అధికారులకు అర్జీలు ఇచ్చినా గత పాలకులు పరిష్కారం చూపలేదు. దీంతో గత నెల 26న లింగసముద్రం వచ్చిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు ఈ సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు పలువురు అర్జీలు ఇచ్చారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు సమస్యను నెల్లూరు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించారు. దీంతో కలెక్టర్ సర్వే నంబరు 79లో రిజిస్ట్రేషన్లు జరుపుకునే విధంగా ఉత్తర్వులు విడుదల చేశారు.

పంచాయతీ కార్యదర్శులకు వేతనాల నిలిపివేత

వరికుంటపాడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే నేపథ్యంలో మండలంలో విధులు నిర్వహించే పంచాయతీ కార్యదర్శులకు నవంబరు నెల వేతనాలు నిలిపివేయడం జరిగింది. ప్రభుత్వం నిర్దేశించిన సర్వేల లక్ష్యాలను సాధించకపోవడంతోపాటు ఇతర పనుల్లోనూ వెనుకబడి ఉండడంతో మొత్తం 15 పంచాయతీ కార్యదర్శులకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల పరిషత్ అధికారులు వేతనాలు నిలిపివేశారు. దీంతో ఈనెలలో ఇంతవరకు వేతనాలు అందక, వాటి కోసం ఆశగా ఎదురుచూసిన కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేరీతిలో పంచాయతీ కార్యదర్శులు సైతం తమ పరిధిలోని కొంతమంది సచివాలయ ఉద్యోగుల వేతనాలను కూడా నిలిపివేయడం జరిగింది. ఇటీవల 11 మంది వెల్ఫేర్ అసిస్టెంట్లకు సైతం షోకాజ్ నోటీసులు అందించిన అధికారులు తాజాగా పంచాయతీ కార్యదర్శుల వేతనాలను నిలిపివేయడం సర్వత్రా చర్చానీయాంశంగా మారింది.

తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది లేక ఇబ్బందులు

ఉలవపాడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయంలోని పరిపాలనా విభాగంలో అధికారులు లేక కుర్చీలన్నీ బోసిపోయినట్లు కనిపిస్తున్నాయి. పైగా ప్రజలకు అవసరమైన రెవెన్యూ సేవలు సకాలంలో అందడం లేదని పూర్తిస్థాయి సిబ్బందిని నియమించి సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

తహసీల్దార్ వివరణ

బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఆర్ఐ పోస్టు ఖాళీగా ఉన్నప్పటికీ ఉప తహసీల్దార్, సీనియర్ అసిస్టెంటు ద్వారా పనులు వేగవంతంగా చేస్తు వచ్చాను. ప్రస్తుతం డీటీ వీరయ్య కూడా బదిలీపై వెళ్లడంతో పని భారం పెరిగింది. అయినప్పటికీ ఉన్న సిబ్బందితో విధులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ లావణ్య తెలిపారు.

రైతులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు

● మన్నం మధుబాబు, రాళ్లపాడు ప్రాజెక్టు కెనాల్స్ డీఈఈ



కందుకూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు రిజర్వాయరు ఆయకట్టులో ఈ ఏడాది వరిసాగుకు నీరందిస్తున్నందున రైతులకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ప్రాజెక్టు కెనాల్స్ డీఈఈ మన్నం మధుబాబు తెలిపారు.

? దాదాపు ఏడేళ్ల తర్వాత రాళ్లపాడు ఆయకట్టులో పూర్తిస్థాయిలో వరిసాగుకు నీటిని విడుదల చేస్తున్నారు కదా.. ఆయకట్టు అంతటికీ నీరందించగలుగుతారా. లస్కర్ల సమస్య లేదా.

! ప్రాజెక్టుపై ప్రస్తుతం ఇద్దరు లస్కర్లు మాత్రమే ఉన్నారు. ఇతర ప్రాంతాలలో కూడా తగినంతమంది లేనందున ప్రస్తుతం లస్కర్లను తీసుకురావటం కష్టసాధ్యం. అందుకే ఆయకట్టు రైతులతో చర్చించి ప్రైవేటు వ్యక్తులను నీరు కట్టుకు నియమించేలా ఏర్పాట్లుచే స్తున్నాం

? కాలువల పరిస్థితి ఏమిటి ?

! కాలువలకు ఇబ్బంది లేదు. ప్రధాన కాలువతో పాటు బ్రాంచ్ కెనాల్స్‌ను కూడా నీటిపారుదలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నాం.

? ప్రాజెక్టులో సరిపడినంత నీరు లేదు కదా.. ఆయకట్టు అంతా వరి నాటితే ఇబ్బంది రాదా.

! 21 అడుగుల సామర్థ్యం కలిగిన ప్రాజెక్టులో నీటిమట్టం 18.8 అడుగులకు చేరింది. ఈ వర్షం నీటితోనే చాలామంది నాట్లు వేస్తున్నారు. సోమశిల జలాలు కూడా వచ్చే అవకాశం ఉన్నందున ఇబ్బంది రాదనుకుంటున్నాం.

న్యూస్ బాక్స్

హెల్త్ సబ్ సెంటర్ల తనిఖీ

ఉలవపాడు, డిసెంబరు 4 : కరేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వైద్యఆరోగ్య ఉప కేంద్రాలను జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ (డీపీవో)రమేష్, డీపీఏ శ్రీషైనీ ఉలవపాడు, కరేడు హెల్త్ సబ్ సెంటర్లను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. హైరిస్క్ గర్భిణులకు ప్రభుత్వం తరుపున అందుతున్న సేవలు, వ్యాక్సిన్‌లు వాటి తాలుకా ఆన్‌లైన్ రిపోర్టులను పరిశీలించారు. కరేడు పీహెచ్‌సీ వైద్యాధికారి కే శ్రీనివాసులు, పీహెచ్ఎన్ సీతారాములు, ఆరోగ్య కార్యకర్తలు గాయత్రి, పద్మ టాస్క్‌ఫోర్స్ టీం వెంట ఉన్నారు.

ప్రశాంతంగా రైల్వే ఎన్నికలు

బిట్రగుంట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బిట్ర గుంట రైల్వే సెక్షన్ పరిధిలో ట్రేడ్ యూనియన్ ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా సాగాయి. రైల్వేసెక్షన్‌లో పని చేసున్న వివిధ శాఖల కార్మికులు మొత్తం 850 మంది ఉండగా, 314 మంది ఓటు హక్కును వినియోగించుకున్నా రు. విధి నిర్వాహణలో ఉన్న మిగిలిన కార్మికులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు గురువారం కూడా సమయం ఉందని యూనియన్ నాయకులు తెలిపారు. ఈ ఎన్నికలను రైల్వే ఆర్పీఎఫ్ ఎస్సై మహేంద్రబాబు, సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.

పశు వైద్యశిబిరం

అనంతసాగరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) మండలంలోని చిలకలమర్రిలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా గేదెలకు చూడి పరీక్షలు మరియు నట్టల నివారణ మందులను తాపించారు. పాడి సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీడీ శ్రీనివాసులు, ఏడీ గురుజయంతి, డాక్టర్లు ప్రసాద్, సుబ్బారాయుడు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి

ఏఎస్ పేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎల్లవ కాలువ ఆక్రమించి పూడ్చి వేయడంతో వర్షపు నీరు పారే అవకాశం లేక తమ వరి నార్లు నీట మునిగాయని చిరమన గ్రామ రైతులు బుధవారం తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. గతంలో దీనిపై ఫిర్యాదు అందిస్తే ఆయన పరిశీలించి ఆక్రమణలు తొలగించాలని ఆదేశించినా ఆక్రమణలు తొలగలేదని, ఇప్పటికైనా తగు చర్యలు చేపట్టి పంటలను కాపాడాలని కోరారు.

రైతులకు ప్రభుత్వ సహకారం

అల్లూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ప్రభుత్వ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని కావలి ఏడీఏ నాగరాజు అన్నారు. మండలంలోని గ్రద్దగుంటలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

పంటల బీమా చేయించుకోవాలి

వరికుంటపాడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో శనగ, మినుము, పెసర, వేరుశనగ పంటలు సాగు చేసిన రైతులు ఈనెల 15వ తేదీలోపు పంటల బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి రవికుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ-క్రాప్ చేయించుకున్న వెంటనే సంబంధిత పత్రాలతో మీసేవా కేంద్రాల్లో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ప్రీమియం నగదును చెల్లించాలన్నారు. అలాగే వరి సాగు చేసిన రైతులు 31వ తేదీలోపు ప్రక్రియ పూర్తి చేసుకోవాలన్నారు. అలాంటి వారికి మాత్రమే ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందజేయడం జరుగుతుందన్నారు. కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.